

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

visit us @ http://epaper.suryaa.com
శనివారం | 5 జనవరి 2019 | హైదరాబాద్
సంపుటి 12 | సంచిక 67
| పేజీలు 12+16 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi



అనుగ్రహం

శ్రీ విళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత రుతువు, మార్గశిర మాసం, బహుళ పక్ష తిథి : అమావాస్య తె.5.58, నక్షత్రం. మూల మ.3.07 వర్జ్యం మ.1.25 నుంచి 3.08 వరకు, తిరిగి రా.1.31 నుంచి 3.14 వరకు
రాహుకాలం: ఉ.9.00 నుంచి 13.30 వరకు, దుర్ముహూర్తం: ఉ.6.00 నుంచి 7.36 వరకు సూర్యోదయం : ఉ.6.36 గం; సూర్యాస్తమయం: సా.5.41

సంక్షేమానికి నో కోడ్

- ఎన్నికలపై పరిశీలకులదే తుది నిర్ణయం • కేబినెట్ విస్తరణకు కోడ్ అడ్డంకి కాదు • పాత సంక్షేమ పథకాలు అమలు చేయవచ్చు • అభ్యర్థుల ఖర్చు పెరిగితే కఠిన చర్యలు • వ్యయ పరిశీలకులతో సమావేశం • రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి





కొత్త పంచాయతీ చట్టం- 2018, ఎన్నికల విధు లపై అవగాహన కల్పించనున్నారు. అలాగే పంచాయతీ ఎన్నికల్లో ఉపయోగించే బ్యాలెట్ బాక్స్‌లను పరిశీలించారు. పంచాయతీ ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు.



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి : ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి జిల్లా కు పరిశీలకులను ఏర్పాటు చేశామన్నారు. పంచాయతీ ఎన్నికలపై పరిశీలకులదే తుది నిర్ణయమని, రాజకీయ పార్టీలకు అతీతంగా ఎన్నికలు నిర్వహిస్తామని నాగిరెడ్డి స్పష్టం చేశారు. పరిమితికి మించి ఖర్చు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో పాత పథకాలు కొనసాగుతాయని, నాయకుల ఒత్తిడితో పంచాయతీలను ఏకగ్రీవం చేయొద్దని నాగిరెడ్డి సూచించారు. జీహెచ్ఎంసీ, కార్పొరేషన్ల పరిధిలో కోడ్ వర్తించదన్నారు. గ్యాస్ డిస్ట్రిబ్యూటర్స్, రేషన్ డీలర్లు కూడా పోటీ చేయొచ్చునని నాగిరెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీనియర్ ఐఏఎస్‌లు, ఆడిట్ ఆఫీసర్లు పాల్గొన్నారు. అమలులో ఉన్న పథకాలు యథాతథం : ఇప్పటికే అమలులో ఉన్న పథకాలు యథా విధిగా కొనసాగుతాయని.. వాటికి ఎన్నికల కోడ్ వర్తించదని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి స్పష్టం చేశారు. కొత్త పథకాలు చేపట్టరాదని చెప్పారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సాధారణ, వ్యయ పరిశీలకులతో సమావేశం ఏర్పాటు మిగతా 6లో



4 పథకాలు
8 ప్రాజెక్టులు

- మణిపూర్ లో పర్యటించిన మోడీ • 125 కోట్లతో నిర్మించిన ఇంటెగ్రేటెడ్ చెక్‌పోస్టును ప్రారంభించిన పీఎం • ధనమంజురి యూనివర్శిటీలో మౌలిక వసతుల అభివృద్ధికి శంకుస్థాపన • ఎన్ఆర్‌సీ నుంచి అర్హులను తొలగించం : మోడీ

ఇంఫాల్ : ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం మణిపూర్ రాష్ట్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో 8 కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. వాటిలో మోరేలో ఇంటెగ్రేటెడ్ చెక్‌పోస్ట్, దొలైతాబీ బ్యారేజ్, ఆహార నిల్వ గోడౌన్, ఒక రిజర్వాయర్, నోనీ జిల్లాలో టూరిస్ట్ మిగతా 6లో

ఆస్ట్రేలియాలో రిషభ్ చరిత్ర



- ఆస్ట్రేలియాలో సెంచరీ సాధించిన తొలి భారత కీపర్ • 622 పరుగుల వద్ద భారత్ డిక్లేర్ • తొలి ఇన్నింగ్స్‌లో 24 పరుగుల వద్ద ఉన్న ఆసీస్

వివరాలు 12లో

బిందు, కనకదుర్గల నటన?



- ముందు రోజు హోటల్‌లో సాధారణ దుస్తుల్లో • వీడియో విడుదల చేసిన శబరిమల పరిరక్షణ సమితి • కేరళలో కొనసాగుతున్న ఆందోళనలు • కఠిన చర్యలు తప్పవన్న సర్కారు

వివరాలు 11లో



రాఫెల్‌పై అవాస్తవాలు

- దేశాన్ని కాంగ్రెస్ పార్టీ తప్పుదోవ పట్టిస్తోంది • కాంగ్రెస్‌పై నిర్మలా సీతారామన్ మండిపాటు • ప్రతి 'ఏఏ' వెనుకా ఓ 'క్యూ', ఓ 'ఆర్‌వి' • అనిల్ అంబానీ, ఖత్రోచీ, రాబర్ట్ వాద్రాల పేర్లు ప్రస్తావించకుండా విమర్శలు • సెప్టెంబర్ నాటికి తొలి రాఫెల్ యుద్ధ విమానం • సుదీర్ఘ ప్రసంగంలో నిప్పులు చెరిగిన రక్షణ మంత్రి

5 లో

పారిపోయిన మోడీ

- అవినీతి, రాఫెల్ డీల్‌పై మోడీని విచారించాలి • నా ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకుండా మోడీ పారిపోయారు • జైట్లీ ప్రసంగంలో నాపై విమర్శలు తప్ప మరేమీ లేదు • అనిల్ అంబానీకి రాఫెల్ కాంట్రాక్ట్ ఇచ్చింది ఎవరు? • రాహుల్ గాంధీ ప్రశ్నాస్త్రాలు



ఎన్నికలకు ముందే కాంగ్రెస్
పదవుల పంపకాలు

- పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీచేసే పరిస్థితి లేదు • అత్యధిక స్థానాలు ఏకగ్రీవమయ్యేలా చూడాలి • 3400 కుపైగా తాండాలను పంచాయతీలు చేసిన సీఎం కేసీఆర్ • ఎక్కువ శాతం తాండాలన్నీ ఏకగ్రీమవమయ్యే ఛాన్స్ • పార్టీ పటిష్ఠం ద్వారా పార్లమెంట్ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించాలి • శబ్ద విప్లవాన్ని ఉత్తమ్‌కు రుచి చూపించిన తెలంగాణ ప్రజలు • అసెంబ్లీ ఎన్నికల్లో 47 శాతం ఓట్లతో 75 శాతం సీట్లు గెలుపు • కాంగ్రెస్ నేతలకు బుర్రలు పనిచేయడం లేదు ఇప్పట్లో వాళ్లు లేచే పరిస్థితి లేదు • టీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీ రామారావు



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీ చేసే పరిస్థితి లేదని టీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీరామారావు అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ అత్యధిక స్థానాలు కైవసం చేసుకునేలా కార్యకర్తలు పని చేయాలని ఆయన సూచించారు. పంచాయతి ఎన్నికల్లో కార్యకర్తలు సమష్టి గా పని చేసి వీలయినన్ని ఏకగ్రీవం చేసుకోవాలన్నారు. 3400కు పైగా తాండాలను గ్రామ పంచాయతీ లుగా చేసిన ఘనత ముఖ్యమంత్రి కెసిఆర్ దేనని చెప్పారు. తాండాల్లోచాలా చోట్ల ఎన్నికలు ఏకగ్రీవమయ్యే పరిస్థితులున్నాయన్నారు. పార్టీ ని పటిష్టం చేసి పార్లమెంటు ఎన్నికల లోనూ మంచి ఫలితాలు సాధించాలన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన హుజూర్‌నగర్, చొప్పదండి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రానున్నది నిశ్శబ్ద విప్లవమని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ అంటే, వచ్చేది శబ్ద విప్లవమేనని తాను చెప్పానని, తెలంగాణ ప్రజలు శబ్ద విప్లవం అంటే ఏమిటో ఉత్తమ్‌కు రుచి చూపించారని అన్నారు. తెలంగాణ ప్రజలు గుంజి కొడితే, ఆ శబ్ద విప్లవానికి ఉత్తమ్ గూబ పగిలిందంటూ ఎద్దేవా చేశారు. ఉత్తమ్ కుమార్ కు చాలా అహంకారముం దన్నారు. జడ్పీ మీటింగ్ పెడితే ఏనాడూ జానా రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హాజరు కాలేదని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో హుజూర్ నగర్ చరిత్ర తిరగరాయాలని కార్యకర్తలకు చెప్పారు. గెలుపు కోసం పక్కా ప్రణాళికతో పని చేయాలన్నారు. నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ కు చెందిన మిగతా 6లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

జగన్‌పై హత్యాయత్నం కేసులో అనూహ్య మలుపు
రంగంలోకి ఎన్ఐఏ

- వైఎస్ జగన్‌పై హత్యాయత్నం కేసు విచారణ ఎన్ఐఏకి అప్పగింత • విశాఖపట్నం విమానాశ్రయంలో జరిగిన హత్యాయత్నం • ఏపీ హైకోర్టు కీలక ఉత్తర్వులు



అమరావతి,సూర్యబ్యూరో: విశాఖపట్నం ఎయిర్ పోర్టులోని వీవీఐపీ లాంజ్‌లో అక్టోబర్ 25న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై పక్కనే ఉన్న ఫ్యూజన్‌ఫుడ్స్ రెస్టారెంట్‌లో పనిచేస్తున్న శ్రీనివాసరావు కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన సంగతి తెలిసిందే. వైసీపీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై విశాఖపట్నం విమానాశ్రయంలో జరిగిన హత్యాయత్నం కేసును ఏపీ హైకోర్టు ఎన్ఐఏకి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్ జగన్‌పై జరిగిన హత్యాయత్నం కేసుపై శుక్రవారం ఏపీ హైకోర్టు విచారణ జరిపింది. ఎన్ఐఏ యాక్ట్ ప్రకారం కేసును ఎన్ఐఏకి బదిలీ చేయాలని వైఎస్ జగన్ తరపు న్యాయవాది గత విచారణలో కోర్టును కోరారు. కేసు దర్యాప్తు ఆలస్యమైతే సాక్ష్యాధారాలు తారుమారు అయ్యే అవకాశం ఉందని పిటిషనర్ తరుపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ కేసును ఎన్ఐఏకి అప్పగించడంపై కేంద్ర, రాష్ట్రాలను హైకోర్టు గతంలోనే అడిగి తెలుసుకుంది. ఈ కేసును ఎన్ఐఏకి అప్పగించడంపై కేంద్రం నిర్ణయం మిగతా 6లో

అంతే ఇంతే!



ఆమె మాత్రం నేను వెళ్లలేదు అంటోంది సార్

రైతుబంధు 'చెక్కులు' ఆపొద్దు : ప్రభుత్వం కీలక ఆదేశాలు



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: రైతుబంధు పథకంపై అమలుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ ఘనవిజయం సాధించేందుకు, భారీ మెజార్టీ వచ్చేందుకు దోహదపడ్డ 'రైతుబంధు' పథకంలో భాగంగా చెక్కుల పంపిణీపై ప్రభుత్వం సమీక్షించింది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రైతు బంధు చెక్కుల పంపిణీకి కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి ఇవ్వకపోవడంతో, ఎన్నికల సమయంలో రైతులకు చెందిన బ్యాంక్ ఖాతాల్లో రైతుబంధు పరిహారం జమ చేశారు. అయితే ఎన్నికల సమయంలో కొద్ది మంది ఖాతాల్లోనే డబ్బులు జమ అయ్యాయి. మిగతా రైతులకు చెక్కుల ద్వారానే రైతు బంధు పథకం అమలు చేయాలని, ఇందుకుగాను చర్యలు తీసుకోవాలని ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించడంతో అధికారులు అందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇదిలా ఉంటే పంచాయితీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో చెక్కులు పంపిణీపై సందిగ్ధత నెలకొంది. అయితే పాతపథకం అయిన రైతుబంధుకు సంబంధించిన చెక్కుల పంపిణీకి పంచాయితీ ఎన్నికల కోడ్ ఏ మాత్రం అడ్డురాదని శుక్రవారంనాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కె జోషి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రైతుబంధు చెక్కుల పంపిణీ నిరంతర కార్యక్రమం అని ఆయన పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి సీఎస్ రైతుబంధు చెక్కుల పంపిణీ ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేశారు. రైతులకు చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగించాల్సిందే అని ప్రభుత్వం స్పష్టం చేసింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ రైతుబంధు చెక్కుల పంపిణీ కొనసాగిందని పేర్కొంది. చెక్కుల పంపిణీకి ఇబ్బంది లేకుండా చూడాలని జిల్లా అధికారులకు ప్రభుత్వం సూచించింది. రైతుబంధు అమలు జరుగుతున్న పథకమని ప్రభుత్వం పేర్కొంది.

ఈ ఎన్నికలు 'భలే కాస్ట్' గురూ!

- అసెంబ్లీ ఎన్నికల్లో వరదలా పారిన డబ్బు
- స్థానిక సంస్థల ఎన్నికలంటేనే హడలెత్తుతున్న నాయకులు
- అన్ని పక్షాలకూ అదే సమస్య
- రాజకీయ పక్షాలకు పంచాయతీ పోరుఎలా గట్టెక్కించాలి
- తలలు పట్టుకుంటున్న రాజకీయ నాయకులు



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి : పంచాయితీ ఎన్నికలు 'భలేకాస్ట్' గురూ! ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో మునుపెన్నడు లేని విధంగా అభ్యర్థులు భారీ ఎత్తున, డబ్బు ఖర్చుపెట్టారు. ప్రతి గ్రామంలో పోటీ చేసే అభ్యర్థులనుంచి ఓటర్లు నేరుగా డబ్బు, మందు మరీ అడిగితీసుకున్నారు. ఓటు మీకేనంటూ అందరిదగ్గర డబ్బులు తీసుకొని, వారికి నచ్చిన వారికే ఓటు వేసిన విషయం విధితమే!. ఇప్పుడు పంచాయతీ ఎన్నికలంటేనే నాయకులు జంకుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గ్రామాల వారీగా వరదలా పారిన డబ్బు, మద్యం లెక్కలు చూసుకున్న పలువురు నేతలు ఈ రాజకీయం అవసరమా..? అంత ఖర్చు భరించగలమా? అన్న సందిగ్ధంలో ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు పంచాయతీ పోరుకు సై అన్న వారు కూడా తటపటాయిస్తుండటంతో రాజకీయ పక్షాలకు పంచాయతీ పోరునుఎలా గట్టెక్కించాలి దేవుడా అని తలలు పట్టుకుంటున్నారు. గ్రామాల్లో పట్టున్నవారు కూడా ఈ సారి పోటీకి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారని ఆయా రాజకీయ శిబిరాల్లో చర్చజరుగుతోంది.

ఖర్చు తట్టుకోగలమా? : అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు గ్రామాల్లో ప్రచారం మొదలు అన్ని కార్యకలాపాలకు స్థానిక నేతలను ముందు పెట్టుకుని ఖర్చు చేశాయి. డబ్బు పంపిణీ, మద్యం సరఫరా వారి ఆధ్వర్యంలోనే కొనసాగిందన్నది బహిరంగ రహస్యం. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థుల ఖర్చు కోట్లలోనే ఉందనేది అంచనా. ప్రధాన పార్టీలకు దీటుగా ఇతర పక్షాలు కూడా దాదాపు అంతేస్థాయిలో ఖర్చు చేసినట్లు తెలిసింది. నామినేషన్ మొదలుకుని, పోలింగ్ వరకు ప్రచార ఖర్చు, నాయకులు, కార్యకర్తలకు భోజనాలు, మద్యం వంటివి పరిమితం లేకుండా ఖర్చు చేశారు. దీంతో పాటు గ్రామాల్లోని మ హిళా సంఘాలకు, కుల సంఘాలకు, యువజన సంఘాలకు చేయూత పేరుతో ఆకర్షణీయమైన బహుమతులతో పాటు కొంత నగదును కూడా ఇచ్చినట్లు సమాచారం.ఇలా ప్రతి సందర్భంలోను డబ్బును పెట్టుబడిగా పెట్టి రాజకీయం చేసిన నాయకులకు పంచాయతీ ఎన్నికలంటేనే వణుకుపుట్టే స్థితికి చేరుకున్నారు.

వామ్మో అంత ఖర్చే! : పంచాయతీ ఎన్నికల్లో కూడా అవే ఖర్చులు రిపీట్ అవుతాయనే ఉద్దేశంతో పోరుకు ససేమిరా అంటున్నట్లు తెలుస్తోంది. గ్రామాల్లో జనాన్ని ఓట్లు అడగాలంటేనే నా యకులకు భయం పట్టుకుంది. అన్నా ఓటు అంటే.. తమ్ముడు మాకేంటీ ! అన్న సమాధానం వస్తుందని, అసెంబ్లీ ఎన్నికల్లో డబ్బు, మద్యంతో ఓటర్లను ఆకట్టుకున్న వారు పంచాయతీ ఎన్నికలకొచ్చేసరికి, అప్పుడు తప్పు చేశాం.. ఇప్పుడు అనుభవిస్తున్నాం అని వేదాంతం వల్లెవేస్తున్నారు. ఎటూ తప్పదు కదా అన్న రీతిలో రాజకీయ పక్షాలు సర్పంచు పదవులకోసం అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో ఉండగా, చాలామంది ఎన్నికల్లో పోటీ చేసేందుకు ముఖం చాటేస్తున్నారు. ఆ పార్టీ, ఈ పార్టీ అన్న తేడా లేకుండా అన్ని పార్టీలకు ఈ అనుభవం ఎదురవుతుండటం గమనార్హం.

పంచాయతీకి రూ. 10 లక్షలు ఖర్చు : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచు స్థానానికి పోటీ చేసే అభ్యర్థులు చిన్న, పెద్ద పంచాయతీ అన్న తేడా లేకుండా కనీసం రూ. 10 లక్షలు వరకు ఖర్చు చేయాల్సి ఉం టుందని 2013 నాటి ఎన్నికలు గుర్తు చేస్తున్నాయి. కుల బలం ఎక్కువగా ఉన్న చోట ఖర్చు కొంత తగ్గినా మిగిలిన పంచాయతీల్లో ఈ మాత్రం ఖర్చు తప్పదేమో! ప్రస్తుతం చిన్న గ్రామాలు కూడా పంచాయతీలుగా ఏర్పాటయ్యాయి. ఈ సారి సర్పంచులకు కలసి వచ్చే అంశం ఏదైనా ఉందా అంటే, అది కొత్త పంచాయతీ రాజ్ చట్టం -2018 ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తుండటం, రెండు దఫాలు ఒకే రిజర్వేషన్‌లను అమలు చేస్తుండటంతో చిన్న పంచాయతీల్లో పోటీ చేసేందుకు పలువురు ఆసక్తి కనబర్చుతున్నట్లు తెలుస్తోంది. చిన్న పంచాయతీల్లో రూ. 5లక్షల్లోపు బయట పడవచ్చనే నమ్మకంతోనే ముందు కొస్తున్నారు.

శివారు పంచాయితీల్లో పోటీ : హెచ్ఎండీఏ పరిధిలోని పంచాయితీల్లో పోటీ చేసేందుకు పోటీ తీవ్రంగా ఉంది. హెచ్ఎండీఏ పరిధిలోని గ్రామాల్లో లే-అవుట్లు తదితర అవకాశాలుండడంతో పంచాయితీ ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్నారు. రంగారెడ్డి,మెడ్చెల్ ,సంగారెడ్డి జిల్లాలోని పలు గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొంది.

రేపు దుబాయ్‌కి సీఎం కేసీఆర్
మూడు రోజుల పాటు అక్కడే



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్ర శేఖర్‌రావు విదేశీ పర్యటకు వెళ్లబోతున్నారు. రెండోసారి సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఢిల్లీకి వెళ్లి తిరిగొచ్చిన ముఖ్యమంత్రి మొదటి సారిగా విదేశీటూర్ ఖరాయినట్లు సమాచారం. ఈ నెల 6 నుంచి కేసీఆర్ దుబాయ్‌లో పర్యటించనున్నారు. మూడు రోజుల పాటు దుబాయ్‌లో ఆయన పర్యటన కొనసాగనుంది. దుబాయ్‌లోని తెలంగాణ వాసులతో కేసీఆర్ భేటీకానున్నారు. దుబాయ్‌లోతెలంగాణ సంక్షేమ సంఘం నేతలతో సైతం భేటీ కానున్నారు.

రాష్ట్ర వార్షిక బడ్జెట్ తయారీకి ఆర్థిక శాఖ కసరత్తు



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర వార్షిక బడ్జెట్ తయారీ కసరత్తుకు ఆర్థిక శాఖ శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో అన్ని శాఖల నుంచి ఆర్థిక శాఖ ప్రతిపాదనలు కోరింది. ఈ నెల 11వ తేదీ వరకు అన్ని శాఖలు ప్రతిపాదనలు ఇవ్వాలని ఆదేశించింది. కిందిస్థాయి నుంచి వచ్చిన ప్రతిపాదనలపై ఆయా శాఖలు తమ అభిప్రాయాలను ఈ నెల 18వ తేదీ వరకు పంపాలి. ప్రతిపాదనలను ఆన్ లైన్ లోనే పంపాలని ఆర్థిక శాఖ సూచించింది. 2018-19 సవరణ బడ్జెట్ 2019-20కి బడ్జెట్ అంచనాలు పంపాలని ఆర్థిక శాఖ కోరింది.

తెలంగాణ హైకోర్టుకు సంక్రాంతి సెలవుల ప్రకటన



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: హైకోర్టుకు ఈనెల 7 నుంచి 18 వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించారు. ఈ సెలవుల్లో జనవరి 10న వెకేషన్ బెంచ్ ఏర్పాటు చేస్తారు. ఈ బెంచ్‌లో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ షమీమ్ అఖ్తర్, జస్టిస్ పి.కేశవరావులతో కూడిన ధర్మాసనం పనిచేస్తుంది. అత్యవసర కేసులు దాఖలు చేసే న్యాయవాదులు ఈనెల 8న తమ కేసులను దాఖలు చేయవచ్చని హైకోర్టు రిజిస్ట్రర్ జనరల్ తెలిపారు.

సుప్రీం కోర్టుకు బీసీలు

పంచాయతీల్లో రిజర్వేషన్లు తగ్గించడం అన్యాయం

- సుప్రీం కోర్టు తీర్పును సాకుగా చూపడం సరి కాదు
- గత 2010లోనే సుప్రీం కోర్టు తీర్పు వచ్చింది
- 2013, 14 నాటి ఎన్నికలల్లో 34శాతం రిజర్వేషన్లే అమలు
- సుప్రీం కోర్టులో వాదన వినిపించడంలో ప్రభుత్వం విఫలం
- ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల 1400 సర్పంచ్ పదవులు బీసీలకు దూరం
- భద్రాచలం జిల్లాలో ఒక్క బీసీ సర్పంచ్ పదవికి నోచుకోవద్దా
- మేడ్చల్ జిల్లాలో 12, వరంగల్లో 18 స్థానాలు మాత్రమేనా?
- 42 మండలాల్లో బీసీలు సర్పంచ్ పదవులకు అర్హులు లేరా?
- బీసీలకు 34శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిందే
- మంత్రివర్గం నిర్ణయం లేకుండా ఆర్డినెన్స్ ఎలా జారీ చేస్తారు?
- గతంలో హర్యానా ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్ రద్దు
- రాజ్యాంగాన్ని సవరించి..శాశ్వత పరిష్కారం చూపాలి
- బీసీల రిజర్వేషన్లపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య



హైదరాబాద్, మేజర్‌న్యూస్: పంచాయతీ ఎన్నికలల్లో బీసీల రిజర్వేషన్లు తగ్గించడం అన్యాయమని బీసీ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఒక వైపు చట్ట సభలల్లో బీసీలకు జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తుండగా..మరోవైపు సుప్రీం కోర్టు తీర్పు సాకుతో పంచాయతీ ఎన్నికలల్లో బీసీల రిజర్వేషన్లను 34శాతం నుంచి 22కు తగ్గించడం సమంజసమేనా అని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని బీసీలు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య స్పష్టం చేశారు. బీసీల ఆత్మగౌరవం కోసం దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీం కోర్టును ఆశ్రయిస్తామని వెల్లడించారు. శుక్రవారం ఎన్నికల నోటిఫికేషన్‌పై హైకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు మరోసారి తిరస్కరించింది. ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో ఆర్డినెన్స్‌ను రద్దు చేయలేమని, బీసీల రిజర్వేషన్ల అంశంపై ఇక్కడ న్యాయం జరగలేదని భావిస్తే..సుప్రీం కోర్టుకు వెళ్లవచ్చని సూచించింది. హైకోర్టు సూచనమేరకు న్యాయం కోసం సుప్రీం కోర్టులో ప్రభుత్వ తీరును ఎండగడతామని కృష్ణయ్య తెలిపారు. మంత్రి వర్గం నిర్ణయం లేకుండా ఆర్డినెన్స్‌ను జారీ చేయడం రాజ్యాంగ విరుద్ధం అన్నారు. గతంలో హర్యానా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్‌ను ఆ రాష్ట్ర హై కోర్టు రద్దు చేసిన విషయాన్ని తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పును సాకుగా చూపిస్తూ బీసీల రిజర్వేషన్లను తగ్గించడం సరికాదన్నారు. సుప్రీం కోర్టు 2010లోనే రిజర్వేషన్లపై తీర్పు ఇచ్చిందని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఈ ఆర్డినెన్స్‌తో 1400 సర్పంచ్ పదవులు బీసీలకు దక్కడం లేదన్నారు. భద్రాచలం జిల్లాలో ఒక్క సర్పంచ్ పదవి కూడా బీసీలకు దక్కడంలేదని, మేడ్చల్ జిల్లాలో 12, వరంగల్లో 18 సర్పంచ్ స్థానాలు మాత్రమే బీసీలకు దక్కాయని తెలిపారు. తెలంగాణలోని 550 మండలాల్లోని 42 మండలాల్లో బీసీలకు ఒక్క సీటూ దక్కక పోవడం అన్యాయం అన్నారు. 1993లో 73-74 రాజ్యాంగ సవరణ చేసినప్పుడు ఎస్సీ, ఎస్టీ, మహిళలకు జనాభా రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యాంగాన్ని సవరించారు. కానీ బీసీల రిజర్వేషన్ల విషయంలో రాష్ట్రాల స్వేచ్ఛకు వదిలిపెట్టారు. బిసి రిజర్వేషన్లకు రాజ్యాంగ బద్ధత లేకపోవడంతో హైకోర్టులు-సుప్రీం కోర్టులు పదే పదే జోక్యం చేసుకొని బిసి రిజర్వేషన్లు ఎత్తివేసే కుట్రలు చేస్తున్నారని, అందుకోసం ప్రధానమంత్రి జోక్యం చేసుకొని పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ బిల్లు పెట్టి బీసీలకు జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించేలా చర్యలు చే పట్టాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. అలాగే బి.సి రిజర్వేషన్ల పై హైకోర్టు లో పెండింగ్ లో ఉన్న ఇంటరియమ్ స్టే ఆర్డర్ ను వెంటనే తొలగించడానికి చర్యలు తీసుకోవాలి. దీని కోసం ప్రముఖులైన సీనియర్ అద్వొకేట్లను డిల్లి నుంచి పిలిపించి వాదించాలి. సుప్రీంకోర్టు తీర్పు కొత్తగా వచ్చింది కాదు 2010లోనే తీర్పు వచ్చింది సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన తర్వాత 2013 లో గ్రామ పంచాయతీ ఎన్నికలు 2014 ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలు బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు జరిపారు. అప్పటి ప్రభుత్వం సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం బిసి రిజర్వేషన్లను 34 శాతం నుంచి 22 శాతం కు తగ్గించడానికి జీవో జారీ చేసింది, వెంటనే బీసీ సంఘాలు ఉద్యమాలు చేయగా అప్పటి ముఖ్యమంత్రి బీసీ సంఘాలతో చర్చలు జరిపి సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేసి, ప్రముఖులైన న్యాయవాదులను పెట్టి స్టే తీసుకువచ్చి 34 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు జరిపారు. ఇప్పుడు కూడా అదే పద్దతిలో ఎందుకు జరుపకూడదని ప్రశ్నించారు. ఇక మంత్రి వర్గ నిర్ణయం లేకుండా అంత తొందరడా బి.సి రిజర్వేషన్లు తగ్గిస్తూ ఆర్డినెన్సు జారి చేయవలసిన అవసరం ఏమొచ్చింది. పక్క రాష్ట్రమైన లో బి.సి రిజర్వేషన్లను తగ్గించలేదు. ఎన్నికలు పెట్టడం లేదు. అక్కడ లేని తొందర ఎక్కడేందుకు అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వంపై చేసే న్యాయ పోరాటానికి బీసీలు ఐక్యంగా కదలి రావాలని కృష్ణయ్య పిలుపునిచ్చారు.

బీసీ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తులు ఆహ్వానం



హైదరాబాద్, మేజర్‌న్యూస్: 2018-19 విద్యా సంవత్సరానికి సంబంధించి బీసీ పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ అధికారి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఆక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని బీసీ విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ పాస్ వెబ్‌సైట్ ద్వారా స్కాలర్‌షిప్‌లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ప్రకటనలో సూచించారు.

ఎస్సీ యువతకు నైపుణ్య శిక్షణ ఏర్పాటు



హైదరాబాద్, మేజర్‌న్యూస్: ఎస్సీ నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ ట్రేడుల్లో ఉచితంగా నైపుణ్య శిక్షణనిచ్చి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వ యంత్రాంగం కార్యాచరణ రూపొందించింది. కుటుంబ వార్షికా దాయం రూ.2లక్షలు మించకుండా 18-35 ఏళ్ల వయసున్న అభ్యర్థులు ఉచిత శిక్షణకు అర్హులని పేర్కొంది. అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఈ నెల 7 నుంచి 10 వరకు నగరంలోని నాలుగు ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు. ప్రతిరోజు ఉదయం 11గంటల నుంచి సాయంత్రం వరకు అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించి అర్హత, ఆసక్తిని బట్టి ఆయా ట్రేడులలో శిక్షణ కోసం ఎంపిక చేస్తారు. ఇందుకు నియోజవకవర్గాల వారీగా హరిజన బస్తీలను ఎంపిక చేశారు. అభ్యర్థులకు శిక్షణనిచ్చేందుకు 16 ప్రధాన శిక్షణ సంస్థలతో ఎస్సీ కార్పొరేషన్ ఒప్పందం కుదుర్చుకుంది. శిక్షణ అనంతరం ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపట్టనున్నారు.

'పంచాయతీ'కీ 'రాజకీయ సెగ!

- పార్టీ రహిత ఎన్నికలైనా పార్టీలు ప్రత్యేక దృష్టి
- అన్ని పంచాయతీల్లో సానుభూతిపరుల గెలుపునకు కృషి
- అధికార టీఆర్ఎస్, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్, టీడీపీ, ఇతర రాజకీయ పక్షాల పార్టీలు గ్రామాలపై ఆధిపత్యం



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: తెలంగాణాలో రాజకీయ పార్టీల జోక్యం ఎక్కువైపోతున్నది. ప్రభుత్వ శాఖలు, అధికారుల పనితీరు, గ్రామాల అభివృద్ధి, లబ్ధిదారుల ఎంపిక ఇలా అన్నింటిలో రాజకీయపార్టీలు జోక్యం అధికమైపోతోంది. రాజకీయ పార్టీల జోక్యం అధిగమవ్వడంతో ఆందోళన వ్యక్తం అవుతున్న సమయంలో పల్లెలకు పట్టుకొమ్మలుగా బావిస్తున్న గ్రామ పంచాయితీ ఎన్నికల్లో సైతం పార్టీల జోక్యం ప్రారంభమైంది. పంచాయితీ ఎన్నికలు పార్టీలకతీతంగా జరుగుతున్నా...పార్టీల జోక్యం మాత్రం తగ్గడం లేదు. గ్రామాల్లో తమ పార్టీకి చెందిన సానుభూతిపరులే (పార్టీ కార్యకర్తలు) గెలిచేందుకు రాష్ట్రంలోని అన్ని పార్టీలు స్కెచ్ వేస్తున్నాయి. ముఖ్యంగా ముఖ్యమైన పంచాయితీల్లో పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, మాజీ మంత్రులు జోక్యంతోనే పంచాయితీ సర్పంచ్‌లు, వార్డు సభ్యుల ఎంపిక జరుగుతోంది. దీంతో పల్లెల్లో రాజకీయ సెగ మొదలైంది. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే షెడ్యూల్ ప్రకటించింది. ఈ నెలలోనే మూడు విడతల్లో జరగనున్న ఎన్నికలకు రాజకీయ పార్టీలు సిద్ధమవుతున్నాయి. వాస్తవానికి ఈ ఎన్నికలు పార్టీ రహితమైనప్పటికీ... సర్పంచ్ పదవులపై పార్టీలన్నీ దృష్టిపెట్టి పావులు కదుపుతున్నాయి. అధికార టీఆర్ఎస్, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్, టీడీపీ, ఇతర రాజకీయ పక్షాలు గ్రామాలపై ఆధిపత్యం కోసం కాచుక్కూర్చున్నాయి.

డిసెంబర్‌లో ముగిసిన శాసనసభ ఎన్నికల్లో జిల్లాలోని ఆరు స్థానాల్లో 88చోట్ల విజయం సాధించిన టీఆర్ఎస్ గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాలని చూస్తోంది. ఇప్పటికే ఆ పార్టీ నాయకత్వం తమ ఎమ్మెల్యేలకు సర్పంచ్ ఎన్నికల బాధ్యత అప్పజెప్పింది. రాష్ట్రంలో టీఆర్ఎస్ అధికారంలో ఉండడంతో ఆ పార్టీ తరపున బరిలోకి దిగడానికి పోటీ ఎక్కువగా ఉంది. తమకే టికెట్ దక్కేలా చూడాలని ఆ పార్టీ నాయకులు ఒత్తిడి పెంచుతున్నారు. రిజర్వేషన్లు కూడా ఖరారు కావడంతో ఏ గ్రామపంచాయతీలో ఏ వర్గానికి చెందినవారు పోటీ చేయాలో తేలిపోయింది.

మెజారిటీ పంచాయతీల్లో తమకు అనుకూలంగా రిజర్వేషన్ వచ్చిన చోట, నాయకులు ఎక్కువగా ఉన్నచోట ఈ ఎన్నికల్లో పోటీకి డిమాండ్ పెరిగింది. ప్రధానంగా జనరల్ స్థానాల్లో ఒకరికి మించి ఎక్కువ మంది ఆశావహులు ఉండడం, ఎవరో ఒకరిని మాత్రమే పోటీకి పెట్టాల్సి ఉండడంతో వారందరినీ సముదాయించే పనిలో స్థానిక నేతలు బిజీగా ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 12,732 పంచాయతీలకు ఎన్నికలు జరుగుతున్నాయి. పంచాయితీల్లో తమ పట్టును మరింత పెంచుకుని రానున్న పార్లమెంట్, పంచాయతీరాజ్ స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో తిరుగులేని విజయాలు సాధించేందుకు గ్రామ పంచాయతీ పోరునే ప్రధాన వేదికగా ఉపయోగించుకోవాలని టీఆర్ఎస్ నాయకత్వం భావిస్తోంది. ఈ కారణంగానే ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం కూడా వీటిని సవాల్‌గా తీసుకొని జిల్లా నాయకత్వానికి మార్గదర్శనం చేస్తోంది.

పార్టీ రహిత ఎన్నికలైనా! : పంచాయతీ ఎన్నికలు పూర్తిగా పార్టీ రహితమైనవి అయినా... పల్లెల్లో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన వారే పోటీ పడుతున్నారు. ఆయా పార్టీలనుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నాయకులు కూడా ఇందులో ఉండడం గమనార్హం. ఈ కారణంగానే శాసనసభ ఎన్నికలు ముగియగానే మరోమారు రాజకీయ నాయకుల పర్యటనలతో గ్రామాలు వేడెక్కుతున్నాయి. దాదాపు ఏడాదికాలంగా పంచాయతీ ఎన్నికల కోసం ఎదురుచూస్తున్న కిందిస్థాయి నాయకులు ఈసారి అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లో వదులుకోకూడదన్న నిర్ణయంతో ఉన్నారు. మరోవైపు సర్పంచ్ టికెట్ల కోసం పోటీపడుతున్న నేతలను బుజ్జగించే పనిలో ఎమ్మెల్యేలు ఉన్నారు.

పంచాయితీల్లో పట్టుకోసం కాంగ్రెస్ : శాసనసభ ఎన్నికల్లో ఫలితాలు ఎలా వచ్చినా.. గ్రామీణ ప్రాంతంపై తమ పట్టు నిలుపుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ కారణంగానే ఆ పార్టీ నేతలు సైతం తమ శ్రేణులను ఉత్సాహ పరుస్తున్నారు. ఈనెల 21, 25, 30 తేదీల్లో మూడు విడతలుగా జరగనున్న ఈ ఎన్నికల్లో తమ బలం చూపించాలని కోరుతున్నారు. అయితే సర్పంచ్ ఎన్నికలు సైతం ఆర్థిక అంశంతో ముడిపడినవే కావడం, ఎన్నికల ఖర్చును భరించగల ఆర్థిక స్తోమత ఉన్నవారే పోటీ చేయాలని కాంగ్రెస్ నాయకత్వం సూచిస్తోంది. మరోవైపు టీడీపీ,బీజేపీ, వామపక్ష పార్టీలు సైతం గతం నుంచి తమకు బాగా పట్టున్న గ్రామాల్లో గెలిచి తీరాలన్న ప్రయత్నాలనుముమ్మరం చేశాయి.

'చైనా మాంజా'పై నిషేధం
స్వచ్ఛంద సంస్థలు, మీడియాతో ఫారెస్ట్ అధికారులు



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: సంక్రాంతి పండగను అందరూ ఆనందంగా జరుపుకోవాలి. కానీ పతంగుల వల్ల పర్యావరణం, పక్షులకు హాని జరగకుండా చూడాలి. చైనీస్మాంజా (చైనా దారం) వాడకం వల్ల తీవ్ర అనర్థాలు జరుగుతున్నాయి. కైట్స్ ఎగరవేసేందుకు గ్లాస్ కోటింగ్ తో ఉన్న నైలాన్ , సింథటిక్ తాడు వాడుతున్నారు. పండగ తర్వాత ఎక్కడికక్కడ ఈ వ్యర్థాలు మిగిలిపోయి పర్యావరణం, పక్షులకు హాని జరుగుతోంది. దారంలో చిక్కుకున్న పక్షులు విలవిల్లాడి, చనిపోతున్నాయి. మనుషులు కూడా గాయపడుతున్నారు. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల (11.07.2017) మేరకు తెలంగాణ రాష్ట్రంలో కూడా చైనామాంజా వినియోగాన్ని నిషేధించాం. ఇతర శాఖలతో సమన్వయంతో మాంజా వాడకాన్ని అడ్డుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఎన్జీవోల సహకారంతో అందరికీ అవగాహన కల్పిస్తున్నాం. వారితో కూడా ప్రత్యేక సమావేశం నిర్వహించాం. చైనా మాంజా అమ్మినా, నిలువ, రవాణా చేసినాఐదేళ్ళు జైలు శిక్ష, లక్ష రూపాయల దాకా జరిమానా. మాంజా వాడకం వల్ల మనుషులకు, పక్షులకు హాని జరిగితే 3 నుంచి 7ఏళ్ల దాకా జైలు శిక్ష , పదివేల జరిమానా...గత మూడేళ్ళులో900కిలోల దాకా నైలాన్మాంజా సీజ్ చేసాం. 123కేసులు బుక్ చేసాం.ఓల్డ్ సిటీలోనే ఎక్కువ మాంజా సీజ్ చేసాం, చైనా దారం దిగుమతి వల్ల స్థానికంగా కాటన్ తో పంతుగుల దారం తయారు చేసేవాళ్లు ఉపాధి కోల్పోతున్నారు. చైనా మాంజా రవాణా చేస్తే వాహనాలు కూడా సీజ్ చేస్తామని హెచ్చరించాము.



మీ పదవుల కోసం బి.సి రిజర్వేషన్ల తాకట్టు పెడుతారా బి.సి సంఘాల ధ్వజం

హైదరాబాద్, మేజర్‌న్యూస్ : గ్రామ పంచాయతీ, ఎంపిటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బి.సి రిజర్వేషన్లను 34 శాతం నుంచి 22కు తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారి చేసిన ఆర్డినెన్సు ఉపసంహరించుకోవాలని బి.సి సంఘాలు ఉద్యమాలు చేస్తున్నాయి. ఒకవైపు న్యాయం కోసం బీసీలు కోర్టులలో న్యాయ పోరాటం చేస్తుంటే అధికార పార్టీలోని కొందరు బి.సి నాయకులు బి.సి సంఘాల పై విమర్శలకు దిగడం శోచనీయం. ఇది బి.సి నాయకులకు తగదు. తగ్గించిన బి.సి రిజర్వేషన్లను పెంచాలని ముఖ్యమంత్రికి నచ్చ చెప్పి న్యాయం చేయడానికి ప్రయత్నించాలి. కానీ అందుకు భిన్నంగా తెలంగాణలోని 2 కోట్ల మంది బి.సి ల పక్షాన పోరాడుతున్న బి.సి సంఘాలను విమర్శించడం సమంజసమేనా అని బీసీ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. శుక్రవారం 12 బీసీ సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బీసీ నేతలు గొరిగె మల్లేష్ యాదవ్, టీఆర్.చందర్, నీల వెంకటేష్, ఉపేందర్ గౌడ్, అంజి, నర్సింహగౌడ్, రాజేందర్, బర్క కృష్ణ, మధుసూదన్, వెంకన్న, నటరాజ్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తగ్గించిన రిజర్వేషన్లను యధా, తదంగా పునరుద్ధరించాలని కోరడం తప్పా అని ప్రశ్నించారు. టీఆర్ఎస్ పార్టీలోని బి.సి నాయకులు పెంచవద్దని అంటారా అని ప్రశ్నించారు. బి.సి రిజర్వేషన్లను పెంచడానికి ప్రభుత్వం ప్రత్యామ్నయ మార్గాలున్నాయి. అందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. దీన్ని పాజిటివ్‌గా తీసుకోవాలి. కాని ఎదురుదాడి సరికాదు సంస్కారం కాదని హితవు పలికారు.

చుక్కల భూముల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు

24 నాటికి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు

అమరావతి, జనవరి 4: దీర్ఘకాలంగా ఉన్న చుక్కల భూముల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఈ సమస్యను ఈ నెల 24వ తేదీ నాటికి పరిష్కరించాలని ప్రభుత్వం శుక్రవారం జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం తనంతట తానుగా చుక్కల భూముల వునఃపరిశీలిం చాలని నిర్ణయం తీసుకుంది. చుక్కల భూముల పూర్వాపరాలను పరిశీలిస్తే స్వాతంత్ర్యం రాక ముందు 1906లో దేశవ్యాప్తంగా భూముల సర్వే జరిగింది. అ తర్వాత 1954లో రీ సర్వే చేశారు. ఆ తర్వాత ఇప్పటి వరకు సర్వే గానీ, రీ సర్వే జరగలేదు. దీంతో భూమి హక్కులకు సంబంధించి 1954 నాటి రెవెన్యూ రికార్డులే ప్రామాణికంగా ఉన్నాయి. 1954లో రీ సర్వే జరిగినప్పుడు రెవెన్యూ రికార్డుల్లో సర్వే నెంబర్ వారీగా ఖాతాదారుల పేర్లు, విస్తీర్ణం నమోదు చేశారు. అయితే, ఎవరూ యాజమాన్య హక్కు కోరని భూముల వద్ద రికార్డుల్లో చుక్కలు (డాట్స్) పెట్టారు. దీంతో అప్పటి నుంచి ఈ భూములను చుక్కల భూములు (డాటెడ్ ల్యాండ్స్)గా పిలుస్తున్నారు. 1954 తరువాత ఆ భూములను సాగు చేసుకునేవారికి ఎటువంటి యాజమాన్య హక్కులు లేవు. వాటిని బదిలీ చేసుకునే, అమ్ముకునే అవకాశం లేదు. దాంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. భూమి హక్కుల కోసం రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేస్తున్నారు. ఏళ్లు గడుస్తున్న కొద్దీ ఇది పెద్ద సమస్యగా తయారైంది. దాంతో ఈ సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వం తనంతతానుగా నిర్ణయం తీసుకుంది. రిజిస్ట్రేషన్ చట్టం-1908 లోని 22-ఏ1లో నిషేధిత ఆస్తుల జాబితా నుంచి చుక్కల భూములను తొలగిస్తూ 2017 జూలై 14న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ జారీ చేసిన ఆదేశాల ప్రకారం ఇక ముందు ఏవైనా రైతుల ఆధీనంలో సాగులో ఉన్న చుక్కల భూములు ప్రైవేటు పట్టా భూములుగా పరిగణిస్తారు. చుక్కల భూములకు సంబంధించిన సర్వేనెంబర్లు, ఇతర వివరాలను రెవెన్యూ శాఖ ఆయా జిల్లాలలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు పంవుతుంది. ఆ భూములను స్వాధీనంలో ఉంచుకున్నవారు సాగు చేసుకుంటున్నవారు ప్రభుత్వం నిర్ణయించిన పత్రాలలో ఏదోఒకటి చూపిస్తే ఆ భూమి వారికి సంబంధించినదిగా రిజిస్టర్ లో వారి పేరు నమోదు చేస్తారు. 2017 జూలై 14వ తేదీకి ముందు 12 ఏళ్లు ఆధీనంలో ఉన్నట్లు ఏవైనా ఆధారాలు చూపినా రిజిస్టర్‌లో వారి పేరు నమోదు చేస్తారు. చుక్కల భూములకు సంబంధించి రెవెన్యూ శాఖ వద్ద, తహశీల్దార్ కార్యాలయంలో పరిశీలనలో ఉన్న వాటిని, ఫిర్యాదులు, విజ్ఞప్తులను రెవెన్యూ సిబ్బంది తమంతట తాముగా పరిశీలిస్తారు. వాటికి కూడా ఇవే నిబంధనలు వర్తిస్తాయి. ఆర్వోఆర్ చట్టం ప్రకారం 1బి రిజిస్టర్ 2వ కాలమ్ లో నమోదైన పట్టాదారు పేరుని సరిచూసుకొని తదనుగుణంగా 1బి రిజిస్టర్ 8వ కాలమ్ లో కొనుగోలు లేదా వారసత్వం లేదా వంశపారంపర్యం అని నమోదు చేసినవాటిని నిషేధిత జాబితా నుంచి తొలగిస్తారు. 8వ కాలమ్ లో ఏమీ రాయకపోయినా పట్టాదారు భూమిగా పరిగణించి నిషేధిత జాబితా నుంచి తొలగిస్తారు. 8వ కాలమ్ లో 1954కు ముందు ఇచ్చిన డి పట్టా, డికెటి పట్టా, అసైన్ మెంట్ భూములు అని నమోదు చేసినట్లైతే వాటిని కూడా నిషేధిత జాబితా నుంచి తొలగిస్తారు. 1954 తరువాత ప్రభుత్వం ఇచ్చిన భూములు నిషేధిత జాబితాలోనే కొనసాగుతాయి. చుక్కల భూములు పరిశీలన పూర్తి అయిన తరువాత తుది జాబితాని తహశీల్దార్ కార్యాలయాల వద్ద ప్రదర్శనకు పెడతారు. వాటిలో ఏవైనా



అభ్యంతరాలు ఉంటే, తెలియజేస్తే రెవెన్యూ శాఖ పరిశీలిస్తుంది. అభ్యంతరాల పరిశీలన తరువాత సవరించిన తుది జాబితాని ప్రకటిస్తారు. భూముల వున:పరిశీలన పూర్తి అయిన తరువాత నిషేధిత భూముల నుంచి చుక్కల భూములతోపాటు ఇతర భూములను తొలగించిన సెక్షన్ 22-ఏ1 (ఏ) టు (డి) కొత్త జాబితాని నేరుగా రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు పంపాలని ప్రభుత్వం జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. సెక్షన్ 22-ఏ1(ఇ) జాబితాని నేరుగా ప్రభుత్వనికి పంపాలని, ప్రభుత్వం దానిని గెజిట్ లో ప్రచురిస్తుంది. ఈ నెల 24వ తేదీ లోపల ఈ ప్రక్రియ పూర్తి కావాలని ఆ దేశాలలో ప్రభుత్వం పేర్కొంది. తాజా వివరాలతో కూడిన మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలోని రెవెన్యూ అధికారులకు పంపాలని, సంబంధిత వివరాలను వెంటనే ప్రభుత్వానికి పంపాలని ప్రభుత్వం కలెక్టర్లను ఆదేశించింది.

కేసీఆర్‌ను ప్రధాని చేయడమే మా లక్ష్యం

ఎన్నారై సౌతాఫ్రికా - 2019 క్యాలెండర్ ఆవిష్కరించిన ఎంపీ కవిత



హైదరాబాద్ , మేజర్‌న్యూస్: ఎన్నారై సౌతాఫ్రికా - 2019 క్యాలెండర్ ను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత టీఆర్ఎస్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ ఎన్నారై సౌతాఫ్రికా శాఖ ఉమ్మడి కార్యదర్శి కంకనాల వెంకటరమణా రెడ్డి, ఈవెంట్స్ ఇంచార్జ్ కుశల్ దేశాయి, కోశాధికారి హరీశ్ రంగా, మెదసాని శ్రవంతి నరేందర్ రెడ్డి, పాశం నరేశ్, కంకనాల శిరీష రమణారెడ్డి, ఊరె హరిష వంశీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ ఎన్నారై సౌతాఫ్రికా శాఖ అధ్యక్షులు గుర్రాల నాగరాజు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికల్లో టీఆర్ఎస్ తరుపున ప్రచారం చేసి పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని ఫెడరల్ ఫ్రంట్ లక్ష్యాలను ప్రపంచ వ్యాప్తంగా తెలియజేసేలా ప్రచారం చేస్తామని చెప్పారు.

జగన్ దమ్ము, ధైర్యం ఉన్న నాయకుడు

వైసీపీ మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి



రాజమహేంద్రవరం,సూర్యబ్యూరో: వైసీపీ అధ్యక్షుడు, ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దమ్ము, ధైర్యం ఉన్న నాయకుడని వైసీపీ మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి వ్యాఖ్యానించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైఎస్ జగన్‌పై జరిగిన హత్యాయత్నం కేసు దర్యాప్తును ఎన్.ఐ.ఎకి ఇస్తూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను స్వాగతిస్తున్నామని, న్యాయస్థానంపై తమకు అపార నమ్మకం ఉందని అన్నారు. ఖచ్చితంగా ఎన్.ఐ.ఎ విచారణలో దోషులందరూ బయటపడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. హత్యాయత్నం కుట్ర వెనుక ఏపీ ప్రభుత్వ పెద్దలు ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తులు ఉన్నారని తాము ఆ గతంలోనే చెప్పినట్లు తెలిపారు. భగవం తుడు పజల ఆశీస్సులతో జగన్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని అన్నారు. జగన్ పాదయాత్ర ద్వారా కొన్ని లక్షల మంది ప్రజలను కలుసుకుని, వారి సమస్యలను విన్నారని చెప్పారు.

వైసీపీలో చేరుతున్న సినీ నటుడు అలీ



శ్రీకాకుళం,సూర్యబ్యూరో: ప్రముఖ టాలీవుడ్ కమెడియన్ అలీ వైసీపీలో చేరుతున్నారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో వైసీపీ అధినేత జగన్ సమక్షంలో వైసీపీ తీర్థం పుచ్చుకోనున్నారు. జనవరి 9న జగన్ పాద యాత్ర ముగియనుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేస్తున్న భారీ సభలో అలీ వైసీపీలో చేరుతారు. డిసెంబర్ 28న శంషాబాద్ ఎయిర్ పోర్టులో జగన్‌ను అలీ కలిశారు. ఈ సందర్భంగా వైసీపీలో చేరాలనే ఆకాంక్షను జగన్ వద్ద వ్యక్తపరిచారు. అలీ రాజమండ్రికి చెందిన వ్యక్తి కావడంతో ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లో పార్టీ బలోపేతం అవుతుందని భావిస్తున్నారు. అలీ సినీ గ్లామర్ పార్టీకి ప్లస్ అవుతుందని అంటున్నారు.

బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి

- విద్యుత్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సమావేశం డిమాండ్
- 7 న రాష్ట్ర బిసి విద్యుత్ ఉద్యోగుల మహా సభలు



హైదరాబాద్, మేజర్‌న్యూస్: బి సి విద్యుత్ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని క్రిమిలేయర్ ఎత్తివేయాలని బి.సి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యానగర్ బి.సి భవన్ లో జరిగిన రాష్ట్ర బి.సి విద్యుత్ ఉద్యోగుల సంఘ, విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిదిగా ఆర్.కృష్ణయ్య విచ్చేసి ప్రసంగించారు. ఈ నెల 7 హైదరాబాద్ ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియం లో మధ్యాహ్నం 2 గం. లకు బి.సి విద్యుత్ ఉద్యోగుల భారీ భహిరంగ సభ జరుగనుందని సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుమార స్వామి , ప్రధాన కార్యదర్శి వెంకన్న గౌడ్ ప్రకటించారు. అనంతరం ఆర్.కృష్ణయ్య ప్రసంగిస్తూ బి.సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టడానికి చట్టపరమైన, రాజ్యాంగా పరమైన , న్యాయపరమైన అవరోధాలు, అడ్డంకులు ఏమీలేవు. కేంద్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకపోవడం, బి సి వ్యతిరేక వైకరి అవలంబించడం మూలంగానే పెట్టలేదు. రాజ్యాంగ బద్ధమైన మండల్ కమీషన్ బి సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని సిఫార్సు చేసింది. చట్టబద్ధమైన పార్లమెంటరి కమిటీ ఛైర్మన్ నాచియప్పన్ కమిటీ బి సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని సిఫార్సు చేసింది. ఇక ఇటీవల సుప్రీంకోర్టు ఉత్తర్రపదేశ్ రిజర్వేషన్ల కేసు సందర్భంగా జనాభా ప్రకారం ఉద్యోగుల సంఖ్య లేకపోతే బీసీ లకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని తీర్పు చెప్పింది. అన్ని వైపుల నుంచి బి సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని సిఫార్సులున్నాయి. ఉంటే కానీ కేంద్ర ప్రభుత్వం ప్రమోషన్లలలో రిజర్వేషన్లు పెట్టకుండా బి.సి లకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు.

కేంద్రస్థాయి ఉద్యోగాలలో 54 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగాలు ఉంటే బి సి ఉద్యోగులు కేవలం 7 లక్షల 50 వేలకే పరిమితం అయ్యారు. దేశ జనాభా లో 56 శాతం ఉన్న బి.సిలకు 14 శాతం ప్రాతినిధ్యం మాత్రమే ఉంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 71 సం. రాల తర్వాత కూడా బి.సిలకు న్యాయం జరగడం లేదు. వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలలో, ప్రభుత్వరంగ సంస్థలు, కార్పొరేషన్లు, బ్యాంకింగ్, రక్షణ రంగం నుండి మొదలుకొని రాష్ట్రపతి, ప్రధానమంత్రి కార్యాలయాల వరకు బి సి లకు ప్రాతినిథ్యం లేదు. బి సి ఉద్యోగులు అటెండర్లు, వాచ్ మెన్లు గానే మిగిలిపోతూ, గెజిటెడ్ అధికారి కాకుండానే పదవి విరమణ చేస్తున్నారు. మండల్ కమీషన్ సిఫార్సు ప్రకారం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాలలో 27 % బి సి రిజర్వేషన్లు ప్రవేశపెట్టిన 25 సంవత్సరాల తరువాత కూడా బి.సి ఉద్యోగుల శాతం పెరుగక పోవడం శోచనీయం. ఉద్యోగుల సంఖ్య 12.శాతం దాటకపోవడం బి సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించకపోవడం వల్లనే ఇంత అన్యాయం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, యాదగిరి, డాక్టర్ చంద్రుడు, అశోక్ కుమార్, రవీందర్, మేఘనాథ్, నీల వెంకటేష్, అనంతయ్య, దయనంద్ తదితరులు ప్రసంగించారు.

ఏపీలో ప్రతిపక్ష వైసీపీ విఫలం

- అసెంబ్లీని బాయ్‌కాట్ చేయడం సరికాదు
- కేరళలో అవినీతి కనిపించదు
- ఏపీ శ్వేతపత్రాల్లో అసత్యాలు
- రూ. 20 కోట్లు ఖర్చుపెట్టి పోలవరం టూర్లు వేస్తున్నారు
- మీడియా సమావేశంలో ఉండవల్లి



విశాఖపట్నం,సూర్యబ్యూరో: ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్ష వైసీపీ విఫలం అయిందని పార్లమెంటు మాజీ సభ్యుడు ఉండవల్లి అరుణ్ కుమార్ అభిప్రాయపడ్డారు. అసలు అసెంబ్లీని బాయ్ కాట్ చేయడం సరికాదని వ్యాఖ్యానించారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డిపై వ్యక్తిగతంగా అవినీతి ఆరోపణలు లేవని తెలిపారు. విశాఖపట్నంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పైఅధికారులు నీతిగా ఉంటే కిందిస్థాయి ఉద్యోగులు నిజాయతీగా పనిచేస్తారని ఉండవల్లి అన్నారు. కేరళకు వెళితే అక్కడ అవినీతి అనేదే ఉండదనీ, కమ్యూనిస్టులు అధికారంలో ఉన్నా, కాంగ్రెస్ అధికారంలో ఉన్నా పారదర్శక పాలన ఉంటుందని తెలిపారు. అలా ఉంటేనే కేరళ ప్రజలు నాయకులకు ఎన్నికల్లో ఓటు వేస్తారని చెప్పారు. కానీ ఏపీలోమాత్రం అవినీతి చేయకుంటే ఓటు వేయరని సంచలన వ్యాఖ్యలు చేశారు. అందుకే ఇక్కడ ప్రజల నుంచే అవినీతి మొదలయిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ అవినీతి జరిగిందనీ, అయితే చంద్రబాబు హయాంలో జరిగినంత దారుణంగా అయితే లేదని స్పష్టం చేశారు. మే నెలలో పోలవరంలో నీళ్లు ఉండవని చెప్పినా చంద్రబాబు వినలేదు అప్పుడే ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు ఈసారి ఇచ్చిన శ్వేతపత్రాల్లో అసత్యాలు ఉన్నాయని అనుమానం కలుగుతోందని పార్లమెంటు మాజీ సభ్యుడు ఉండవల్లి అరుణ్ కుమార్ తెలిపారు. రాజకీయ నాయకులు కాకుండా అధికారుల సమక్షంలో వీటిపై చర్చ జరగాలని అభిప్రాయపడ్డారు. అయితే దీనిపై స్పందించేందుకు ఏపీ ప్రభుత్వం ముందుకు రాలేదని విమర్శించారు . పోలవరం ద్వారా మే నెలలో నీళ్లు ఇస్తామని గతంలో చాలాసార్లు చంద్రబాబు ప్రకటించారని గుర్తుచేశారు. దీంతో తాను స్పందిస్తూ దయచేసి ఇలాంటి మాటలు చెప్పకండి. అలా చేయడం కుదరదు. ఎందుకంటే మే నెలలో నదిలో నీళ్లు ఉండవు అని చెప్పానని అన్నారు. అయినా ప్రభుత్వం వినిపించుకోలేదన్నారు.ఏపీ ప్రభుత్వం దాదావు రూ.20 కోట్లు ఖర్చు పెట్టి ప్రజలను డ్యామ్ వద్దకు తీసుకెళ్లి పోలవరం ఎలా కడుతున్నామో చూపిస్తోందని విమర్శించారు. పదేళ్లు ఉమ్మడి రాజధాని అని చట్టంలో ఉన్నప్పుడు ప్రతీదానికీ తాత్కాలిక భవనాలు కట్టాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. అసెంబ్లీ జరిగినా, ప్రతిపక్షం రాదనీ, తిరుగుబాటు చేసిన బీజేపీ కూడా పెద్దగా ప్రశ్నించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. వైజాగ్ లో చంద్రబాబు మూడు సార్లు మీటింగులు పెట్టి రూ.18 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు శ్వేతపత్రంలో ప్రకటించారని అన్నారు. ఇదంతా తప్పుడు డేటా అనీ, ప్రభుత్వం పరిశ్రమలు స్థాపించినట్లు చెబుతున్న కొన్నిచోట్ల తాను పర్యటించాననీ, అక్కడ ఎలాంటి నిర్మాణాలు లేవని స్పష్టం చేశారు.

టీడీపీలో నేను చేరితే తప్పేంటి?

ఏపీ ప్రజల కోసమే నేను పోరాడుతున్నా : సినీ నటుడు శివాజీ



అమరావతి,సూర్యబ్యూరో: రాజకీయ అరంగేట్రంపై ప్రముఖ సినీ నటుడు శివాజీ క్లారిటీ ఇచ్చేశారు. తాను రాజకీయాల్లోకి రాబోతున్నానని ప్రకటించారు. ఆంధ్ర ప్రదేశ్‌లో ప్రతిపక్షం ఉన్నప్పటికీ తన పాత్రను సక్రమంగా నిర్వర్తించలేకపోయిందని విమర్శించారు. శుక్రవారం ఈ సందర్భంగా మీరు టీడీపీలో చేరతారా? అని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు శివాజీ కొంచెం తీవ్రంగానే స్పందించారు. తనకు టీడీపీలో చేరే హక్కు ఉందని ఆయన తెలిపారు. టీడీపీలో చేరడంలో తప్పు ఏముందని ప్రశ్నించారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై కుట్రలు జరుగుతున్నాయని శివాజీ పునరుద్ఘాటించారు. తాను ఏపీ ప్రజల కోసం పోరాడుతున్నాననీ, టీడీపీ ప్రభుత్వం కోసం పనిచేయడం లేదని స్పష్టం చేశారు. తనకు అసెంబ్లీలో అధ్యక్షా! అనే హక్కులేదా? అని ప్రశ్నించారు. ఏపీలో ప్రతిపక్షం తన పాత్రను సమర్థవంతంగా నిర్వహించడం లేదన్నారు. ఏపీలో బీజేపీ ఆపరేషన్ గరుడ అమలు చేయబోతోందని ఆమధ్య శివాజీ చెప్పి, సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే.

దమ్ముంటే చంద్రబాబు చేపట్టిన 5 పథకాలను చెప్పాలి

- జేసీ దివాకర్ రెడ్డి చంద్రబాబును తిడుతున్నాడో పొగుడుతున్నాడో అర్థం కావట్లేదు
- సీఎం చంద్రబాబు ఇప్పుడు డ్రామా నాయుడిగా మారుతున్నారు
- రూ. 500 కోట్లు పెట్టి 2 స్థానాలు దక్కించుకున్నారు
- అప్పులు తీసుకురావడం తప్ప చేసిందేమీ లేదు
- రెండు నెలల్లో హైకోర్టు భవనం కట్టలేకపోయారు
- బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు



న్యూఢిల్లీ,సూర్యబ్యూరో: ఆంధ్రప్రదేశ్ కు మిగతా రాష్ట్రాల కంటే రెట్టింపు నిధులు వచ్చాయని అప్పటి ప్రభుత్వంలో పనిచేసిన ఉన్నతాధికారి దినేశ్ కుమార్ చెప్పారని బీజేపీ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు తెలిపారు. ఎన్డీయే కూటమి నుంచి విడిపోయాక కూడా ఏపీకి ఉపాధి హామీకింద రూ.6,000 కోట్లు ఇచ్చామని ప్రధాని మోదీ స్వయంగా చెప్పారని గుర్తుచేశారు. కానీ అంతా మేమే చేశాం అని టీడీపీ ప్రభుత్వం చెప్పుకోవడం సరికాదన్నారు. చేసిన సహాయాన్ని మరిచి ఏ చెట్టు కొమ్మపై కూర్చున్నామో దాన్నే నరుక్కున్న ఘనత చంద్రబాబుదని దుయ్యబట్టారు. ఢిల్లీలో ఈరోజు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు ఉదయాన్నే రోజుకో కొత్త డ్రామా స్క్రిప్ట్ రాస్తున్నారనీ, అందుకు అనుగుణంగా టీడీపీ పార్లమెంటు సభ్యులు గోల చేస్తున్నారని తెలిపారు. తెలంగాణలో రూ.500 కోట్లు ఇచ్చి 2 సీట్లు తెచ్చుకున్నారంటే రేవు ఏపీలో ఎంత ఖర్చు పెట్టబోతున్నారో అర్థం అవుతుందని వ్యాఖ్యానించారు. రెండం తస్తుల హైకోర్టు భవనాన్ని కట్టలేకపోయిన చంద్రబాబు ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద నగరాన్ని నిర్మిస్తానని ప్రగల్భాలు పలుకుతున్నారని విమర్శించారు. ఇక పార్లమెంటు సభ్యుడు జేసీ దివాకర్ రెడ్డి చంద్రబాబును తిడుతున్నాడో.. పొగుడుతున్నాడో.. అర్థం కాకుండా మాట్లాడతాడని జీవీఎల్ ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.1.50 లక్షల కోట్ల అప్పులను తీసుకురావడం తప్ప సాధించింది ఏమీ లేదని బీజేపీ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు విమర్శించారు. గతేడాది డిసెంబర్ 15 కల్లా హైకోర్టు భవనం పూర్తవుతుందని చెప్పిన చంద్రబాబు, ఇప్పుడు సడెన్ గా విభజన చేశారంటూ కొత్త పాట అందుకున్నారని దుయ్యబట్టారు. దీన్ని మతిమరుపు అనుకోవాలా? లేక రాజకీయ బలుపు అనుకోవాలా? అని ప్రశ్నించారు. మీడియా గొంతు ఉంది కదా అని ఎంతోకాలం తప్పించుకోలేరని స్పష్టం చేశారు. టీడీపీ నేతలు అన్నాడీఎంకే పార్లమెంటు సభ్యుల్లాగా మనం కూడా కొంచెం తమాషా చేద్దాం అనుకుని వెల్ లోకి వెళ్లి ఆందోళన చేసి సస్పెండ్ అయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతీ రాజకీయ నాయకుడు ప్రజల కోసం కూలీలాగానే పనిచేయాలనీ, నేతలంతా సేవకులేనని వ్యాఖ్యానించారు. ఏ పనిని, హోదాను తక్కువ చేసి మాట్లాడటం సరికాదని తెలిపారు. మెలో డ్రామా చేస్తే రాజకీయాల్లో పేరు వస్తుందని చంద్రబాబు భావిస్తున్నారని జీవీఎల్ పేర్కొన్నారు. సినిమా రంగంలో రామానాయుడు ఎంతో గొప్పవారనీ, ఆయన చాలా మంచి సినిమాలను తెరకెక్కించారని అదే రీతిలో ఏపీ సీఎం చంద్రబాబు ఇప్పుడు డ్రామా నాయుడుగా మారుతున్నారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. దమ్ముంటే చంద్రబాబు చేపట్టిన 5 ప్రముఖ పథకాలను చెప్పాలని సవాల్ విసిరారు. దేశంలోనే 9.5 లక్షల ఇళ్లను అంటే దాదాపు ఆరోవంతు ఇళ్లను కేంద్రం ఏపీకి కేటాయించిందని అన్నారు.

ఐరిస్‌తోనూ రేషన్ సరకులు

16 జిల్లాల్లో 5186 షాపుల్లో ప్రారంభం

ఐరిస్ విధానాన్ని పరిశీలించిన కమిషనర్ అకున్ సబర్వాల్



హైదరాబాద్, మేజర్‌న్యూస్: ప్రజా పంపిణీ ద్వారా రేషన్ సరుకులు తీసుకోవడానికి లబ్దిదారులకు మరింత సులువుగా ప్రయోజనం కలిగించేలా తెలంగాణ పౌరసరఫరాల శాఖ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా వేలిముద్రలతో పాటు కనుపాపల (ఐరిస్) ఆధారంగా లబ్దిదారులకు సరుకుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఈ నెల ఒకటవ తేదీ నుంచి మొదటి విడతలో 16 జిల్లాల్లోని 5186 షాపులల్లో ప్రారంభించింది. దాదాపు ఏడాది నుంచి పౌరసరఫరాల శాఖ ఈపాస్ (బయోమెట్రిక్) విధానం ద్వారా సరుకుల పంపిణీ చేస్తోంది. అయితే ఈ విధానంలో కొంతమందిలో ముఖ్యంగా వృద్ధులు, మహిళల వేలిముద్రలు అరిగిపోవడం వల్ల ఈపాస్ మెషీన్‌లు ధృవీకరించడం లేదు. దీంతో ప్రతినెల రేషన్ సరుకులు తీసుకునేందుకు అబ్దిదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. లబ్దిదారులు అసౌకర్యానికి గురికావద్దనే ఉద్దేశంతో వేలిముద్రలు సరిపడని చోట ఆయా ప్రాంతాల్లో విఆర్వో, విఏవో, పౌరసరఫరాల శాఖ ఇన్స్పెక్టర్లకు అథంటికేషన్ సౌకర్యం కల్పించింది. కొన్ని చోట్ల దుర్వినియోగమవుతున్న విషయం అధికారుల పరిశీలనలో వెల్లడైంది. ఈ సమస్యలను అధిగమించడానికి ఐరిస్ విధానం పరిష్కారమని భావించిన పౌరసరఫరాల శాఖ అధికారులు రాష్ట్రంలోని 17200రేషన్ షాపుల్లో దశల వారీగా ఐరిస్ విధానం అమలుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ఈనెల ఒకటవ తేదీ నుంచి మొదటి విడతలో 16 జిల్లాల్లోని 5186షాపుల్లో ఐరిస్ విధానాన్ని ప్రారంభించింది. శుక్రవారం సిరిసిల్ల, సిద్ధిపేట జిల్లాల్లోని రేషన్ షాపుల్లో ఐరిస్ విధానం అమలు తీరును కమిషనర్ అకున్ సబర్వాల్ పరిశీలించారు.

గొంగడి సునీతకు కేబినెట్‌లో బెర్త్ దక్కేనా?

- సునీత మంచి హోదా కల్పిస్తానన్న సీఎం కేసీఆర్
- మంత్రివర్గంలో స్థానం కల్పిస్తారన్న ఆశతో క్యాడర్



హైదరాబాద్, మేజర్‌న్యూస్: ఆలేరు గౌరవం పెంచుతామన్న ముఖ్యమంత్రి కేసీఆర్ హామీతో యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతకు మంత్రివర్గంలో అవకాశం దక్కే అవకాశాలు లేకపోలేదన్న వాదనలు పార్టీ వర్గాల్లో వినిపిస్తున్నాయి. కేసీఆర్ ప్రభుత్వంలో ఎవరికి ఏ పదవి దక్కుతుందనే ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. యాదాద్రి భువనగిరి జిల్లాలోనూ ఇప్పుడు ఇదే అంశంపై చర్చ జరుగుతోంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆలేరు సభలో కేసీఆర్ మాట్లాడుతూ సునీత తన బిడ్డలాంటిదనీ, ఈసారి ఎమ్మెల్యేగా గెలిచాక ఆమె హోదా పెరుగుతుందనీ, ఆలేరు గౌరవం పెంచుతామంటూ హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో గొంగడి సునీత మంత్రి అవుతారనే ఊహాగానాలు జోరందుకున్నాయి. గత సర్కార్‌లో గొంగిడి సునీత ప్రభుత్వ విప్‌గా వ్యవహరించారు. ఈ దఫా ఆమె మంత్రి పదవిపై ఆశతో ఉన్నారని నియోజకవర్గ కార్యకర్తలంటున్నారు. కొత్త క్యాబినెట్‌లో తనకు అవకాశం లభిస్తుందని సన్నిహితుల వద్ద ఆమె ఆశాభావం వ్యక్తంచేసినట్లు తెలుస్తోంది. కేసీఆర్ తన క్యాబినెట్‌లో సామాజికవర్గాల వారీగా, జిల్లాల వారీగా అవకాశాలు కల్పిస్తారనీ, ఈ నేపథ్యంలో సునీత హోదా పెరుగుతుందనీ పరిశీలకులు కూడా అంచనా వేస్తున్నారు. ఉమ్మడి జిల్లాపరంగా చూస్తే ఇప్పటికే క్యాబినెట్ రేస్‌లో జగదీష్‌రెడ్డి, గుత్తా సుఖేందర్‌రెడ్డి ఉన్నారు. ఈ తరుణంలో సునీతకు అవకాశం లభిస్తుందా? లేదా? అనే ప్రశ్న పార్టీ కార్యకర్తలను వేధిస్తోంది. అయితే క్యాబినెట్‌లో మహిళలకు స్థానం కల్పించే పక్షంలో ఈసారి సునీతకు మంత్రి పదవి దక్కడం ఖాయమని మరికొంతమంది భావిస్తున్నారు. ఆలేరు టీఆర్ఎస్ శ్రేణులు మాత్రం మేడంకు మంత్రి పదవి ఖాయం" అనే ఉత్సాహంతో ఉన్నారు. రెడ్డి సామాజికవర్గానికి చెందిన విద్యావంతురాలు కావడం, వరుసగా రెండుసార్లు మంచి మెజారిటీతో గెలవడం సునీతకు కలిసివచ్చేఅంశాలని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇలా సునీత హోదా పెరిగే అంశంపై ఎవరికి వారు రకరకాలుగా చర్చించుకుంటున్నారు. ఇప్పటికే ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించిన సునీతకు రానున్నా రోజుల్లో ఎలాంటి హోదా లభించబోతోందన్నది మాత్రం ప్రశ్నార్థకంగా మారింది.

సంపాదకీయం

editpage@suryaa.com

తీహార్ జైలులో పెరిగిపోతున్న ఖైదీల సంఖ్య

న్యూఢిల్లీ : చలికాలం ఇంట్లో ఉండడమే చాలా కష్టంగా ఉంది. ఏ దిక్కూ లేక రోడ్ల మీద పడుకునే వారి పరిస్థితి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. అయితే, వారు రోడ్లపై నిద్రించలేక నేరాలకు పాల్పడుతున్నారట. దేశ రాజధాని ఢిల్లీలో రహదారులపై నిద్రించేవారు చాలా ఎక్కువ. వారిలో ఎక్కువ మంది చలిని తట్టుకోలేక నేరాలకు పాల్పడుతున్నా రట. తీహార్ జైలులో ఖైదీల సంఖ్య పెరిగిపోతోందట. దీనికి కారణం తెలుసుకుని జైలు అధికారులే నివ్వెరపోయారట. తీహార్ జైలు సామర్థ్యం 10027 మంది. కానీ ప్రస్తుతం అక్కడ 16 వేల మంది ఉన్నారు. దీనిపై తీహార్ జైలు అధికారి ఒకరు మాట్లాడుతూ, శీతా కాలంలో చలికి రోడ్లపై ఉండడం కంటే జైలులో ఉండాలనే ఉద్దేశంతో కొంత మంది నేరాలకు పాల్పడుతున్నట్టు తెలిసిందన్నారు. శీతాకాల సమయంలో వీధుల్లో నిద్రించేవారికి ప్రభుత్వం రగ్గులు పంపిణీతో పాటు శిబిరాలను ఏర్పాటు చేసేదని, ఆ సమయంలో జైలులో ఖైదీల సంఖ్య తక్కువగా ఉండేదని జైలు అధికారి వెల్లడించారు.

మోడీపై ట్రంప్ వెటకారమా?

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వదేశంలో తన ప్లాన్‌లకు ఎదురవుతున్న అవరోధాలతో దిక్కు తోచని స్థితిలో పడినట్లున్నారు. అందుకే ఆయన ఇటీవల తీసుకుంటున్న కొన్ని చర్యలు విమర్శలకు దారి తీస్తున్నాయి. అమెరికా అంతర్జాతీయ కాపలాదారు ఏమీ కాదంటూ సిరియా నుంచి తమ సేనలను ఉపసంహరించుకోనున్నట్లు ప్రకటించారు. ఆ ప్రకటనపై ఆక్షేపణలు వ్యక్తమైనప్పటికీ ఖాతరు చేయనట్లుగానే ఆఫ్ఘనిస్తాన్ నుంచి కూడా తమ సేనలను వెనుకకు రప్పించే ఆలోచనలో ఆయన ఉన్నారు. అంత వరకు బాగానే ఉన్నా ట్రంప్ మధ్యలో ఈ వ్యవహారంలోకి భారత్‌ను లాగే యత్నం చేశారు. అంతే కాదు. ఈ సందర్భంలో భారత ప్రధాని నరేంద్ర మోడీపై ఆయన వ్యంగ్యోక్తులు విసిరారు. ఆఫ్ఘనిస్తాన్‌లో భారత్ సాగిస్తున్న సహాయ కార్యక్రమాలను ట్రంప్ కించపరుస్తూ, అక్కడ మరింత బాధ్యతను భారత్ మోయాలని కోరారు. అక్కడ భారత్ సాయంతో నిర్మించిన పార్లమెంట్ భవనాన్ని ఒక గ్రంథాలయంగా ట్రంప్ భావిస్తున్నారు. అయినా ఆ గ్రంథాలయం వల్ల ఎందరికి ప్రయోజనమని ఆయన అభిప్రాయం. ట్రంప్ బుధవారం వైట్ హౌస్‌లో విలేకరులతో మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోడీ ఆఫ్ఘనిస్తాన్‌లో ఓ గ్రంథాలయాన్ని నిర్మించినట్లు చెబుతూ ఉంటారని అన్నారు. దానికి ఖర్చు పెట్టిన సొమ్ము ఎంతో తెలుసా అని ట్రంప్ అడిగారు. మనం 5 గంటల్లో ఖర్చు చేసే సొమ్మును ఆ గ్రంథాలయానికి ఖర్చు పెట్టారని ఆయన పేర్కొన్నారు. ఆ గ్రంథాలయాన్ని ఆఫ్ఘనిస్తాన్‌లో ఎవరు ఉపయోగించుకుంటున్నారో తెలియదని ట్రంప్ అన్నారు. ట్రంప్ తీరు ఎంతైనా ఆక్షేపణీయం. ఆయన ఒక విషయం మరచిపోయినట్లున్నారు. ప్రచ్ఛన్న యుద్ధం దరిమిలా ఆఫ్ఘనిస్తాన్‌లో అస్థిరత సృష్టికి అమెరికా పోషించిన పాత్ర ఏమీ తక్కువ కాదు. కాని తాలిబన్ హయాంలో మినహా ఆఫ్ఘనిస్తాన్‌కు భారత ప్రభుత్వం మిత్ర దేశంగా ఇతోధిక పాత్ర పోషిస్తూనే ఉన్నది. 7/11 దాడి అనంతరం ఆఫ్ఘనిస్తాన్‌లో అల్ ఖైదా, తాలిబన్ ఉగ్ర సంస్థలపై అమెరికా సాగించిన యుద్ధంలో భారత్ పాల్గొనలేదు. అందుకు భారత్ చిరకాలంగా అనుసరిస్తున్న విధానమే కారణం. ఐక్యరాజ్య సమితి (యుఎన్) తరపున శాంతి పరిరక్షణ బాధ్యతల నిర్వహణ కోసమే భారత్ విదేశాలకు తన సైనిక దళాలను పంపుతుండడమే ఆ విధానం. ఆ ప్రాంతంలో తన (అమెరికా) భద్రత ప్రయోజనాలపై ఆ దేశం రాజీ పడాలని గాని, తమ దళాలను ఉపసంహరించుకోవాలన్న ఆ దేశ నిర్ణయాన్ని మార్చుకోవాలని గాని భారత్ కోరుకోవడం లేదు. అయితే, ఆఫ్ఘనిస్తాన్‌లో ప్రధాని నరేంద్ర మోడీకి ఎదురవుతున్న సవాళ్లను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పరిగణనలోకి తీసుకోవడం ముఖ్యం. భారత చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్ ఉగ్ర సంస్థ తాలిబన్ సాయంతో ఆఫ్ఘనిస్తాన్‌లో పలుకుబడిని ఎంతగానో ఉపయోగిస్తున్నది. వాస్తవానికి చైనా ప్రాబల్యాన్ని ఆసియాలో తగ్గించేందుకు అమెరికా, భారతదేశం కలసి పని చేస్తున్నప్పటికీ, డొనాల్డ్ ట్రంప్ భారతదేశ కృషిని చిన్న చూపు చూస్తున్నారు. ఈ వైఖరి రాజకీయ పార్టీలను, సాధారణ ప్రజానీకాన్ని బాధించింది.

ఆ విషయం అలా ఉంచితే, ఆఫ్ఘనిస్తాన్‌కు భారత్ భారీ స్థాయిలో ఆర్థిక సహాయం అందజేస్తున్నది. యుద్ధంతో కల్లోలితమైన ఆ దేశంలో పలు అభివృద్ధి ప్రాజెక్టుల కోసం భారత్ 3 బిలియన్ డాలర్లకు పైగా అందజేసింది. ఆఫ్ఘన్ పార్లమెంట్ కొత్త భవనం, ఇరాన్ సరిహద్దు వరకు సరకుల రవాణా, సేవల కోసం ప్రధాన రోడ్డు, విద్యుత్ ట్రాన్స్‌మిషన్ లైన్, ఒక డ్యామ్ వంటివి ఆ ప్రాజెక్టులలో ఉన్నాయి. అక్కడ భారత్ సైనిక శిక్షణ కూడా అందిస్తోంది. ఆఫ్ఘన్ పునర్నిర్మాణం ప్రక్రియ వల్ల ఆ దేశ ప్రజల జీవితాలలో, ఇంకా చెప్పాలంటే మొత్తం సమాజంలో గణనీయమైన మార్పు సిద్ధిస్తుంది.

అయితే, ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా భారీ స్థాయిలో చేస్తున్న వ్యయంతో పోలిస్తే భారత్ అందజేస్తున్న మొత్తం చిన్నదిగా కనిపించవచ్చు. కాని ఆర్థికంగా, సైనిక పరంగా రెండు దేశాల మధ్య గల అపార అంతరాన్ని పరిగణనలోకి తీసుకుంటే భారత్ ఆర్థిక సహాయంపై పోలికలు తేవడం అసమంజసం అనాలి. ఇది ఇలా ఉండగా, ఆఫ్ఘనిస్తాన్‌కు భారతదేశం అందిస్తున్న సహకారంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై భారతీయ జనతా పార్టీతో పాటు కాంగ్రెస్ కూడా విరుచుకుపడడం గమనార్హం.

ట్రంప్ మరొక విషయం మరచిపోతున్నారు. ఆఫ్ఘనిస్తాన్ నుంచి అమెరికన్ సేనల సంఖ్యను సగానికి తగ్గిస్తామని ప్రకటించి ఆ దేశం భద్రతకు మరింత ముప్పు తీసుకువస్తున్నారు. అమెరికన్ సేనలు స్వదేశానికి తిరిగి వెళ్లిన మరుక్షణం ఆఫ్ఘనిస్తాన్‌లో మళ్లీ తిష్ట వేయడానికి పాక్ అండగా ఉన్న తాలిబన్ శక్తులు సిద్ధంగా ఉన్నాయి. వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన ఆ ప్రాంతంలోకి దొడ్డి దారి గుండా పాకిస్తాన్ ప్రవేశించకుండా భారత్ తన వంతు జాగ్రత్తలు తీసుకోవలసి ఉంటుంది.

ఆట మొదలైందా !



– ఇస్కా రాజేష్‌బాబు,
'సూర్య' అమరావతి బ్యూరో చీఫ్,
96520 39780

- ఏపీలో పొత్తులపై ఆసక్తికరమైన చర్చ
- ఎన్నికల్లో త్రిముఖ పోటీకి పార్టీలు సిద్ధం
- రాష్ట్రం కోసం కలసి రావాలన్న చంద్రబాబు
- వామపక్షాలతో కలుస్తామంటున్న పవన్
- వారంలో తేలుస్తామన్న రఘువీరారెడ్డి
- పవన్ ఒంటరి పోరుతో ఎవరికి లాభం ?

'నవ్యాంధ్ర సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ పార్టీల ఆట మొదలైంది. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అన్ని రాజకీయ పార్టీల నేతలు ఎన్నికల గోదాలోకి దిగాయి. పార్టీల అధినేతలు గెలుపు కోసం టికెట్లు ఎవరికి ఇవ్వాలన్న దానిపై దృష్టి సారించాయి. ఇప్పటికే సంక్రాంతి కంటే ముందుగానే అభ్యర్థుల ప్రకటన ఉంటుందని అధికార పార్టీతో పాటు ప్రతిపక్ష పార్టీ కూడా ప్రకటించిన నేపథ్యంలో సిట్టింగ్ ఎమ్మెల్యేలతో పాటు టికెట్ ఆశిస్తున్న నేతల్లో టెన్షన్ మొదలైంది. ఏ పార్టీ ఏపార్టీతో పొత్తు పెట్టుకుంటుందన్న చర్చ జోరందుకుంది. రాష్ట్రం అభివృద్ధి కోసం తమతో పవన్ కలిసి రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ఆహ్వానించారు. అయితే ఎవరికి వారు ఈ ఎన్నికల్లో సొంతంగా పోటీ చేసి సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతుండడంతో ఏపీలో ఈసారి త్రిముఖ పోటీ తప్పదని తెలుస్తోంది...'

ఆంధ్రప్రదేశ్‌లో మూడు ప్రధాన రాజకీయ పార్టీలు అన్ని స్థానాల్లో పోటీ చేయడం ఖాయమని స్పష్టమవుతోంది. ఎవరు ఎవరితో పొత్తు పెట్టుకున్నా సీట్ల దగ్గర మాత్రం ఒంటరిపోరు తప్పదని ఓటర్లు భావిస్తున్నారు. ప్రస్తుతం ఏపీలో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. చలికాలంలో రాజకీయ హడావుడి పెరిగింది. ఓ వైపు పార్టీలు తమ అభ్యర్థులను ఇప్పటికే ఎంపిక చేసుకుని సంక్రాంతి తరువాత పార్టీ అభ్యర్థులను ప్రకటించేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. అయితే రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ ప్రతి జిల్లాలో నిర్వహించిన సర్వేలో చంద్రబాబు మళ్లీ అధికారంలోకి రావాలని ఓటర్లు కోరుకుంటున్నట్లు టీడీపీ వర్గాలు అంటున్నాయి. పార్టీలోని అసంతృప్తులను దారిలోకి తెచ్చుకోని పక్షంలో 2014లో వారు ఎలా పార్టీ విజయానికి కృషి చేశారో అలాగే ఇప్పుడు అడ్డం తిరిగి గడ్డు పరిస్థితి ఎదుర్కోక తప్పదన్న హెచ్చరికలు కూడా టీడీపీని వెంటాడుతున్నాయి. టీడీపీతో జనసేన కలుస్తుందంటూ జరిగిన ప్రచారానికి పవన్‌కళ్యాణ్ తెరదించడంతో ఇక ఎవరి పార్టీ వారిదే అన్నది స్పష్టమైంది. ఇక భారతీయ జనతాపార్టీ లక్ష్యం నెరవేర్చేందుకు జగన్‌ను, పవన్‌ను కలపాలన్న ఆలోచనను ఓటర్లు ఎంతవరకు స్వాగతిస్తారన్నది ప్రశ్నార్థకమేనని చెప్పవచ్చు. మరోవైపు ఓటమి భయంతోనే చంద్రబాబు ఇలా మాట్లాడుతున్నారని సీపీఐ నేత నారాయణ వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో వామపక్షాలతో కలిసి ముందుకు వెళ్లనున్నట్టు జనసేనాని ట్వీట్ చేయడం ఆసక్తికరంగా మారింది. కేంద్రంపై పోరాటానికి పవన్‌కళ్యాణ్ ముందుకు రావాలని పిలుపునిచ్చిన తరుణంలో ఆయన 175 నియోజకవర్గాల్లోనూ పోటీ చేస్తామని ప్రకటించారు. అలాగే యువతరంతో




పాటు మహిళలకు ఎక్కువ అవకాశాలను ఇస్తామని, 25 సంవత్సరాల యువత భవిష్యత్ కోసం తాము పనిచేస్తామని, అనుభవజ్ఞులైన కొత్తవారికి అవకాశం ఇస్తామని పవన్ ప్రకటించడంపై కూడా పొత్తులపై సందిగ్ధత ఏర్పడింది. 2019 సార్వత్రిక ఎన్నికల కోసం పవన్‌కళ్యాణ్ కూడా పార్టీని బలోపేతం చేసేందుకు జనవరి 1 నుంచి అమరావతిలోనే మకాం వేశారు. ఇందుకోసం జిల్లాల వారీగా సమావేశాలకు శ్రీకారం చుట్టారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ టీడీపీ పొత్తు ఉంటుందా ? లేదా ? అన్నది వారం రోజుల్లో స్పష్టం చేస్తామని పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి చెబుతున్నారు. పొత్తులపై అధిష్టానానిదే తుది నిర్ణయమని ప్రకటించడం వెనుక హస్తినలోనే దీనికి ప్రణాళిక సిద్ధమవుతున్నట్లు సమాచారం. అసెంబ్లీ, లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థుల జాబితా కూడా సిద్ధం చేసినట్లు చెబుతున్నారు. 2019లో రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతూ 175 నియోజకవర్గాలలో క్షేత్రస్థాయి నేతలతో, పార్టీ సీనియర్లతో సేకరించిన అభిప్రాయాలను రాహుల్‌గాంధీ సమక్షంలో ఉంచారు.

జనసేనలో సరికొత్త జోష్ : తెలుగుదేశం, ప్రతిపక్ష వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీతో ఎన్నికల్లో పొత్తు ఉండదని, తాము ఒంటరిగా పోటీ చేస్తామని జనసేనాని పవన్ కుండబద్ధలు కొట్టినట్లు ప్రకటించిన తరుణంలో ఆ పార్టీ నేతల్లో జోష్ కనిపిస్తోంది. పవన్ ప్రకటనపై రెండు పార్టీల నేతలు లోలోన ఆందోళన చెందుతున్నా పైకి మాత్రం పవన్ ఒంటరి పోరు తమకు మేలు చేస్తుందని చెబుతున్నారు. అయితే పవన్ ఒంటిరి పోరు ఇరుపార్టీలకు నష్టమేనన భావన వ్యక్తమవుతోంది. 2014 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ, బీజేపీ కలిసి పోటీ చేయగా టీడీపీకి పవన్‌కళ్యాణ్ తమ మద్దతు ప్రకటించారు. వైసీపీ స్వల్పంగా ఓట్ల తేడాతో అధికారాన్ని కోల్పోవాల్సి వచ్చింది. అప్పట్లో పవన్ వల్లనే టీడీపీ అధికారంలోకి రావడం కారణమని ప్రకటించారు. మున్సిపల్, పంచాయతీ ఎన్నికలలో టీడీపీ దాదాపు క్లీన్ స్వీప్ చేసింది..

జగన్ కల నెరవేరుతుందా : సీఎం కుర్చీ జగన్ కల. గత ఎన్నికల్లో చేతిదాకా వచ్చి చేజారిన పదవి ఈ ఎన్నికల్లో నెరవేరనుందా ? తన సుదీర్ఘ కలను నెరవేర్చుకుంటారా ? కాళ్లకు బలపం కట్టుకుని పాదయాత్రలతో ఊరూరా తిరిగిన జగన్‌కు ఈ ఏడాది రాజకీయంగా, వ్యక్తిగతంగా చాలా కీలకమైన సంవత్సరం. ఎన్నికలకు మరో మూడు నెలల సమయమే ఉండడంతో ఆయన ప్రయత్నాలు ఎంతమేర ఫలిస్తాయని ఆసక్తికరంగా మారింది. ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి ఉందని, తనకు పట్ట కడతారన్న భావన ఆయనలో స్పష్టంగా కనిపిస్తోంది. తన సభలకు వచ్చే జనాలను చూసి ఇక తనకు సీఎం కుర్చీ ఖాయమని జగన్ అంచనా వేస్తున్నారు. అయితే ఇక్కడే మరోసారి జగన్ బోల్తా పడే అవకాశం కూడా ఉందని రాజకీయ పరిశీలకులు హెచ్చరిస్తున్నారు. ఎవరు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారో ఓటర్లు ప్రస్తుతం అంచనావేసి ఓట్లు వేస్తున్నారని అంటున్నారు. తాజాగా తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో జగన్ దోస్తీ ఆయనకు నష్టమని సూచిస్తున్నారు. కేసీఆర్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును తిడితే ఆ ప్రభావం తటస్థ ఓటర్లపై పడుతుందని, ఆఖరు నిముషంలో వారు టీడీపీ వైపు మొగ్గు చూపే అవకాశాన్ని జగన్ తెలుసుకోవాలంటున్నారు. రెడ్డి సామాజిక వర్గంతోపాటు క్రైస్తవ, ముస్లిం వర్గాలు ఏకపక్షంగా ఆయనకు గత ఎన్నికల్లో ఓటు వేశాయి. ఈ వర్గాలకు తోడుగా చంద్రబాబు ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్న వర్గాలను తన వెంట నడిపించకలిగితే పరిస్థితి కొంత మార్చవచ్చని, అయితే పవన్ ఒంటరిపోరు వల్ల ఓట్లు భారీగా చీలి జగన్ సీఎం కల నెరవేరే అవకాశం ఉండదని కూడా చెబుతున్నారు. అయితే త్రిముఖ పోటీలో ఎవరు ఓటర్ల మనసు చురగొంటారన్నది ఎన్నికల ఫలితాల వరకు వేచి చూడాల్సిందే మరి.

☞ నోట్ దిస్ పాయింట్ !



హక్కుల కోసం పోరాడుతున్న వారిని జైళ్లలో పెడుతున్నారు. భారత్‌లో అసహన వైఖరి పెరిగిపోతోంది. జర్నలిస్టులు మౌనాన్ని పాటిస్తున్నారు.
– అమ్నెస్టీ వీడియోలో నసీరుద్దీన్ షా



రాఫెల్ ఒప్పందంపై రెండున్నర గంటలు మాట్లాడారు. అనిల్ అంబానీ ప్రస్తావన లేకుండా చూసుకున్నారు.
– నిర్మలా సీతారామన్ ప్రసంగంపై రాహుల్



అనిల్ అంబానీ గురించి రాఫెల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేశామని కాంగ్రెస్ భావిస్తే ఆయన వెనుక ఒక క్యూ(ఖత్రోచీ), ఒక ఆర్‌వి(రాబర్ట్ వాద్రా) ఉన్నారు
– లోక్ సభలో రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్




వేలాదిమంది సిక్కులను ఊచకోత కోసిన కేసులో నిందితుడైన వ్యక్తికి మధ్య ప్రదేశ్ ముఖ్యమంత్రి పదవా?
– పంజాబ్ ర్యాలీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ




చీకట్లో గుడికి వెళ్లడం పిరికిపంద చర్య.
– అయ్యప్ప ఆలయంలోకి ఇద్దరు మహిళల ప్రవేశంపై మాధవన్ నాయర్

చరిత్రలో ఈరోజు



జాతీయవాది, ఆధ్యాత్మికవేత్త, తత్త్వవేత్త అరబిందో ఘోష్ 1950వ సంవత్సరంలో ఇదే రోజున కన్నుమూశారు. 1872 ఆగస్టు 15న జన్మించిన ఘోష్‌కు ఇద్దరు సోదరులు. ముగ్గురినీ 18979లో విద్యాభ్యాసం కోసం తండ్రి కృష్ణ ధన్ ఇంగ్లండ్ పంపారు. అరబిందో లాటిన్, ఫ్రెంచ్, గ్రీక్, ఇంగ్లీష్ పొయెట్రీలు చదివారు. ఇండియన్ సివిల్ సర్వీస్ కూడా ఉత్తీర్ణులయ్యారు. ఇండియాకు తిరిగి వస్తుండగా పోర్చుగల్ దగ్గర కుమారుడు ప్రయాణిస్తున్న ఓడ మునిగిపోయిందన్న అసత్య వార్త విని, షాక్‌కు గురై తండ్రి మరణించారు. 1906లో వందేమాతరం అనే జాతీయ పత్రికకు ఎడిటర్‌గా బాధ్యతలు స్వీకరించారు.



మంచి మాట

జీవితాన్ని గంభీరంగా భావించవద్దు. ఎందుకంటే దాన్నుంచి ఎవరూ సజీవంగా బయటపడలేరు
– ఎల్బర్ట్ హబ్బర్డ్

సూర్య లేఖ

మతోన్మాదాన్ని అడ్డుకోవాలి

గతంలో పుట్టపర్తి సాయిబాబా ఆశ్రమంలో ఆరుహత్యలు, పెనుగొండ బాబా గుప్తనిధులకోసం కృష్ణదేవరాయల కోటనుతవ్వటం, చిత్తూర్ జిల్లాలో కల్కి భగవాన్ ఆశ్రమంలో వికృతచేష్టలు, రకరకాల ఆరోపణలు, హర్యానాలోని దేరాబాబా సంగతి తెలిసిందే ! ప్రకాశం జిల్లాలోని రామదూత స్వామీ ప్రభుత్వ భూఆక్రమణలు, ప్రస్తుతం పిరమిడ్ వైద్యం పేరుతో కుద్తాల్‌లో ఒక మహిళ అనుమానాస్పద మరణం. మొన్న తిరుమలలొ బాలుడికిడ్నాప్. కొన్ని సంవత్సరాల క్రితం చంద్రస్వామి ఫెరా కేసులో జైలుకెళ్ళటం, ప్రతిరోజు ఆధ్యాత్మికంపేరుతో స్వాములు బాబాల అత్యాచారాలు, స్వస్థత కూటముల పేరుతో మహిళలను లొంగదీసుకోవటం, బాబాలు, స్వాములు, పీఠాధిపతులు, కిడ్నాప్‌లకు నిలయాలౌతున్న గుళ్లు, అత్యాచారాలకు, చావులకు కేంద్రాలవుతున్న ఆశ్రమాలు ఆధ్యాత్మిక కేంద్రాలపట్ల ప్రజలు అప్రమత్తులై ఉండాలి. ఇకనయినా ఈదేవుళ్లు దెయ్యాలు, ఆశ్రమాలు, గుళ్లు బాబాలు, ఫాస్టర్లు, ఆధ్యాత్మికం అవసరమా ! అలోచించండి. ఒకప్పటి మనప్రధాని ఇందిరా గాంధీని ఒక పారసీకుణ్ణి పెళ్లిచేసుకుందన్న కారణంతో పూరిదేవాలయంలోకి రానివ్వలేదు. తనభక్తిగీతాలతో అయ్యప్పకి ఎంతోపేరు సంపాదించిన జేసుదాసుకి అయ్యప్పగుడిలోకి ప్రవేశంలేదు. ఈరోజు సాక్షాత్తు సుప్రీం కోర్టు తీర్పుకు గతిలేని పరిస్థితి ఏర్పడింది. అయ్యప్పగుడిలోకి ఏ వయసు మహిళలైనా ప్రవేశించవచ్చని సుప్రీం కోర్టు చెప్పినా కూడా దాన్ని రాజకీయం చేసి బిజెపి వాళ్ళు అడ్డుకుంటున్న పరిస్థితి చుస్తున్నాం. వీళ్లు ఇరకంగా ఎందుకు చేస్తున్నారంటే, రేవు అయోద్యా విషయంలో కూడా మాకు అనుకూలంగా తీర్పు లేకపోతే ఇలాగే అడ్డుకుంటాము అనే ఒకబెదిరింపు చేస్తున్నారనుకో వాలి. ప్రభుత్వాలని చివరికి కోర్టులను కూడా అదిరించి బెదిరించి తమ పబ్బం గడుపుకోవాలని బిజెపి దాని అనుబంధసంస్థలు చూస్తున్నాయి .

రాజ్యంగములో వ్రాసుకున్న లౌకికవాదాన్ని పాఠించేవారేలేరు. అసలు లౌకికవాదమంటే ఏమిటో కూడా తెలియని పరిస్థితిలో మన నాయకులున్నారు. లౌకికవాదమంటే రాజ్యపాలనలో ఎక్కడా మతం జోక్యం వుండ రాదు. అందుకు ప్రభుత్వ ధనం వాడరాదు. మతము, దేవుడు వ్యక్తి గతంగానే ఉండాలి. కానీ నేడు అందుకుపూర్తి భిన్నంగా జరుగుతుంది. ఈ స్థితిని మార్చాలి. దేశంలోని అభ్యుదయవాదులందరు ఈదేశాన్ని సాంస్కృతికోద్యమం వైపు తీసునెళ్ళాల్సిన అవసరమెంతైనా వుంది .

నార్నె వెంకట సుబ్బయ్య.

శ -రణం అయ్యప్పా !

శబరిమల దేవాలయంలో మహిళా ప్రవేశం అనంతరం జరుగుతున్న ఆందోళనలు, దాడులు, ఆస్తినష్టాలు బాధాకరంగా పరిణమిస్తున్నాయి. మతరాజకీయాల ఉప్పెనలో ప్రజాజీవనం అల్లకల్లోలంగా మారడం, సమస్యని పరిష్కరించడం కన్నా అందులోనే వీలైనంత స్వప్రయోజనాల్ని పిండుకోవాలని భాద్యులు తలపోయడం పరిస్థితిని దిగజారుస్తోంది. మన రాజ్యాంగం ప్రకారం దేశం లౌకిక రాజ్యం. అన్ని మతాల్ని సమానంగా చూడడం, గౌరవించడం రాజ్యాంగ స్ఫూర్తి మాత్రమే కాకుండా భారత జాతి లక్షణం. అందుకనే ఎన్నో విభిన్న సంప్రదాయాల్ని ఇముడ్చుకొంటూ దేశం సజీవ సంస్కృతీ నదిలా నాగరి కతతో ముందుకుపోతోంది. ఆచారాలు తగనివి అనుకొంటే వదిలించుకొని, ప్రగతిశీలం అనుకొంటే కౌగలించుకొని చైతన్య భారతిగా కొనసాగడమే ఆధునిక లక్షణం. అయితే ప్రజాబాహుళ్యంలో ఆ లక్షణాలకు కొదవలేకపో యినా, వాటిని పూర్వపక్షం చేసే కొద్దిమంది అవలక్షణాలతో సామాజిక వాతావరణం కలుషితమౌతోంది. అందుకు ఉదాహరణ శబరిమల అంశం. ఈ అంశం కేవలం భక్తులకే చెందినదైతే అసలు సమస్యగానే ఉండేది కాదు. శబరిమల ఆలయంలో పది సంవత్సరాల నుండి యాభై సంవత్సరాల వయస్సు వరకూ మహిళల ప్రవేశం నిషిద్ధం. ఎవరికీ ఏ హానీ చెయ్యని ఆ ఆచారాన్ని ఒక ఆలయానికి సంబంధించిన ఆచారంగా మాత్రమే చూస్తే బాగుండేది. అది హక్కుల సమస్యగా, వివక్ష సమస్యగా గుర్తించడంతో కథ మారింది. ఏ రకమైన వివక్ష అయినా రాజ్యాంగ వ్యతిరేకం కాబట్టి మహిళలు ఆ గుడిలో ప్రవేశించ వచ్చు అని ధర్మాసనం తీర్పు చెప్పింది. రాజ్యాంగ బద్ధం అయిన పౌరుల చర్యలకు మద్దతు ఇవ్వాల్సి ఉంటుంది కనుక అక్కడి రాష్ట్ర ప్రభుత్వం ఇద్దరు మహిళల అభీష్టం మేరకు ఆలయప్రవేశానికి రక్షణ కల్పిస్తూ అండగా నిల్చింది. ఎన్నో ఏళ్ల ఆచారం మంటగలిసిందంటూ అక్కడ పూజారి శుద్ధి చేశాడు తాను నమ్మిన ఆచారం మేరకు. ఆ మహిళల ఆలయ ప్రవేశంతో ఎంత వివక్ష రూపుమాపబడిందో వీరూ చెప్పలేరు, లేక ఆలయం ఎలా మాలిన్యమైందో వారూ చెప్పలేరు. ఒక వర్గం వివక్ష కోణంలో, మరో వర్గం మత రక్ష కోణంలో వీక్షిస్తున్నప్పుడు ఎవరికి వారే సబబు అనుకొంటారు. వీటిని మించి ఆలోచించే అవకాశం, అందుకు తగ్గ వాతావరణం మృగ్యమౌతు న్నాయి. దేశంలో అక్షరాస్యతలో, అభివృద్ధిలో ముందుండే ఆధునిక రాష్ట్రంలోనే సరైన చర్చలకు, సుహృద్భావ పరిష్కారాలకు అవకాశాలు సన్నగిల్లుతుంటే మిగతా రాష్ట్రాల గురించి మాట్లాడనక్కరలేదు. భావోద్వేగాలు పెరిగిన చోట సమస్యలు పెరగడమే తప్ప తగ్గడం ఉండదు. ప్రభుత్వం, పౌరసమాజం, మీడియా, రాజకీయ పక్షాలు రేగిన మంటల్ని ఆర్పివేయడానికి కృషి చెయ్యాలి. చుట్ట వెలిగించుకొనే వారిపట్ల అప్రమత్తంగా ఉండాలి.

డా.డి.వి.జి.శంకరరావు, మాజీఎంపి, పార్వతీపురం

కర్షకుల వెతలు పట్టవా!




–కాళంరాజు వేణుగోపాల్,
మార్కాపురం – 8106204412

- నాటి నేతల నినాదాలు గాలికి
- కుంచించుకుపోతున్న వ్యవసాయ రంగం
- రైతు రాజయ్యేది ఎన్నడు?
- ఒక పక్క దళారులు... మరో పక్క వైపరీత్యాలు
- నలిగిపోతున్న అన్నదాత

సీమలే దేశానికి పట్టు కొమ్మలు వ్యవసాయానికి వెన్నెముక రైతు అన్నాడు మన మహాత్ముడు గాంధీజీ. 'జై జవాన్ ! జై కిసాన్ !' అనే నినాదాన్నిచ్చారు మన మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి. మన మాజీ రాష్ట్రపతి డా . అబ్దుల్ కలాం గారు 'జై జవాన్ ! జై కిసాన్ !, జై విజ్ఞాన్ ' అనే నినాదమిచ్చారు. ఇక్కడ మనం తెలుసుకోవాల్సింది ఏమిటంటే, రైతుకు మన నాయకులు ఎంతటి గౌరవాన్ని, ప్రాధాన్యతను ఇచ్చారు అని. ప్రపంచంలోని శ్రామికులలో 42% మంది వ్యవసాయ రంగంలో పనిచేస్తున్నారు. 70% ప్రజలు ఆధారపడిన మన దేశ వ్యవసాయరంగానికి, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత తగిన ప్రాధాన్యత ఇచ్చారు. మొదటి పంచవర్ష ప్రణాళికలలో వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి అన్నదాతలైన రైతులను రక్షించు కోవాలని ఆనాడే పాలకులు గుర్తించారు.

అన్ని రంగాలు దినదినాభివృద్ధి సాధిస్తున్నా ఒక్క వ్యవసాయ రంగం మాత్రమే ఎందుకు కుచించుకుపోతోంది? ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వెనుకకు తగ్గకుండా మొండి ధైర్యంతో రైతులు సేద్యం కొనసాగిస్తున్నారు కాబట్టే ఈ మాత్రం అన్నమైనా జాతికి దొరుకుతున్నది. వారు కూడా విరక్తితో ఒక ఏడాది కాడి పడేస్తే, మన దేశంలో ఉన్న 120 కోట్ల జనాభా గతి అధోగతి కాక తప్పదు. వ్యవసాయం కలిసి రాక రైతులు కష్టాల కొలిమిలో కొట్టుమిట్టాడుతున్నారు. భద్రత లేని బతుకులతో కాలం వెళ్లబుచ్చుతున్నారు. భూమి తల్లిని నమ్ముకున్న రైతులు కూలీలుగా మారుతున్నారు. పాలకులు అంగీకరించినా, అంగీకరించక పోయినా వ్యవసాయ రంగాన్ని, రైతాంగాన్ని సంక్షోభంలోకి నెట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విజయవంతమయ్యాయి. అయినా వాస్తవాలను విస్మరించి, తమని రైతు ప్రభుత్వాలుగా గొప్పలు చెప్పుకుంటున్నారు. ప్రభుత్వం అందించే రాయితీలు, రుణ మాఫీలు స్వయంగా వ్యవసాయం చేయకుండా ఉన్న భూకామందులకే లభిస్తున్నాయని తెలిసినా ప్రభుత్వం కౌలు రైతుల సమస్యలపై దృష్టి సారించడం లేదు. వ్యవసాయం ద్వారా రోజు గడవని రైతులు, ధరలు పెరిగి ఆహారం



సమకూర్చుకోలేకపోతున్న ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు చర్చలోకి రాకుండా వాస్తవాలను మరుగు పరచి అప్రధాన సమస్యల్ని ప్రధాన సమస్యలుగా ముందుకు తెస్తూ ప్రజల దృష్టిని మరలుస్తున్నారు. రైతులు, ప్రజలు సమస్యలపై ఆందోళనలు చేపడితే పోలీసు బలగాల సహాయంతో అణిచివేస్తున్నారు.

ఇపుడు పదిమందికీ అన్నం పెట్టే రైతన్నలు కరవయ్యారు. దేశం ఎంత అభివృద్ధి చెందినా రైతుల కష్టాలు మాత్రం తగ్గడం లేదు. భారతీయ వ్యవసాయ క్షేత్రమే ప్రపంచానికి విజ్ఞానం అందించింది. ప్రజలలో, రైతులలో చైతన్యం లేనిదే ఏ ప్రభుత్వం కూడా సమర్ధంగా పనిచేయలేదు. కనుక ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతో రైతు సంక్షేమం గురించి, వారు ఆర్థిక అభివృద్ధి సాధించటానికి తోడ్పాటునందించాలి. **రైతుల వెతలు:** పిడుగులు పడడం, వరదల్లో కొట్టుకుపోవడం, పొలంలో పని చేసే సమయంలో పాము కాటుకు మృతి చెందడం వంటి ఘటనలు నిత్యం వెలుగులోకి వస్తున్నాయి. ఇటువంటి సందర్భాల్లో మృతి చెందిన రైతులు, వారి కుటుంబాలకు సరైన రక్షణ సౌకర్యం లేదు. ఇతర విభాగాల్లో పని చేస్తూ చనిపోతే బీమా సౌకర్యం ఉంది. రైతన్నకు, ఆయనను నమ్ముకున్న కూలీలకు మాత్రం ఎటువంటి చట్టభద్రతను ప్రభుత్వం కల్పించలేదు. ఉపాధి హామీ పథకం వల్ల పేద ప్రజలకు ఎంత మేలు జరుగుతుందో మనకు తెలీదు కానీ కూలీలు దొరకక రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. పెట్టుబడి పెట్టే వ్యవసాయదారుడి నడ్డి విరిచిన పథకం గా దీనిని చెప్పుకోవచ్చు. యంత్రాలు పెట్టే స్థాయి లేక కూలీలు సరైన సంఖ్యలో దొరకక ఆర్థికంగా చాల నష్టాలు అనుభవించ వలసి వస్తుంది. వ్యవసాయ రంగానికి ప్రకృతి విధ్వంసం మరొక సవాలు! అందువల్ల కూడా ఆ రంగం గాలిలో దీపంలా మారింది. నాలుగేళ్ల క్రితం వచ్చిన హుద్ హూద్ తుఫాను సృష్టించిన బీభత్సం ఇంకా మన మనసుల నుండి తొలగి పోక ముందే పెథాయి తుపాను సృష్టించిన భీతావహ దృశ్యాలను చూస్తూనే ఉన్నాం. అది అటు వెళ్ళగానే గజ అని ఉత్తరాంధ్రను వణికించింది. ఫలసాయం చేతికందే దశలో విపత్తుల విధ్వంసానికి రైతుల కష్టార్జితం పొలాలలోనే కుళ్ళిపోతోంది.

దేశంలో అరగంటకొక చావు గంట మోగుతోంది. ప్రకృతి వైపరీత్యాలను నిలువరించడం సాధ్యం కాకపోయినా, వాటి వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవడంపైన, వాటిని ప్రణాళికా బద్ధంగా ఎదుర్కొని నష్టాలను తగ్గించే శాశ్వత పథకాలను చేపట్టడంపైనా ప్రభుత్వాలు శ్రద్ధ చూపడం లేదు. మార్కెట్ హెచ్చు తగ్గులనుంచి రైతుకు రక్షణ లేదు. రైతుల ఆదాయం పెరిగే విధంగా వారికి నైపుణ్యం, పెట్టుబడులు, యంత్రాలు సమకూర్చడం లేదు. వారి ఆర్థిక పరిస్థితి మెరుగునకు ప్రవేశపెట్టిన అరకొర పథకాలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రైతులనుంచి సెజ్ ల పేరుతో పంట భూముల్ని చేజిక్కించుకుంటూ వారిని వ్యవసాయానికి దూరం చేస్తోంది. బ్యాంకుల రుణాలు వాస్తవంగా వ్యవసాయం చేస్తున్న కౌలు రైతులకు కాక భూస్వాములకే చేరుతున్నాయి. బీమా పథకం వీరికి వర్తించడం లేదు. ఫలితంగా గుండె ఆగో, ఆత్మహత్యకు పాల్పడో రైతులు పిట్టల్లా రాలిపోతున్నారు. దళారి వ్యవస్థను అదుపు చేయలేక ప్రభుత్వాలు రైతుల ఉసురు తీస్తున్నాయి. ఇటీవల ఢిల్లీ నది వీదుల్లో రైతుల కవాతు చూసే ఉంటాము .పంట గిట్టుబాటు ధరల గురించి, పెట్టుబడి గ్యారంటీ గురించి వారు అనేకరకా లుగా గళమెత్తారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వంలో ఎటువంటి కదలిక లేకపోవడం బాధాకరం. ఉత్పత్తి ధరపై 150 శాతం అధికంగా రైతుకు అందేలా చూడాలని స్వామినాథన్ కమిటీ చెప్పినా, అదే విషయాన్ని తాజాగా ముఖ్యమం త్రుల కమిటీ సిఫారసు చేసినా అమలు కాక పోవడం దురదృష్టకరం. రాను రాను స్వార్థం, అవినీతి, కుంభకోణాలు, నల్లధనం లాంటివి పెరిగి, నేడు రోజుకు ఐదుగురి నుండి 10 మంది రైతులు ఆత్మ హత్యలు చేసుకునే స్థాయికి వ్యవసాయం, రైతుల పరిస్థితి దిగజారింది. రైతు వర్గం కేవలం ఒక ఓటు బ్యాంక్‌గా మాత్రమే మిగిలి పోయింది. ప్రభుత్వాలు మారినా, పార్టీలు మారినా, నాయకులు వారే కాబట్టి, ఒక ప్రభుత్వాన్ని మరో ప్రభుత్వం నిందించుకోవడం వలన రైతులకు లభించే ప్రయోజనం శూన్యం. సమయం వృధా, మరిన్ని రైతుల ఆత్మ హత్యలు పెరుగుతాయి తప్ప మరేమీ జరుగదు . దేశంలో రైతు సంతోషంగా ఉంటేనే దేశం చల్లగా ఉంటుంది. రైతు లేనిదే రాజ్యం లేదు అన్న సంగతిని ఎవరూ మరవద్దు.



రూ. 2 వేల నోట్ల ముద్రణపై నిర్ణయం తీసుకోలేదు

న్యూఢిల్లీ: ప్రస్తుతం అవసరమైన దాని కంటే ఎక్కువగానే రూ.2వేల నోట్లు చలామణిలో ఉన్నాయని ఆర్థికశాఖ కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ స్పష్టం చేశారు. రూ.2వేల నోట్ల ముద్రణ విషయంపై ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని ఆయన శుక్రవారం వెల్లడించారు. నోట్ల ముద్రణను కనిష్ఠ స్థాయికి తీసుకురానున్నట్లు వచ్చిన వార్తలపై ఆయన స్పష్టతనిచ్చారు. వ్యవస్థలో ప్రస్తుతం అవసరమైన దాని కంటే ఎక్కువ రూ.2వేల నోట్లు ఉన్నాయి. దాదాపు 35శాతం నోట్లు చలామణీలో ఉన్నాయి. రూ.2వేల నోట్ల ముద్రణకు సంబంధించి ప్రస్తుతం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు అని ఆయన స్పష్టం చేశారు. అవసరాన్ని బట్టి నోట్ల ముద్రణ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. రిజర్వు బ్యాంకు రూ.2000నోట్ల ముద్రణను కనిష్ఠ స్థాయికి తగ్గించిందని ఆర్థికశాఖ ఉన్నతాధికారి నిన్న వెల్లడించిన విషయం తెలిసిందే. దీంతో రూ.2వేల నోటు క్రమేణా కనుమరుగు కానుందని వార్తలు వచ్చాయి. చలామణీలో ఉన్న నగదుపై సమీక్ష జరిపిన కేంద్రం, ఆర్బీఐ ఏ మేరకు కొత్త నోట్లను ముద్రించాలన్న దానిపై తగిన నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే రూ.2వేల నోట్ల ముద్రణను తగ్గించినట్లు తెలిపారు. నవంబరు 8, 2016న రూ.1000, రూ.500 నోట్లను రద్దు చేస్తున్నట్లు ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో కొత్తగా రూ.2వేల నోటును ప్రవేశపెట్టారు.




4-1-2019 ... మార్కెట్ సమాచారం

సెన్సెక్స్	
ఆరంభం	36,198.13
గరిష్ఠం	36,236.70
కనిష్ఠం	35,734.01
ముగింపు	**35,695.10**
మార్పు (పా)	181.39
మార్పు (శా)	

&

నిఫ్టీ	
ఆరంభం	10,699.70
గరిష్ఠం	10,737.55
కనిష్ఠం	10,638.85
ముగింపు	**10,727.35**
మార్పు (పా)	55.10
మార్పు (శా)	

ఎన్ఎస్ఈ ఇండియా మార్కెట్ గ్రాఫ్



సెక్టోరల్ ఇండెక్స్‌లు

ఇండెక్స్	ప్రస్తుతం	మార్పు (పా)	మార్పు (శా)
S&P BSE SENSEX 50	11,168.30	-121.83	-1.08
S&P BSE SENSEX Next 50	32,329.50	-314.76	-0.96
S&P BSE 100	10,961.27	-117.74	-1.06
S&P BSE Bharat 22 Index	3,412.83	-50.58	-1.46

అత్యధిక లాభాల్లో...

కంపెనీ (కోడ్)	ప్రస్తుతం	మార్పు (రూ)	మార్పు (శా)
COX&KINGS	169.90	+9.20	+5.72
NAUKRI	1,496.50	+61.50	+4.29
UJJIVAN	285.60	+11.00	+4.01
ASAHIINDIA	266.90	+9.80	+3.81
INFRATEL	271.05	+7.75	+2.94

భారీ నష్టంలో...

కంపెనీ (కోడ్)	ప్రస్తుతం	మార్పు (రూ)	మార్పు (శా)
DENABANK	14.40	-3.55	-19.78
VIJAYABANK	47.35	-3.70	-7.25
JINDALSTEL	146.90	-11.15	-7.05
JETAIRWAYS	246.85	-16.90	-6.41
RELINFRA	289.30	-16.70	-5.46

టాప్ టర్నోవర్

కంపెనీ (కోడ్)	ధర (రూ)	టర్నోవర్	వాల్యూమ్
ONGC	143.20	71.12	4943024
M&M	718.95	60.78	834660
IBULHSGFIN	816.50	51.05	616448
TATASTEEL	481.05	51.03	1050414
SBIN	291.05	48.32	1648244

రూపాయి మారకపు విలువ

కరెన్సీ	మారకపు విలువ	కరెన్సీ	మారకపు విలువ
డాలర్	69.6089	యూరో	79.9635
యన్	63.75	పౌండ్	88.8261

రాఫెల్‌పై కాంగ్రెస్ అవాస్తవాలు

● దేశాన్ని కాంగ్రెస్ పార్టీ తప్పుదోవ పట్టిస్తోంది ● జాతీయ భద్రత విషయాన్ని గాలికొదిలేసింది ● కాంగ్రెస్‌పై నిర్మలా సీతారామన్ మండిపాటు ● ప్రతి 'ఏఏ' వెనుకా ఓ 'క్యూ', ఓ 'ఆర్‌వి' ● అనిల్ అంబానీ, ఖత్రోచీ, రాబర్ట్ వాద్రాల పేర్లు ప్రస్తావించకుండా విమర్శలు ● మోడీపై కాంగ్రెస్ నేతలవి అభ్యంతరకర వ్యాఖ్యలు ● సెప్టెంబర్ నాటికి తొలి రాఫెల్ యుద్ధ విమానం ● లోక్‌సభలో రాఫెల్‌పై వాడివేడి చర్చ ● సుదీర్ఘ ప్రసంగంలో నిప్పులు చెరిగిన రక్షణ మంత్రి



న్యూఢిల్లీ: రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు వ్యవహారం అంశంపై దేశాన్ని కాంగ్రెస్ పార్టీ తప్పుదోవ పట్టిస్తోందని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ విమర్శించారు. లోక్‌సభలో శుక్రవారం నాడు సుదీర్ఘంగా ప్రసంగించిన ఆమె, ఈ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అవాస్తవాలే చెబుతోందని, జాతీయ భద్రత విషయాన్ని ఆ పార్టీ గాలికొదిలేసిందని దుమ్మెత్తిపోశారు. ప్రధాని మోదీ పట్ల కాంగ్రెస్ పార్టీ నేతలు అభ్యంతరకర పదజాలం వాడారని, వాయుసేన అధిపతిని సైతం అబద్ధాలకోరుగా చిత్రీకరిస్తున్నారని, ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్‌తో రాహుల్ గాంధీ అసలు మాట్లాడలేదని ఆ పార్టీ చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. తమ హయాంలో హిందూస్థాన్ ఎయిరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్) సామర్థ్యాన్ని మెరుగుపరిచామని, చాపర్ల కొనుగోలు సమయంలో హాల్ ను పక్కనబెట్టారని, గతంలోనూ రెండు స్క్వాడ్రన్లు కొనుగోలు చేశారని, ప్రస్తుత ప్రభుత్వాన్ని దించేందుకు పాక్ సాయాన్ని కాంగ్రెస్ పార్టీ కోరుతోందని తీవ్రమైన ఆరోపణలు చేశారు.

విమానాల కొనుగోలుకు సంబంధించి వివరణ ఇచ్చిన నిర్మాలా సీతారామన్, భారత్ కొనుగోలు చేసిన తొలి రాఫెల్ యుద్ధ విమానం 2019 సెప్టెంబరు నెలలో దేశానికి వస్తుందని, మిగిలిన ఎయిర్‌క్రాఫ్ట్‌లు 2022 నాటి కల్లా అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ఈ మొత్తం వ్యవహారం పూర్తవడానికి 14నెలల సమయం పట్టిందన్నారు. డిఫెన్స్ డీలింగ్స్‌కు.. డీలింగ్ ఇన్ డిఫెన్స్‌కు తేడా ఉందని వ్యాఖ్యానించారు. తాము డిఫెన్స్ డీలింగ్స్ చేయమని అన్నారు. దేశ భద్రతను, ప్రాధాన్యాలను దృష్టిలో పెట్టుకునే ఒప్పందాలు చేసుకుంటామని అన్నారు. పొరుగుదేశాలైన చైనా, పాకిస్థాన్‌లు రక్షణ సంబంధ విషయాల్లో దూకుడుగా ఉంటే, అప్పట్లో యూపీఏ ప్రభుత్వం కేవలం 18 యుద్ధవిమానాలను మాత్రమే కొనుగోలు చేసి, భారత్‌ను ఎటూ కదల్లేని స్థితికి తెచ్చిందని ఆరోపించారు. ఉత్తర, పశ్చిమ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం ఉన్న నేపథ్యంలో తగిన సామగ్రిని సమకూర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే దీన్ని అత్యవసరంగా గుర్తించామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేయడంతో నిర్మలా సీతారామన్ వారికి గట్టిగానే చురకలంటించారు. తన సమాధానం వినేందుకు కూడా ప్రతిపక్ష సభ్యులు ఆసక్తి చూపడం లేదని విమర్శించారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా, యుద్ధ విమానాల కొనుగోలు దేశ భద్రతకు సంబంధించిన విషయమని అందరు గుర్తుంచుకోవాలన్నారు. ఏఏ (అనిల్ అంబానీని ఉద్దేశిస్తూ) కోసమే యుద్ధ విమానాల కొనుగోలు చేశామని కాంగ్రెస్ భావిస్తే, ప్రతి ఏఏ వెనుక ఒక క్యూ (ఖత్రోకీని ఉద్దేశిస్తూ), ఆర్‌వి (రాబర్ట్ వాద్రాను ఉద్దేశిస్తూ) ఉన్నారంటూ నిర్మలా సీతారామన్ విమర్శించారు.

రాఫెల్ మీ హక్కు. దాన్ని మీరే తయారు చేయాలి అని బెంగళూరు హెచ్ఏఎల్ వద్ద జరిగిన ఓ కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలపై నిర్మలా సీతారామన్ మండిపడ్డారు. హెచ్ఏఎల్‌కు ఎందుకు ఇవ్వలేదో రాహుల్‌గాంధీ తెలుసుకోవాలని, హెచ్ఏఎల్ గొప్పలే కాదు, లోపాలనూ గుర్తించాలన్నారు. తేజస్ విషయంలో హెచ్ఏఎల్ వేగంగా పనిచేయలేదన్నారు. హెచ్ఏఎల్ విషయంలో కాంగ్రెస్ మొసలికన్నీరు కారుస్తోందని విమర్శించారు. తాము హెచ్ఏఎల్‌కు రూ.లక్ష కోట్ల ఒప్పందాలు అప్పగించామన్నారు.

రాఫెల్ వ్యవహారంలో కాంగ్రెస్ దేశాన్ని తప్పుదోవ పట్టిస్తోంది. ఈ వ్యవహారంపై ఆ పార్టీ చెప్పేవన్నీ అబద్ధాలే. జాతీయ భద్రతను కాంగ్రెస్ గాలికొదిలేసింది. ప్రధాని పట్ల అభ్యంతరకర పదజాలం వాడారు. వాయుసేన అధిపతిని సైతం అబద్ధాలకోరుగా చిత్రీకరిస్తున్నారు. మెక్రాన్‌తో రాహుల్‌గాంధీ మాట్లాడలేదని కాంగ్రెస్ చెప్పింది. మా హయాంలో హాల్ సామర్థ్యాన్ని మెరుగుపరిచాం. చాపర్ల కొనుగోలు సమయంలో హెచ్ఏఎల్‌ను పక్కన పెట్టారు. డసో, హెచ్ఏఎల్ మధ్య ఎలాంటి ఒప్పందం జరగలేదు. హెచ్ఏఎల్ ఏడాదికి ఎనిమిది విమానాలకు మించి తయారుచేయలేదు. మీ హయాంలో హెచ్ఏఎల్‌ను పక్కన పెట్టి అగస్టాతో ఎందుకు ఒప్పందం చేసుకున్నారు. అని ప్రశ్నించారు.

పారిపోయిన నరేంద్ర మోడీ

● అవినీతి, రాఫెల్ డీల్‌పై మోడీని విచారించాలి ● నా ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకుండా మోడీ పారిపోయారు ● జైట్లీ ప్రసంగంలో నాపై విమర్శలు తప్ప మరేమీ లేదు ● అనిల్ అంబానీకి రాఫెల్ కాంట్రాక్ట్ ఇచ్చింది ఎవరు? ● రాహుల్ గాంధీ ప్రశ్నాస్త్రాలు



న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాఫెల్ డీల్ పై క్రిమినల్ విచారణ జరిపిస్తామని ఆ పార్టీ అధినేత రాహుల్ గాంధీ తెలిపారు. దోషులను కఠినంగా శిక్షిస్తామని చెప్పారు. పార్లమెంటు ప్రాంగణంలో రాహుల్ మీడియాతో మాట్లాడుతూ, మిలియన్ల డాలర్ల రాఫెల్ డీల్ పై కాంగ్రెస్ పార్టీ లేవనెత్తుతున్న ప్రశ్నలకు ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంటులో రాఫెల్ పై జరిగిన చర్చలో పాల్గొనకుండా మోదీ పారిపోయారని రాహుల్ ఎద్దేవా చేశారు. అరుణ్ జైట్లీ చాంతాడంత ప్రసంగం ఇచ్చారని... ఈ సందర్భంగా తనపై విమర్శలు గుప్పించడమే పనిగా పెట్టుకున్నారని... తాను అడిగిన ప్రశ్నలకు మాత్రం సమాధానం చెప్పలేదని విమర్శించారు. ప్రధాని తరవున రక్షణ మంత్రి మాట్లాడుతున్నారని... తమ ప్రశ్నలకు వారైనా సమాధానం చెప్పాలని కాంగ్రెస్ తో పాటు విపక్షాలన్నీ కోరుతున్నాయని చెప్పారు.

రాఫెల్ ఎయిర్ క్రాఫ్ట్ ధరను రూ. 526 కోట్ల నుంచి రూ. 1600 కోట్లకు పెంచాలని ఎవరు నిర్ణయించారని ఈ సందర్భంగా రాహుల్ ప్రశ్నించారు. ధర పెరగడానికి ప్రధాని కారణమా? లేక రక్షణశాఖ కారణమా? అని అడిగారు. యుద్ధ విమానాల సంఖ్యను 36కు తగ్గించింది ఎవరని ప్రశ్నించారు. అనిల్ అంబానీకి కాంట్రాక్ట్ ఇచ్చింది ఎవరని నిలదీశారు. కొత్త డీల్ కు సంబంధించి రక్షణశాఖ ఏవైనా అభ్యంతరాలు లేవనెత్తిందా? అని ప్రశ్నించారు. ప్రధాని మోదీపై అవినీతి కేసులతో పాటు... అంతర్జాతీయంగా అప్పులపాలైన అనిల్ అంబానీకి రాఫెల్ కాంట్రాక్ట్ ను అప్పగించి, దేశ భద్రతను ప్రమాదంలోకి నెట్టిన అంశంపై విచారణ జరిపించాలని అన్నారు.

అనిల్ అంబానీని జైల్లో పెట్టండి

● సుప్రీంకోర్టులో ఎరిక్సన్ పిటిషన్ ● ఎరిక్సన్ కు రూ. 550 కోట్ల మేర చెల్లించాల్సిన అంబానీ ● గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు బేఖాతరు ● మళ్లీ పిటిషన్ వేసిన ఎరిక్సన్



న్యూఢిల్లీ: ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీని జైల్లో ఉంచాలంటూ సుప్రీంకోర్టులో స్వీడన్ కు చెందిన టెలికాం ఉత్పత్తుల తయారీదారు ఎరిక్సన్ పిటిషన్ వేసింది. తమ బకాయిలను చెల్లించాలంటూ సుప్రీంకోర్టు గతంలోనే ఆదేశించినా... అనిల్ అంబానీ పట్టించుకోలేదని పిటిషన్ లో ఎరిక్సన్ ఆరోపించింది. సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను కూడా అంబానీ ఉల్లంఘించారని తెలిపింది. ఎరిక్సన్ కు అంబానీకి చెందిన రిలయన్స్ కమ్యూనికేషన్స్ రూ. 550 కోట్ల మేర చెల్లించాల్సి ఉంది. మరోవైపు, స్పెక్ట్రం అమ్మకం కేసు కోర్టులో ఇంకా పెండింగ్ లోనే ఉందని... అందువల్లే చెల్లింపులు చేయలేకపోయామని కోర్టుకు అనిల్ అంబానీ తరవు న్యాయవాది తెలిపారు.

చందమామ ఆవలి వైపు ఫోటో

● విడుదల చేసిన చైనా ● చంద్రుడిపై ల్యాండైన చంఘీ-4 రోవర్ ● అమెరికా, రష్యాలకు సాధ్యంకాని రికార్డు ● సమీపం నుంచి ఫోటో తీసిన చైనా రోవర్




బీజింగ్: చైనా ఇటీవల ప్రయోగించిన ఛంఘీ-4' (చైనా పురాణాల్లో చంద్ర దేవత) రోవర్ (వ్యోమనౌక) చంద్రుడి ఆవలి వైవున నిన్న విజయవంతంగా ల్యాండై చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. అగ్రరాజ్యాలైన అమెరికా, రష్యాలకు సాధ్యం కాని అద్భుతాన్ని చైనా ఈ ప్రయోగంతో సుసాధ్యం చేసింది. తాజాగా చైనా ప్రయోగించిన ఛంఘీ-4.. చంద్రుడికి సంబంధించిన కీలక ఫొటోను భూమిపైకి పంపించింది. చంద్రుడి నిర్మాణంపై సమీపం నుంచి తీసిన ఫొటోను పంపించింది. భూమిపై ఉన్నవారికి ఎప్పుడూ చంద్రుడి ఒకవైపు మాత్రమే కనిపిస్తుంది. భూభ్రమణ కాలం, చంద్రుడి భ్రమణకాలంతో సమానం కావడంతో భూమిపై ఉన్నవాళ్లు చంద్రమామ రెండోవైపును చూడలేరు. తాజాగా ఇక్కడ ఉన్న రహస్యాలను ఛేదించేందుకు చైనా ఛంఘీ-4ను ప్రయోగించింది.

లాభాల్లో ముగిసిన మార్కెట్లు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారాన్ని లాభాల్లో ముగించాయి. ఉదయం ట్రేడింగ్ ప్రారంభమైనప్పటి నుంచి మార్కెట్లు ఒడిదుడుకులకు గురయ్యాయి. అయితే, చివరి రెండు గంటల్లో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపడంతో... మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 181 పాయింట్లు లాభపడి 35,695కి పెరిగింది. నిఫ్టీ 55 పాయింట్లు వుంజుకుని 10,727 వద్ద స్థిరపడింది. వేదాంత, యస్ బ్యాంక్, టాటా మోటార్స్, భారతి ఎయిర్ టెల్, ఇన్ఫ్రాటెల్, టాటా స్టీల్ తదితర కంపెనీలు లాభాలను మూటగట్టుకున్నాయి. టెక్ మహీంద్రా, హెచ్సీఎల్, హీరో మోటో కార్ప్, టీసీఎస్, ఇన్ఫోసిస్ తదితర కంపెనీల షేర్లు నష్టపోయాయి.

ట్రంప్‌ను కాదని షట్‌డౌన్ ఎత్తేసేలా బిల్లు ఆమోదం




వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కాదని అక్కడి ప్రతినిధుల సభ యూఎస్ షట్‌డౌన్ ఎత్తేసేందుకు వీలుగా బిల్లును ఆమోదించింది. మెక్సికోతో సరిహద్దులో గోడ నిర్మాణానికి నిధులు కేటాయించాలని ట్రంప్ చేస్తున్న డిమాండ్‌ను పక్కన పెట్టి.. ఎలాంటి నిధులు ఇవ్వకుండానే సభ బిల్లును ఆమోదించింది. గత నవంబరులో జరిగిన మిడ్‌టర్మ్ ఎన్నికల్లో ప్రతినిధుల సభలో డెమోక్రాట్లు ఆధిక్యం సాధించిన సంగతి తెలిసిందే. దీంతో రిపబ్లికన్లు వ్యతిరేకించినప్పటికీ డెమోక్రాట్ల మెజార్టీ ఉడడంతో బిల్లులు ఆమోదించారు. అయితే సెనేట్‌లో రిపబ్లికన్లదే పైచేయి. ఒకవేళ యూఎస్ కాంగ్రెస్ గోడకు నిధులు కేటాయించకుండా బిల్లును ఆమోదిస్తే ట్రంప్ వీటో అధికారాలతో దాన్ని రద్దు చేస్తానని హెచ్చరిస్తున్నట్లు సమాచారం. మెక్సికో సరిహద్దులో గోడ నిర్మాణానికి నిధులు కేటాయించే వరకు ద్రవ్య వినిమయ బిల్లుపై సంతకం పెట్టనని ట్రంప్ భీష్మించుకు కూర్చున్న సంగతి తెలిసిందే. అయితే నిధుల కేటాయివునకు డెమోక్రాట్లు అంగీకరించడం లేదు. తాజాగా ప్రతినిధుల సభకు స్పీకర్‌గా ఎంపికైన డెమోక్రాట్ నేత నాన్సీ పెలోసి మరోసారి ఆ విషయాన్ని స్పష్టంచేశారు. ఇరు వర్గాలు వెనక్కి తగ్గకపోవడంతో గత రెండు వారాలుగా అమెరికాలో పాక్షిక షట్‌డౌన్ కొనసాగుతోంది. పలు ప్రభుత్వ కార్యక్రమాలకు నిధులు అందడం లేదు. ఎంతో మంది ఫెడరల్ ఉద్యోగులు జీతాలు లేకుండా పనిచేయాల్సి వస్తోంది.

చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ ప్రారంభం



పగ్వారా: పంజాబ్‌లోని లవ్లీ ప్రొఫెషినల్ యూనివర్శిటీలో 106వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ ఆసక్తికరంగా సాగుతోంది. ఈ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్‌ను నోబెల్ పురస్కార గ్రహీతలు ఎఫ్ డంకెన్ ఎం హల్డానె, అవ్రమ్ హెర్షోకో ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో మొత్తం 120 వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం జనవరి 7 వరకూ కొనసాగనుంది. ఈ ప్రదర్శనలకు సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం సహకారం అందిస్తోంది. ఈ సందర్భంగా డంకన్ హల్డానే మాట్లాడుతూ వైజ్ఞానిక అంశాల బోధనలో సైన్స్ ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలన్నారు. తాను ఈ స్థాయికి ఎదగడం వెనుక సైన్స్ ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఉందన్నారు. కాగా సైన్స్ కాంగ్రెస్ అనేది విజ్ఞానపరంగా ఎదుగుతున్న దేశానికి దర్పణం పడుతున్నదన్నారు.

ఎల్పీయూ ఘనతను చాటిన టైమ్ క్యాప్స్యూల్



ముగ్గురు నోబెల్ పురస్కార గ్రహీతలు రూపొందించిన టైమ్ క్యాప్స్యూల్ సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రస్తుతం వినియోగిస్తున్న టెక్నాలజీలోని 100 వివిధ పరికరాలను టైమ్ క్యాప్స్యూల్ కలిగి వుంటుంది. ప్రస్తుతం విరివిగా వినియోగిస్తున్న ఎలక్ట్రానిక్ గెడ్జెట్స్ అయిన ల్యాప్ టాప్, స్మార్ట్‌ఫోన్, డ్రోన్, వీఆర్ గ్లాసెస్ ఇలా చాలా సదుపాయాలు దీనిలో ఉన్నాయి. అలాగే దీనిలో మంగల్యాన్, బ్రహ్మోస్ మిసైల్, తేజస్ ఫైటర్ జట్ మొదలైె సాంకేతిక అంశాలు కూడా దీనిలో మిళితమై ఉన్నాయి. ఈ క్యాప్స్యూల్‌ను లవ్లీ ప్రొఫెషినల్ యూనివర్శిటీ రూపొందించింది.

డబ్ల్యుడీలో నూతన పీహెచ్‌డీ ప్రోగ్రాం

న్యూఢిల్లీ: యూజీసీచే గుర్తింపుపొందిన ప్రముఖ వరల్డ్ యూనివర్శిటీ ఆఫ్ డిజైన్(డబ్లుడీ) డిజైనింగ్‌ను కెరియర్‌గా ఎంచుకునే విద్యార్థుల కోసం పీహెచ్‌డీ ప్రోగాంను నిర్వహిస్తోంది. ఇప్పుడు ఈ కోర్సులో దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ పీహెచ్‌డీ ప్రోగ్రాంలో డిజైన్ మేనేజిమెంట్, విజువల్ ఆర్ట్స్, అర్కిటెక్చర్ మొదలైనవి ఉంటాయని వర్శిటీ తెలిపింది. 2019 అకాడమిక్ ఇయర్‌లో అడ్మిషన్లకు ఆహ్వానం పలుకుతూ ఈ కోర్సులో చేరేవారు జనవరి 11లోగా తమ దరఖాస్తులను సమర్పించుకోవాలని కోరింది. ఈ సందర్భంగా డబ్ల్యుడీ వైస్ ఛాన్సలర్ సంజయ్ గుప్తా మాట్లాడుతూ తమ విభాగం క్రియేటివ్ ఎకానమీని పెంపొందించేదిగా పయనిస్తోంది. దేశంలో డిజైనింగ్ రంగంలో మరింతమంది నిపుణుల అవసరం ఉంది. దీనిని గుర్తించిన మీదటనే వర్శిటీ ఈ కోర్సు అందిస్తున్నదని అన్నారు.

వాట్సాప్‌తో ఐసీఐసీఐ ప్రూ భాగస్వామ్యం


రాజమండ్రి: బీమా రంగంలో మొట్ట మొదటిసారిగా వాట్సాప్‌తో భాగస్వామ్యమైన కంపెనీ ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ వినియోగదారులకు వాట్సాప్ ద్వారా మరిన్ని సేవలను అందిస్తున్నట్లు తెలిపింది. వెల్కమ్ కిట్లు, ప్రీమియం రసీదులు, పాలసీ సర్టిఫికెట్లు మొదలైన సమాచారం వినియోగదారునికి మరింత సులభంగా చేరనుంది. ఈ సందర్భంగా ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ పునీత్ నందా మాట్లాడుతూ వాట్సాప్‌తో భాగస్వామ్యం అనేది మాకు ఎంతో ఆనందదాయకం. దీని ద్వారా వినియోగదారుకు ఒక ధృవీకరించిన బిజినెస్ ఎకౌంట్ ద్వారా మెరుగైన సేవలు అందిస్తూ 24 గంటలూ వినియోగదారులకు అందుబాటులో ఉంటామని తెలిపారు.

మార్కెట్లో ఆడిదాస్ టెక్నికల్ సోలార్ బూస్ట్



న్యూఢిల్లీ: ప్రముఖ ఆడిదాస్ సంస్థ అత్యుత్తమ పనితీరు, సౌకర్యం, ఎనర్జీ రిటర్న్‌లను కోరుకునేవారి కోసం ప్రత్యేకంగా ఒక సాంకేతిక అద్భుతాన్ని ఆవిష్కరించింది. నాసా ఇంజినీరింగ్‌తో పొందిన స్ఫూర్తితో చక్కటి పనితీరుకు వీలుగా ఇవి రూపుదిద్దుకున్నాయి. అధిక పనితీరు ఈ లైట్ వెయిట్ షూ ప్రత్యేకత. ఆడిదాస్ యెక్క అత్యుత్తమ వినూత్నతలతో ఈ షూ రూపుదిద్దుకుంది. టైలర్డ్ ఫైబర్ ప్లేస్‌మెంట్ సాంకేతికతను ఇందులో ఉపయోగించారు. పార్లే మెటీరియనల్ కంటెంట్ ఇందులో ఉంటుంది. షూలోని ప్రతీ మిల్లీమీటర్ కూడు ఎంతో కచ్చితత్వంతో తయారుచేయబడింది. ఫలితంగా వినియోగదారులకు అత్యున్నత స్థాయి సౌకర్యం, ఫిట్, సపోర్ట్ అన్నీ కూడా లైట్ వెయిట్ రూపంలో అందుబాటులోకి వచ్చినట్లయ్యింది. ఫలితంగా రన్నర్లు ఎంతటి వేగంతో అయినా, ఎంతటి దూరాన్ని అయినా ఆత్మవిశ్వాసంతో చేరుకోవచ్చు.

తాజ్ ఎగ్జిక్యూటివ్‌గా షాహిద్




హైదరాబాద్: తాజకృష్ణ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్‌గా షాహిద్ హుస్సేన్ నియమితులయ్యారు. భిన్న సంస్కృతి, సంప్రదాయాల సమ్మేళనమైన చారిత్రక నగరంగా హైదరాబాద్ పేరొందింది. ముత్యాల నగరిగా భాసిల్లడంతో పాటుగా విభిన్నమైన ఆహార అలవాట్లకూ ప్రత్యేకతను సంతరించుకుంది. 2001 వ సంవత్సరం నుంచి షాహిద్ హుస్సేన్ తాజ్ ప్యాలెస్‌లో చెఫ్ ట్రైనీగా 17 ఏళ్లు పనిచేశారు. హోటల్ రంగంలో అపారమైన అనుభవం ఆయనకు ఉంది.

టాటా మోటార్స్ నుంచి డిస్కవర్ ది హారియర్

హైదరాబాద్: సరికొత్త హారియర్‌చే రూపుదిద్దుకున్న ఉద్వేగంపై టాటా మోటార్స్ ఒక ప్రత్యేక కస్టమర్ రివ్యూ ప్రోగ్రాం డిస్కవర్ ది హారియర్ ను నిర్వహిస్తోంది. ఈ ప్రత్యేక ఈవెంట్ హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణలో 2019 జనవరి 5, 6 తేదీల్లో జరగనుంది. ఈ ఎక్స్‌క్లూజివ్ కస్టమర్ ప్రివ్యూ కార్యక్రమం ఈ వాహనం ఆవిష్కరణ కోసం ఎంతో ఆతృతతో ఎదురుచూస్తున్న ప్రస్తుత, భావి కస్టమర్లకు ఈ వాహనంపై సమగ్ర అవగాహనను అందిస్తుంది. హారియర్‌ను అనుభూతి చెందేందుకు, దాంతో పాటుగా 2019 ఆరంభంలో మొదలయ్యే డెలివరీల కోసం గాను దీన్ని బుక్ చేసుకునే అవకాశాన్ని ఇది అందిస్తోంది.

బ్రాండ్ విలువ పెంచుకునే దిశగా ప్రొటినెక్స్



న్యూఢిల్లీ: దేశంలోని ప్రముఖ న్యూట్రిషినల్ సప్లిమెంట్ బ్రాండ్ ప్రొటినెక్స్ తాజాగా మేక్ ఇట్ ఏ హాబిట్ క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. దీనిని ప్రతీరోజు తీసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యం సమకూరుతుందని ప్రొటినెక్స్ పేర్కొంది. నూతన సంవత్సరంలోనే తీసుకునే నిర్ణయాలలో ప్రొటినెక్స్‌ను భాగస్వామ్యం చేసుకోవాలని సూచించింది. ప్రొటినెక్స్ హెల్త్, వెల్ బీయింగ్‌కు దోహదపడుతుందని సంస్థ పేర్కొంది. దేశంలోని ప్రజలు ఆరోగ్యం విషయంలో అంతగా శ్రద్ధ చూపడంల లేదని ఇటీవలి వైద్య పరిశోధనల్లో తేలింది.

పోలీసులకు వారాంతపు సెలవులు


అమలు చేసిన మధ్య ప్రదేశ్ ప్రభుత్వం

భోపాల్ : మధ్య ప్రదేశ్‌లోని పోలీసులకు మొదటిసారిగా వారాంతపు సెలవు లభించింది. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి కమల్ నాథ్ నేతృత్వంలోని అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త సంవత్సరం సందర్భంగా ఈ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటి వరకు రాష్ట్ర పోలీసులకు ఏటా సాధారణ సెలవులు (సీఎల్), అనారోగ్యపు సెలవులు (ఎస్ఎల్), ఆర్జిత సెలవులు (ఈఎల్) మాత్రమే ఉండగా ఇక నుంచి ప్రతి పోలీసుకు కచ్చితంగా వారాంతపు సెలవు (వీక్లీ ఆఫ్) లభించనుంది. ఈ విషయాన్ని మధ్య ప్రదేశ్ డీజీపీ రిషి కుమార్ శుక్లా మంగళవారం ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వర్తిస్తున్న పోలీసులు సహా జిల్లాల్లోని ప్రత్యేక సాయుధ బలగాల యూనిట్లకు ఇది వర్తిస్తుందని వెల్లడించారు.

దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి కమల్ నాథ్, 'మేము ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీని అమలు చేశాం. పోలీసులకు ఇచ్చిన వారంలో ఒక రోజు సెలవును వారు తమ కుటుంబానికి కేటాయిస్తారని ఆశిస్తున్నాం' అని ట్వీట్ చేశారు. అయితే, ఈ వారాంతపు సెలవు తమలో ని ఒత్తిడిని దూరం చేస్తుం దని, వారాని కోసారి తమ కుటు ంబాలతో గడిపేం దుకు ఇది చక్కని అవకాశ మని పోలీసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



అక్కడ ఇటుక ఉంచేందుకు నేనే స్వయంగా వెళతాను : ఫరూక్ అబ్దుల్లా



న్యూఢిల్లీ : నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు, జమ్మూ కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అయోధ్య భూ వివాదం కేసు ఈ నెల 10కి సుప్రీం కోర్టు వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, శ్రీరాముడు యావత్ ప్రపంచానికి చెందినవాడని, కేవలం హిందువులకే పరిమితం కాదని అన్నారు. అయోధ్య భూ వివాదం సమస్య చర్చల ద్వారానే పరిష్కారం కావాలని, ఈ అంశంపై సంబంధిత వ్యక్తులు కలసి చర్చించి పరిష్కరించుకోవాలే తప్ప కోర్టులను ఎందుకు ఆశ్రయించాల్సి వచ్చిందని ప్రశ్నించారు. ఈ వివాదం పరిష్కారమైన రోజున అక్కడ ఇటుక ఉంచేందుకు తాను స్వయంగా వెళతానని చెప్పిన ఫరూక్ అబ్దుల్లా, సాధ్యమైనంత త్వరగా రామాలయం అంశంపై పరిష్కారం కనుగొనాలని సూచించారు.

టీడీపీ ఎంపీలకు ములాయం సింగ్ మద్దతు



న్యూఢిల్లీ : ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రత్యేక హోదాతో పాటు, విభజన హామీలన్నింటినీ నెరవేర్చాలంటూ పార్లమెంటులో టీడీపీ ఎంపీలు ఆందోళన చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, 14 మంది టీడీపీ ఎంపీలను సభ నుంచి గురువారం స్పీకర్ సుమిత్రా మహాజన్ నాలుగు రోజుల పాటు సస్పెండ్ చేశారు. దీంతో, శుక్రవారం వారంతా పార్లమెంటు ప్రాంగణంలో ప్లకార్డులు పట్టుకుని, ఆందోళన చేశారు. కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారి వద్దకు సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవ్ వచ్చారు. ఎంపీల ఆందోళనకు తన మద్దతు ప్రకటించారు. వారితో కలసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఎరుపు రంగు దుస్తులు ధరిస్తే హత్యే

• వారి ఇంటికి వెళ్లి రేప్ చేసి దోపిడీ • బాధితుల్లో 8 ఏళ్ల చిన్నారి



బీజింగ్ : ఎరుపు రంగు దుస్తులు ధరించి కనిపించే మహిళలను హత్య చేసే సీరియల్ కిల్లర్‌కు చైనా మరణ శిక్ష అమలు చేసింది. 1988-2002 కాలంలో 10 మంది మహిళలను గావో చెంగ్యాంగ్ అనే వ్యక్తి హత్య చేశాడు. వారిలో ఓ బాలిక కూడా ఉంది. ఓ చిన్న కేసులో అతడి అంకుల్ ఇచ్చిన డీఎన్ఏను పరీక్షిస్తుండగా అసలు విషయం బయటపడింది. మహిళల హత్యల వెనుక గావో హస్తం ఉందని తేలడంతో పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. తాజాగా, కోర్టు అతడిని దోషిగా తేల్చి మరణ శిక్ష విధించడంతో ప్రభుత్వం శిక్ష అమలు చేసింది. బెయినీలో పచారీ సరకుల దుకాణం ఉన్న గావో చెంగ్యాంగ్‌కు ఇద్దరు సంతానం. ఎరుపు రంగు దుస్తులు ధరించి మహిళలు కనిపిస్తే వారిని వెంబడించేవాడు. వారిని అనుసరిస్తూ ఇంటికి వెళ్లి వారిని రేప్ చేసి, ఇంటిని దోచుకుని దారుణంగా చంపేసేవాడు. అంతే కాదు, వారి మర్మాయవాలను తెగ్గోసేవాడు. అతడి బారినపడి ప్రాణాలు కోల్పోయిన వారిలో ఎనిమిదేళ్ల బాలిక కూడా ఉంది. మూడు దశాబ్దాల క్రితం జరిగిన ఈ హత్యలను ఛేదించడం పోలీసులకు పెను సవాలుగా మారింది. అయితే, ఓ చిన్నపాటి కేసు విషయంలో గావో బాబాయి పరీక్షల కోసం డీఎన్ఏ ఇవ్వడంతో గావో బండారం బయటపడింది. దాని ఆధారంగా జరిపిన దర్యాప్తులో విస్తుపోయే విషయాలు వెల్లడయ్యాయి. దీంతో గావోను అదుపులోకి తీసుకున్నారు. గత ఏడాది మార్చిలో బెయిన్ సిటీ ఇంటర్మీడియెట్ పీపుల్స్ కోర్టు గావోను దోషిగా నిర్ధారించి మరణ శిక్ష విధించింది. సాధారణంగా చైనాలో మరణ శిక్షలను లెథల్ ఇంజక్షన్ ఇచ్చి గానీ, ఫైరింగ్ స్క్వాడ్‌తో కాల్చి చంపి గానీ అమలు చేస్తారు. అయితే, ఇతని విషయంలో ఎలా అమలు చేసిందీ తెలియరాలేదు.

'చంద్రబాబు ! రైతులు గగ్గోలు పెడుతున్నారు'



గుంటూరు,సూర్యబ్యూరో: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతు రుణమాఫీ అన్నారని, ఆయన చేసిన రుణమాఫీ రైతులు వడ్డీ కట్టుకోవడానికి కూడా సరిపోలేదని రైతులు గగ్గోలు పెడుతున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు మహీదర్ రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ యువతకు నిరుద్యోగ భృతి 2000 ఇస్తానన్నావు.. నాలుగున్నర ఏళ్ళ తర్వాత 1000 అంటున్నావు. బాబు వస్తే జాబు వస్తుందన్నావు నువ్వు వచ్చిన తర్వాత అనేక మందిని తొలగించావు. యువత నిన్ను ఎందుకు నమ్మాలి?. డ్వాక్రా మహిళలకు రుణమాఫీ అన్నావు. 10 వేలు ఇచ్చి రుణమాఫీ చేశావని అబద్దాలు చెబుతున్నావు. డ్వాక్రా మహిళలు నిన్ను ఎలా నమ్మాలి బాబు?. గడిచిన 4సంవత్సరాల 8 నెలల్లో కందుకూరు నియోజకవర్గ రైతులకు ముఖ్యమైన రాళ్లపాడుకు నీరందించే సోమశిల ఎడమ కాలువ పనులు 15 శాతం పూర్తి చేయడమే చేతకాలా. రామాయపట్నం పోర్ట్ పూర్తి చేస్తావా? నిన్ను ఎలా నమ్మాలి?. నాలుగున్నర సంవత్సరాలుగా రామాయపట్నం పోర్టు గురించి పట్టించుకోని బాబు ఎన్నికల ముందు పోర్టుకు శంకుస్థాపన చేస్తానంటే నిన్ను ఎవరు నమ్ముతారు?. పేపరు మిల్లు పేరుతో చంద్రబాబు ప్రజలను మోసం చేస్తున్నారు. కందుకూరు నియోజకవర్గ గ్రామాలలో త్రాగు నీరు ఇబ్బందిగా ఉంటే పేపరు మిల్లుకు నీరెలా ఇస్తావని ప్రశ్నించారు.

'మేఘాలయ గని బ్లూప్రింట్ లేదు'



న్యూఢిల్లీ : మేఘాలయ బొగ్గు గనిలో చిక్కుకుపోయిన కార్మికులను కాపాడేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు సంబంధించిన నివేదికను సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా శుక్రవారం సుప్రీం కోర్టుకు అందజేశారు. 'ఆ గనిలో అక్రమంగా తవ్వకాలు చేపడుతున్నారు. దీన్ని సరిగ్గా నిర్వహించడం లేదు. 355 అడుగుల లోతు ఉన్న ఈ గని బ్లూప్రింట్ కూడా లేదు. భారత నేవీకి చెందిన ప్రత్యేక అనుభవం ఉన్న డైవర్లు గని వద్ద సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. కానీ గనికి సమీపంలో నది ఉండడం వల్ల సహాయక చర్యలు కష్టతరంగా మారాయి' అని కేంద్రం, ప్రభుత్వం తరఫున హాజరైన తుషార్ మెహతా న్యాయస్థానానికి తెలియజేశారు. ఎన్డీఆర్ఎఫ్‌కు చెందిన 72 మంది ఇప్పటికే సహాయక చర్యల్లో నిరంతరం పాల్గొంటున్నప్పటికీ ఎటువంటి ఫలితమూ కనిపించలేదని తెలిపారు. గనిలో నీటి స్థాయి ఎక్కువగా ఉండడం వల్ల సహాయక చర్యలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన వెల్లడించారు. అక్రమంగా గని తవ్వకాలు చేపట్టిన సదరు యజమానిపై కఠిన చర్యలు తీసుకోవాలని న్యాయస్థానం ఆదేశించింది. వారి వల్ల కార్మికులు ఎందుకు ఇబ్బందులు పడాలి అని ప్రశ్నించింది. కేంద్రంతో పాటు మేఘాలయ అధికారులు కార్మికులను కాపాడేందుకు తీసుకుంటున్న చర్యలకు సంబంధించిన మరిన్ని వివరాలతో నివేదికను ఈ నెల 7న అందజేయాల్సిందిగా జస్టిస్ ఏకే సిక్రి, జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్‌తో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. మేఘాలయలోని తూర్పు జయంతియా జిల్లాలో డిసెంబర్ 13న 15 మంది కార్మికులు బొగ్గు గనిలో చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. ఘటన జరిగి 23 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ కార్మికుల ఆచూకీ తెలియరాలేదు.

'చంద్రబాబు మాట్లాడేది ఆయనకే అర్థం కావడం లేదు'

హైదరాబాద్,సూర్యబ్యూరో: అగ్రిగోల్డ్ ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని వై సీపీ సీనియర్ నాయకులు బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం 20వేల రూపాయలు చెల్లించాలని కోరారు. ప్రభుత్వం బాధితులను ఆదుకోని పక్షంలో వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఏం మాట్లాడుతున్నారో ఆయనకే అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. అసలు రాష్ట్రంలో ఆర్థిక, రెవెన్యూ శాఖ మంత్రులు ఉన్నారా అని ప్రశ్నించారు. చుక్క భూములు కూడా పెద్ద స్కాం అని ఆరోపించారు. ఆ భూములను చంద్రబాబుకి చెందిన వ్యక్తులకు ధారాదత్తం చేశారని విమర్శించారు. వైఎస్ జగన్‌పై జరిగిన హత్యాయత్నం కేసును హైకోర్టు జాతీయ దర్యాప్తు సంస్థకు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర డీజీపీకి చట్టాలు తెలుసా? తెలియవా? అంటూ సూటిగా ప్రశ్నించారు. అబద్ధాలకు అవార్డ్స్, రివార్డ్స్ ఇస్తే చంద్రబాబుకు ఇవ్వచ్చని వ్యాఖ్యానించారు.

చంద్రబాబు పూటకో మాట రోజుకో మాట మాట్లాడుతున్నారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎవరితోనూ పొత్తులు ఉండవని ఒంటరిగానే పోటీ చేస్తామని స్పష్టం చేశారు. 100 రోజులు ఆగితే ప్రజా వ్యతిరేకత అంటే ఏమిటో చంద్రబాబుకు తెలుస్తుందన్నారు. త్వరలో వైఎస్సార్ సీపీలోకి భారీ ఎత్తున చేరికలు ఉంటాయని అన్నారు.

మొదటి పేజీ తరువాయి

రంగంలోకి ఎన్ఐఏ



తీసుకోకపోతే, తామే తీసుకుంటామని హైకోర్టు తేల్చిచెప్పడంతో కేంద్రం దిగొచ్చి ఎన్ఐఏ విచారణకు అంగీకరించింది. రక్షణశాఖకు చెందిన తూర్పు నావికాదళం పర్యవేక్షణలో ఉన్న ఎయిర్‌పోర్ట్‌లో జరిగిన ఈ దారుణ ఘటన వెనుక భారీ కుట్ర దాగి ఉందనేది ఒక్క రాష్ట్ర ప్రభుత్వం మినహా కేంద్రం మొదలు అన్ని రాజకీయ పక్షాలూ అనుమానిస్తూ వచ్చాయి. ఎయిర్‌పోర్ట్ భద్రతను పర్యవేక్షిస్తున్న కేంద్ర పారిశ్రామిక భద్రతాదళం (సీఐఎస్ఎఫ్) ఉన్నతాధికారులు కూడా ప్రాథమిక విచారణలో ఇదే నిర్ధారణకు వచ్చారు. అయితే ఘటన జరిగిన మరుక్షణం నుంచే కేసును నిర్వీర్యం చేసేందుకు, పక్కదారి పట్టించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆరాటపడుతూ వచ్చింది. ఆ క్రమంలోనే సీఎం చంద్రబాబు మొదలు, డీజీపీ ఠాకూర్, మంత్రులు, టీడీపీ నేతలు నోటికొచ్చినట్టు మాట్లాడారు. వైఎస్ జగన్‌పై సానుభూతి కోసమే శ్రీనివాసరావు దాడి చేశాడని ఏకపక్షంగా ప్రకటనలు చేశారు. ఏదో చిన్నపాటి ఘటనగా చిత్రీకరించేందుకు యత్నించారు. అందుకే కేంద్ర దర్యాప్తు సంస్థలతో నిష్పక్షపాతంగా విచారణ నిర్వహించాలని వైసీపీ న్యాయస్థానాన్ని కోరింది. డిసెంబర్ 31న ఈకేసును ఎన్ఐఏకి బదిలీ చేసినట్టు ఏపీ హైకోర్టుకు కేంద్రం తెలిపింది. హోం శాఖ ఆదేశాలతో హైదరాబాద్ ఎన్ఐఏ విభాగం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ప్రధాన విచారణ అధికారిగా మహ్మద్ సాజిద్ ఖాన్‌ను నియమించారు.

కోడికత్తి కేసు ఎన్ఐఏకు ఇవ్వడంపై ఏపీ ప్రభుత్వం అభ్యంతరం

కోడికత్తి కేసు వ్యవహారం మరోసారి తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశమైంది. కోడికత్తి కేసు ఎన్ఐఏకు అప్పగిస్తూ ఏపీ హైకోర్టు నిర్ణయం తీసుకుంది. అయితే ఈ కేసును ఎన్ఐఏకు ఇవ్వడంపై ఏపీ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఎన్ఐఏ ఉగ్రవాదం, విమానాల హైజాక్ కేసులు దర్యాప్తు చేసే సంస్థని పేర్కొంది. కోడికత్తి కేసు ఎన్ఐఏ పరిధిలోకి రాదని ప్రభుత్వ న్యాయవాదులు కోర్టులో వాదనలు వినిపించారు. ఇప్పటికే కోడికత్తి కేసు దర్యాప్తును ఏపీ ప్రభుత్వం పూర్తి చేసిందని న్యాయవాదులు వెల్లడించారు. దర్యాప్తు నివేదికను పోలీసులు సీల్డ్‌కవర్‌లో హైకోర్టుకు సమర్పించారు. అయినా ఈ కేసును ఎన్ఐఏకు అప్పగించడానికే హైకోర్టు మొగ్గుచూపింది. ఈ నేపథ్యంలో కోడికత్తి కేసును ఎన్ఐఏకు అప్పగించడాన్ని తప్పుపడుతూ కేంద్ర హోంశాఖకు ఏపీ ప్రభుత్వం లేఖ రాయాలన్న యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. విశాఖ ఎయిర్‌పోర్టులో ప్రతిపక్ష నేత జగన్‌పై కోడికత్తితో దాడి జరిగిన సంగతి తెలిసిందే. ఈ కేసును సిట్‌కు అప్పగిస్తూ ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

మోడీ పాలనలో భద్రత లేదని అన్నారో బాంబులతో లేపేస్తా




లక్నో : ఉత్తర ప్రదేశ్‌కు చెందిన భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యే విక్రమ్ సైనీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో భద్రత కరవయిందని చెప్పేవారిని బాంబులతో లేపేయాలని వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రపంచవ్యాప్తంగా నీరాజనాలు అందుకుంటున్నారని తెలిపారు. కానీ కొందరు ద్రోహులు మాత్రం భారత్‌లో రక్షణ లేదంటూ వ్యాఖ్యానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీళ్లంతా ఎక్కడ క్షేమంగా ఉంటామని భావిస్తారో, అక్కడికే వెళ్లిపోవాలని స్పష్టం చేశారు. లేదంటే తనకు హోమ్ శాఖ ఇవ్వాలనీ, ఒకవేళ తనకు హోమ్ శాఖ ఇస్తే ఇలా మాట్లాడుతున్న వారందరినీ బాంబులతో లేపేస్తానని హెచ్చరించారు. బీజేపీ తప్ప మిగతా పార్టీలన్నీ వందేమాతరం గీతాలాపనను విస్మరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్య ప్రదేశ్ సెక్రటేరియట్‌లో వందేమాతరం ఆలాపన సంప్రదాయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేయడాన్ని తప్పు పట్టారు. చివరగా ఇదంతా తన వ్యక్తిగత వ్యాఖ్యలనీ, దీనికి పార్టీతో సంబంధం లేదని స్పష్టం చేశారు.

ఎన్నికలకు ముందే కాంగ్రెస్ పదవుల పంపకాలు

పెద్ద పెద్ద నేతలు ఓడిపోయారని, నాగార్జున సాగర్ లో జానారెడ్డి కూడా ఓడిపోయారన్నారు. ప్రధాని మోదీ, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో సహా కేంద్రమంత్రులు ఆరోగ్యం బాగోలేని సోనియాను కూడా తీసుకొచ్చి ప్రచారం చేయించిన, తెలంగాణ ప్రజలు మాత్రం కేసీఆర్ పట్ల విశ్వాసాన్ని ప్రదర్శించారని కేటీఆర్ అన్నారు. చంద్రబాబును తరిమి తరిమి కొడితే, కాంగ్రెస్ మళ్లీ పట్టుకొచ్చిందన్నారు. చంద్రబాబు ఇచ్చిన రూ. 500 కోట్లతో కాంగ్రెస్ కుట్రలు చేసిందన్న కేటీఆర్, కాంగ్రెస్ నేతలు అమరావతికి గులాములుగా మారినా, తెలంగాణ ప్రజలు మాత్రం తమ అస్థిత్వాన్ని చాటుకున్నారు. 2014లో 63 సీట్లు గెలిస్తే, ఇప్పుడు 88 సీట్లు గెలిచామని తెలిపారు. 47 శాతం ఓట్లతో 75 శాతం సీట్లు సాధించామని తెలిపారు. 2014 శాసన సభ ఎన్నికల్లో నల్లగొండ జిల్లాలో కు ఆరు సీట్లు గెలిచామని గుర్తు చేశారు. ఉద్యమం అప్పట్నుంచి నేతలు కష్టపడి పనిచేయడం వల్లే మొన్నటి ఎన్నికల్లో నల్లగొండ లో మహామహులు మట్టి కరిచారన్నారు. కాంగ్రెస్ నేతలకు బుర్రలు పని చేయడం లేదని, తెలంగాణ ప్రజలు ఇచ్చిన తీర్పుతో వారి దిమ్మతిరిగిందన్నారు. హుజుర్ నగర్ లో ట్రక్కు గుర్తు, టక్కు టమార విద్యల వల్ల ఉత్తమ్ గెలిచారన్నారు. చంద్రబాబు ఇచ్చిన 500 కోట్ల రూపాయల కు ఆశపడి కాంగ్రెస్ టీడీపీ కి దాసోహమందన్నారు. తెలంగాణ ప్రజలు ఉద్యమ స్ఫూర్తి ని ప్రదర్శించిను ,కెసిఆర్ ను అక్కున చేర్చుకున్నారన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ట్రక్కు గుర్తుతో కలిపి టీఆర్ఎస్‌కు యాభయి శాతం ఓట్లు వచ్చాయని తెలిపారు. వచ్చే ఎన్నికల కోసం బూత్ స్థాయి కమిటీ లు పటిష్టం చేసుకోవాలని, పది ఇండ్లకో కార్యకర్త ను నియమించుకోవాలన్నారు. వంద మంది కో కార్యకర్త ఉండాలన్నారు. సిరిసిల్ల లో పటిష్టమయిన బూత్ కమిటీ లతోనే తన మెజారిటీ పెరిగిందన్నారు. కెసిఆర్ చొప్ప దండి అల్లుడని పేర్కొన్న కేటీఆర్, అన్ని విధాల నియోజక వర్గాన్ని అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ నేతలు అధికారం వస్తుందని పగటి కలలు కని మంత్రి పదవులు సైతం పంచుకున్నారంటూ కేటీఆర్ విమర్శించారు. అధికారం వచ్చిందనే గర్వం కార్యకార్తలకు పనికి రాదని, ప్రజల తోనే మమేకం కావాలని సూచించారు.

సంక్షేమానికి నో కోడ్



చేశామని నాగి రెడ్డి తెలిపారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణతో పాటు ఎన్నికల కోడ్ పై అవగాహన కల్పించామని చెప్పారు. సాధారణ, వ్యయ పరిశీలకులకు జిల్లాలు కేటాయించాం. ఎక్కడైనా రిగ్గింగ్ జరిగితే రీపోలింగ్ జరిపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. పరిమితికి మించి ఎన్నికల ఖర్చు చేస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో ఖర్చులు చూపెట్టని వారిని అనర్హులుగా ప్రకటించామని చెప్పారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి పంచాయతీలో పోలీసులు అందుబాటులో ఉంటారని తెలిపారు. అదనపు బలగాలు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. ఇప్పటి వరకు కోడ్ ఉల్లంఘన కేసు నమోదు కాలేదని పేర్కొన్నారు. ఒత్తిడితో ఏకగ్రీవం చేయరాదు.. అలా చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ఎన్నికల గుర్తులు వచ్చేశాయి..

గ్రామపంచాయతీ ఎన్నికల గుర్తులు వచ్చేశాయి. సర్పంచ్ స్థానానికి 30, వార్డు సభ్యులకు 20 గుర్తులను ఎన్నికల సంఘం ఖరారు చేసింది.

ఈ నెల 21, 25, 30 తేదీల్లో ఎన్నికలు జరగనున్న విషయం విదితమే. పార్టీరహితంగా జరిగే ఈ ఎన్నికలకు ఎన్నికల సంఘం గుర్తులు కేటాయించింది. సర్పంచ్ పదవికి 30 గుర్తులు, వార్డు సభ్యుడి పదవికి 20 గుర్తులు నిర్దేశించింది.

సర్పంచ్ గుర్తులు...

1. ఉంగరం, 2. కత్తెర, 3. బ్యాట్, 4.కప్పు,సాసర్, 5.విమానం, 6.బంతి, 7.షటిల్, 8.కుర్చీ, 9.వంకాయ, 10. నల్లబోర్డు, 11.కొబ్బరికాయ, 12.లేడీపర్సు, 13. మామిడికాయ, 14. సీసా, 15. బకెట్, 16. బుట్ట, 17. దువ్వెన, 18.ఆరటిపండు, 19 మంచము. 20. పలక, 21.టేబుల్, 22. బ్యాటరీలైటు, 23.బ్రష్, 24. క్యారెట్, 25.గొడ్డలి, 26.గాలిబుడగ, 27.బిస్కెట్, 28. వేణువు, 29 ఫోర్కు, 30. చెంచా గుర్తులను కేటాయించారు.

వార్డుల సభ్యుల గుర్తులు...


1.జగ్గు, 2.గౌను, 3.గ్యాస్‌పొయ్యి, 4.స్టూల్, 5.గ్యాస్ సిలిండర్, 6.గాజుగ్లాసు, 7.బీరువా, 8.ఈల, 9.కుండ, 10.డిష్ యాంటెనా, 11.గరాటా, 12.మూకుడు, 13.కెటిల్, 14. విల్లు, బాణము, 15.కవరు, 16. హాకీ మరియు బంతి, 17.నెక్‌టై, 18. కటింగ్‌ప్లేయర్, 19.పోస్టుడబ్బా, 20. విద్యుత్ స్తంబము గుర్తులను కేటాయించారు.

విమానం టేకాఫ్ అవగానే స్పృహ తప్పి మృతి చెందిన బాలుడు



కోల్‌కతా : ఇటీవల కోల్‌కతా - బెంగుళూరు విమానంలో ఓ వ్యక్తి అస్వస్థతకు గురై మృతి చెందిన విషయం మరువక ముందే మరో ఘటన జరిగింది. ఇది కూడా కోల్‌కతా - బెంగుళూరు విమానంలోనే జరిగింది. అనారోగ్యంతో బాధ పడుతున్న 16 ఏళ్ల సుమన్ పాల్ అనే బాలుడిని చికిత్స నిమిత్తం అతని కుటుంబ సభ్యులు బెంగళూరుకు తీసుకువెళ్లే నిమిత్తం విమానం ఎక్కారు. అయితే, విమానం టేకాఫ్ అవుతుండగానే సుమన్ స్పృహ తప్పాడు. వెంటనే క్యాబిన్ సిబ్బంది పైలట్ దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లడంతో విమానాన్ని అత్యవసర ల్యాండింగ్ చేశారు. హుటాహుటిని సుమన్‌ను ఆసు పత్రికి తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరిం చారు. అయితే, పూర్తి అనారోగ్యంతో ఉన్న బాలుడిని విమానంలో ప్రయాణిం చేందుకు ఎలా అనుమతించారన్న దానిపై విమానాశ్రయ వర్గాలు విచారణ నిర్వహిస్తున్నాయి.

4 పథకాలు 8 ప్రాజెక్టులు



డెస్టినేషన్, వాటర్ సప్లై స్కీమ్ తదితర ప్రాజెక్టులు ఉన్నాయి. ఇంటెగ్రేటెడ్ చెక్ పోస్టును రూ. 125 కోట్ల వ్యయంతో నిర్మించారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ, ఇది చెక్‌పోస్టు మాత్రమే కాదని, ఇందులో డజన్ల కొద్దీ ప్రత్యేక లక్షణాలు ఉన్నాయని చెప్పారు. ఈ పర్యటనలో నాలుగు ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేశారు. ధనమంజురి యూనివర్శిటీలో మౌలిక వసతుల అభివృద్ధికి ఆయన శంకుస్థాపన చేశారు. దీంతో పాటు, ఇంఫాల్ తూర్పు జిల్లాలోని ఖుమన్ లాంపాక్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో హాకీ స్టేడియం, ప్రధాన స్టేడియంలకు లైట్ల ఏర్పాటు, ఇంఫాల్ పశ్చిమ జిల్లాలోని గ్రౌండ్‌లో ఆస్ట్రో టర్ఫ్ వేసే కార్యక్రమాలనకు శంకుస్థాపన చేశారు.

ఎన్ఆర్‌సీ నుంచి అర్హులను తొలగించం: మోడీ

సిల్చార్ : అర్హులైన దేశ పౌరులెవర్నీ జాతీయ పౌరుల రిజిస్టర్ (ఎన్ఆర్‌సీ) నుంచి తొలగించే ప్రసక్తి ఉండదని ప్రధాని నరేంద్ర మోడీ భరోసా ఇచ్చారు. అసోంలోని సిల్చార్‌లో శుక్రవారం జరిగిన ర్యాలీలో ప్రధాని మాట్లాడుతూ, ఎన్ఆర్‌సీ ప్రక్రియలో పలువురు కష్టాలు ఎదుర్కోవడం, ఇబ్బందులు చవిచూడడం తాను గుర్తించానని, అయితే ప్రజల త్యాగాలు, దేశభక్తి ఫలితంగానే ఎన్ఆర్‌సీ సాధ్యమైందని అన్నారు. అర్హులైన దేశ పౌరులు ఎవరికీ ఎలాంటి ఇబ్బంది ఉండదని, జాబితా నుంచి తొలగించే ప్రసక్తే తలెత్తదని అన్నారు. పార్లమెంటులో పౌరుల సవరణ బిల్లుకు ఆమోదం లభించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కూడా ప్రధాని ప్రకటించారు. 'పౌరసత్వ హక్కుల బిల్లు ఏ ఒక్కరి ప్రయోజనాలకో ఉద్దేశించినది కాదు. గతంలో జరిగిన అన్యాయాలకు వ్యతిరేకంగానే బిల్లు తీసుకువస్తున్నాం. త్వరలోనే పార్లమెంటులో బిల్లుకు ఆమోదం లభిస్తుందని ఆశిస్తున్నాను' అని ప్రధాని చెప్పారు. రాష్ట్ర ఐడెంటిటీ పరిరక్షణకు ఉద్దేశించిన అసోం అకార్డ్‌లోని క్లాజ్ 6 అమలుకు ప్రభుత్వం నిర్ణయించిందని కూడా ఆయన చెప్పారు. 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్'కు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

'అసోం కేవలం రాష్ట్రం కాదు. పూర్తి వనరులు, సుసంపన్న సంస్కృతి కలిగిన శక్తిమంతమైన సమాజం. అసోమీ సంస్కృతి, భాష, వనరులు, హక్కుల పరిరక్షణకు మా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుంది' అని ప్రధాని భరోసా ఇచ్చారు. కాగా, మణిపూర్‌లో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు మోడీ శుక్రవారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.

'కేంద్రం సహకరించడం లేదంటూ రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోంది'

న్యూఢిల్లీ,సూర్యబ్యూరో: కేంద్రం సహకరించడం లేదంటూ రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని ఎంపీ హరిబాబు విమర్శించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ నరేగా నిధులు ఇవ్వలేదంటున్నారని 2018-19 గాను రూ. 6,243 కోట్లు ఇచ్చామని వెల్లడించారు. గతేడాది కంటే వెయ్యి కోట్లు అదనంగా నరేగా నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. కేంద్రం చేస్తున్న సహాయాన్ని చిన్నదిగా చూపే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఏపీ అభివృద్ధికి కేంద్రం చేయాల్సిందంతా చేస్తుందని చెప్పారు. కాంగ్రెస్‌ది నక్క తోక కాదని కుక్కతోక మాత్రమే అని ఎంపీ హరిబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు..



ఏపీపై కేంద్రం కుట్ర రాజకీయాలు చేస్తోంది: ఎంపీ కొనకళ్ల

న్యూఢిల్లీ, సూర్య ప్రతినిధి : పార్లమెంట్‌లో చేసిన చట్టాలనే అమలు చేయాలని కోరాల్సిన పరిస్థితి వచ్చిందని టీడీపీ ఎంపీ కొనకళ్ల నారాయణ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏపీపై కేంద్రం కుట్ర రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. కేంద్రాన్ని నిలదీయాల్సిన వైసీపీ నేతలు బీజేపీకి తొత్తుగా మారారని కొనకళ్ల విమర్శించారు. ఏపీ ప్రజలు రాష్ట్ర హక్కులు సాధించుకునే వరకు ఊరుకోరని మరో టీడీపీ ఎంపీ అశోక్ గజపతిరాజు అన్నారు. రాష్ట్రానికి రావాల్సిన వాటిని అడిగితే సస్పెండ్గ చేస్తారా? అంటూ ఎంపీ మురళీమోహన్ మండిపడ్డారు. రాష్ట్రానికి కేంద్రం న్యాయం చేయకపోగా కక్ష సాధిస్తోందని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు.

జగన్ కేసు విచారణ 25కు వాయిదా

అమరావతి, సూర్య బ్యూరో : వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసు విచారణ ఈ నెల 25కు వాయిదా పడింది. సీబీఐ కోర్టు న్యాయమూర్తి వెంకటరమణ ఏపీకి బదిలీ కావడంతో, కొత్త జడ్జీ వచ్చే వరకు దీనిపై విచారణ నిలిచిపోనుంది. జడ్జి వెంకటరమణ రెండేళ్ల పాటు మూడు ఛార్జిషీట్లపై సుమారు 100 గంటలపాటు వాద, ప్రతివాదనలు విన్నారు. ఉమ్మడి హైకోర్టు విభజనతో వెంకటరమణ ఏపీకి బదిలీ అయ్యారు. దీంతో కొత్త జడ్జీ వచ్చాక విచారణ మళ్ళీ మొదటికి వచ్చే అవకాశం లేకపోలేదని సీనియర్ న్యాయవాదులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జనవరి ఏడు నుంచి సంక్రాంతి సెలవులు కావడంతో, సెలవుల అనంతరం వాదనలు ప్రారంభం కానున్నాయి.

కాసుల పంచాయతీ

• పెరిగిన ఎన్నికల ఖర్చు పరిమితి • బలమైన అభ్యర్థుల కోసం పార్టీల అన్వేషణ • పల్లెల్లో మొదలైన సందడి • ఇక క్యాష్ అండ్ క్యారీ

కరీంనగర్–సూర్యప్రధానప్రతినిధి :ఎలాంటి ఎన్నికలైన కాసుల వర్షం కురువాల్సిందే... కాసులు లేకుండా ఎన్నికలు ఒక అడుగు కూడా ముందుకు పడని పరిస్థితి నెలకొంది. రాను రాను డబ్బుల్లేని వారు ఎన్నికలకు దూరం కావాల్సిన ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. నీతి నిజాయితి, నిబద్ధతు రాను రాను మసకబారుతున్నాయి. సాధారణ ఎన్నికల సంగతి పక్కన పెడితే గ్రామ పంచాయితి ఎన్నికలపై క్రమంగా కాసుల ప్రభావం అధిపత్యం చెలాయిస్తోంది. పదవుల ప్రాధాన్యత రోజు రోజుకు పెరిగిపోవడం, ఎన్నికల్లో గెలిచిన అనంతరం ప్రజాప్రతినిధిగా పెట్టిన పెట్టుబడికి నాలుగింతలుగా సంపాదించవచ్చన్న దురాశ తోడవ్వడంతో ఎన్నికల ఆశయం నీరుగారిపోతుంది. ఎన్నికల్లో పోటి చేసే అభ్యర్థులు పోటాపోటిగా ఖర్చు పెట్టడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తోంది. గత 2018 సాధారణ ఎన్నికల్లో ఎమ్మెల్యే పదవులకు పోటి చేసిన అభ్యర్థులు వ్యయం చేసిన ఖర్చు సామాన్యున్ని సైతం కళ్లు తిరిగేలా చేసింది. ఆ కాసుల వాసన దూరం కాకముందే రాబోయే నెలలో జరుగబోతున్న సర్పంచ్, వార్డు మెంబర్ పదవులకు జరుగనున్న ఎన్నికలు కాసుల తుఫాన్‌ను సృష్టించబోనున్నాయి. ఈ నేపథ్యంలోనే ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికల వ్యయాన్ని పెంచుతుండడం ప్రాధాన్యతన సంతరించుకుంటుంది. ఈ సారి జరుగనున్న పంచాయితీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యులకు పోటి చేసే అభ్యర్థుల వ్యయ పరిమితిని పెంచింది. ఐదేవేలకు పైగా జనాభా ఉన్న గ్రామ పంచాయితి సర్పంచ్‌లకు రూ. 2.50లక్షలు, ఐదువేల లోపు ఉన్న గ్రామ పంచాయితీలకు రూ. 1.50లక్షల ఎన్నికల వ్యయంగా నిర్ణయించారు. అధికారికంగా వ్యయంను పెంచడంతో ఇక అనధికార వ్యయం ఇష్టానుసారంగా చేసేందుకు మార్గం ఏర్పడిందంటున్నారు.

అధికారికంగా పెరిగిన వ్యయం:గత ఎన్నికల తో పోలిస్తే గ్రామ పంచాయితీ ఎన్నికల వ్యయం మూడింతలుగా పెరిగింది. స్వయంగా ఎన్నికల సంఘం వ్యయ పరిమితిని పెంచడంతో పదవులకు పోటి చేసేందుకు ఉత్సాహ పడుతున్న శ్రీమంతులంతా ఇప్పటి నుంచే సిద్ధమవుతున్నారు.కాగా ఐదు వేలకు పైగా జనాభా ఉన్న గ్రామ పంచాయితిలకు పోటి చేసే సర్పంచ్ అభ్యర్థులకు రూ. 2.50లక్షల, వార్డు సభ్యుడికి రూ. 50వేలుగా వ్యయ పరిమితిని నిర్ణయించారు. గతంలో సర్పంచ్‌కు రూ. 80వేలు, వార్డు సభ్యుడికి కేవలం రూ. 10వేలుగా నిర్ణయించారు. అయితే ఐదువేలలోపు జనాభా ఉన్న గ్రామ పంచాయితీ సర్పంచ్ పదవికి పోటి చేసే అభ్యర్థులకు వ్యయ పరిమితిని రూ. 1.50లక్షలు, వార్డు సభ్యుడికి రూ. 30వేలుగా నిర్ణయించారు. గతంలో సర్పంచ్ పదవికి రూ. 40వేలు, వార్డుసభ్యుడికి రూ. ఐదు వేలుగా ఉండేది. వ్యయ పరిమితి గతం కన్నా ఎక్కువగా పెరుగడంతో ఆశావాహులకు మరింత అధికారిక వెసులుబాటు కలగనుంది.

పైసలున్న వారి కోసం పార్టీల అన్వేషణ:

ఎనిన్కల వ్యయం పెరగబోనుండడంతో ఇక కాసులున్న వారి కోసం పల్లెల వారిగా ఆయా రాజకీయ పార్టీలు అన్వేషణ మొదలు పెట్టనున్నాయి. ఎరాబోయే పంచాయితి ఎన్నికలు అన్ని పార్టీలకు ప్రతిష్టాత్మకంగా కాబోతున్నాయి. ముఖ్యంఆ అధికార టీఆర్ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్‌లు పంచాయితి ఎన్నికలకు ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నాయి. పేరుకు పార్టీ రహిత ఎన్నికలు అయినప్పటికి పరోక్షంగా పార్టీల సానుభూతి పరులే రంగంలో ఉండబోతున్నారన్నది బహిరంగ రహస్యమే. అయితే ఈ పార్టీలు కూడా గ్రామాల్లో బలమైన వారి కోసం అన్వేషిస్తున్నాయంటున్నారు. ఎన్నికల వ్యయ పరిమితి పెరిగినప్పటికి ఆ వ్యయానికి నాలుగింతలు ఖర్చులు భరించే వారిని పార్టీలు వారి సీనియారిటి ప్రకారం బరిలో ఉంచేందుకు ఇప్పటి నుంచే సిద్ధమవుతున్నాయి. అంతే కాకుండా టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ధీటుగా బిజెపి, కమ్యునిస్టు పార్టీ, తెలంగాణ జన సమితి పార్టీలు కూడా ఈ సారి తమ పట్టును నిలుపుకోవాలని ప్రయత్నిస్తున్నాయి. గతానికి భిన్నంగా ఈ సారి యూత్ సర్పంచ్ పదవులపై సీరియస్‌ఘా దృష్టి సారిస్తున్నట్లు పేర్కొంటున్నారు.



నంద్యాల ఎంపీగానే పోటీ చేస్తా



ఎంపీ ఎస్పీవై రెడ్డి

కర్నూలు, సూర్య ప్రతినిధి : వచ్చే ఎన్నికల్లో నంద్యాల ఎంపీగానే పోటీ చేస్తానని ఎంపీ ఎస్పీవై రెడ్డి ప్రకటించారు. తన అల్లుడు శ్రీధర్‌రెడ్డికే నంద్యాల అసెంబ్లీ టీడీపీ టికెట్ వస్తుందని ఆయన పూర్తి ధీమాతో ఉన్నారు. సర్వేలు తమకు అనుకూలంగా ఉన్నాయని, సీఎం తమకే టికెట్లు ఇస్తారని ఎస్పీవై రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. ఎస్పీవై రెడ్డి గత ఎన్నికల్లో వైసీపీ తరవున నంద్యాల ఎంపీగా పోటీ చేసి గెలిచారు. అనంతరం ఆయన టీడీపీలో చేరారు.

రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శత్రువులు ఉండరు



అమరావతి, సూర్య బ్యూరో : ఏపీలో పొత్తులపై ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శత్రువులు ఉండరని, జగన్‌ను కూడా మిత్రుడ్ని చేసుకోవటానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ప్రజాభిప్రాయాన్ని గౌరవించ కుండా ఎంపీలను సస్పెండ్గ చేశారని మం డిపడ్డారు. చంద్రబాబు మేకై కూర్చుంటాడని మోదీకి భయమన్నారు. రాయలసీమ ముఠా నాయకుడిలా నరేంద్రమోదీ తీరు ఉందని మండిపడ్డారు. నరేంద్రమోదీ అసమర్థ ప్రధాని అని విమర్శించారు. ప్రధానిగా ఉండి అసత్యాలు మాట్లాడటానికి సిగ్గు లేదా? అని వ్యాఖ్యానించారు. ఆనాడు కాంగ్రెస్ రాష్ట్రానికి దుష్టశక్తి, నేడు బీజేపీ దేశానికే దుష్టశక్తి అని ఎంపీ జేసీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

పోలవరం ప్రాజెక్టుకు సిబిఐపి అవార్డు


• పోలవరం ప్రాజెక్టుకు దక్కడం ప్రాజెక్టు పనుల పురోగతికి నిదర్శనం • న్యూఢిల్లీలో సిబిఐపి అవార్డు కేంద్ర విద్యుత్ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర) ఆర్.కె సింగ్ చేతుల మీదుగా ప్రదానం • దేశంలోని 16 జాతీయ ప్రాజెక్టులలో శరవేగంగా నిర్మాణ పనులు జరుగుతున్న ఏకైక ప్రాజెక్ట్ • జల వనరులశాఖ మంత్రి దేవినేని

వెలగపూడి సచివాలయప్రతినిధి :దేశంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన సిబిఐపి అవార్డు పోలవరం ప్రాజెక్టుకు దక్కడం ప్రాజెక్టు పనుల వురోగతికి నిదర్శనమని జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తెలిపారు.

శుక్రవారం న్యూఢిల్లీలో సిబిఐపి అవార్డును కేంద్ర విద్యుత్ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర) ఆర్.కె సింగ్ చేతుల మీదుగా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఈఎన్‌సి వెంకటేశ్వరరావు, పోలవరం సిఈ శ్రీధర్‌లు అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన సిబిఐపి (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్) అవార్డు పోలవరం ప్రాజెక్టుకు రావడం సంతోషదాయకమన్నారు. పోలవరం ప్రాజెక్టు దేశంలోని 16 జాతీయ ప్రాజెక్టులలో శరవేగంగా నిర్మాణ పనులు జరుగుతున్న ఏకైక ప్రాజెక్ట్ అని అన్నారు. ప్రణాళిక, ఆచరణ పర్యవేక్షణలో అత్యున్నత ప్రమాణాలతో నిర్మాణమౌతున్న ప్రాజెక్టుగా పోలవరం ప్రాజెక్టుకు 2019వ సంవత్సరానికి ప్రకటించడం మరింత ప్రోత్సాహన్ని ఇస్తుందన్నారు. పోలవరం ప్రాజెక్టు తెలుగు ప్రజలకు లైఫ్‌లైన్ ప్రాజెక్టు అని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టు పనులను వేగంగా చేస్తున్నామన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి పోలవరం ప్రాజెక్టు పనులను ఒక లక్ష్య సాధనలో పూర్తిచేయడానికి సోమవారం పోలవరంగా చేసి సమీక్షిస్తున్నారన్నారు. 29 సార్లు పోలవరం డ్యామ్ ప్రాంతాన్ని సందర్శించడమే కాకుండా 84 సార్లు వర్చ్యువల్ ఇన్స్‌స్పెక్షన్ ద్వారా ముఖ్యమంత్రి ప్రాజెక్టు పనులను సమీక్షిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పోలవరం ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన 3,570 కోట్ల రూపాయలు మంజూరు చేయాల్సి ఉందన్నారు. 2019 జులై నాటికి గ్రావిటితో నీటిని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఒక లక్ష్య సాధనతో పనిచేస్తుందన్నారు.



రాష్ట్రానికి కేంద్రం ఏం చేసింది?



కంభంపాటి రామమోహన్

న్యూఢిల్లీ, సూర్య ప్రతినిధి : కేంద్రంపై టీడీపీ నేత కంభంపాటి రామ్మోహన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విభజన హామీలు అమలు చేయకుండా ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. నరేగా నిధులు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం పైనే ఆరోపణలు చేస్తున్నారని మండి పడ్డారు. రైల్వే జోన్, రాజధానికి నిధులు ఇవ్వడం లేదని ఆయన అన్నారు. సీఎం చంద్రబాబు దావోస్ పర్యటనకు కేంద్రం అడ్డుపడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి కేంద్రం ఏం చేసిందో బీజేపీ నేతలు గుండెమీద చేయివేసుకుని చెప్పాలని కంభంపాటి రామ్మోహన్‌రావు డిమాండ్ చేశారు.

ఎపి హైకోర్టుకు 7 నుండి 18 వరకు సెలవులు

విజయవాడ, సూర్య బ్యూరో : ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు జనవరి 7వ తేది నుంచి 18వ తేది వరకు సంక్రాంతి సెలవు ప్రకటించడం జరిగిందని రిజిస్ట్రార్ జనరల్ మానవేంద్రనాథ్‌రాయ్ తెలిపారు. సంక్రాంతి సెలవుల్లో డివిజన్ బెంచ్ జడ్జిలుగా జస్టిస్ ఏ.వి శేషసాయి, జస్టిస్ ఎమ్ గంగారావు, సింగిల్ బెంచ్ జడ్జిగా జస్టిస్ ఎం. సత్యనారాయణమూర్తి వ్యవహరిస్తారన్నారు. సంక్రాంతి సెలవు రోజుల్లో కోర్టు డివిజన్ బెంచ్‌కి సంబంధించిన కోర్టు వ్యాజ్యాలను ఫైలింగ్‌ను జనవరి 9వ తేది (బుధవారం), విచారణను 11వ తేది (శుక్రవారం) చేపట్టుటకు పైన పేర్కొన్న న్యాయమూర్తులు హైకోర్టులో అందుబాటులో ఉంటారన్నారు. సంక్రాంతి సెలవు రోజుల్లో డిప్యూటి రిజిస్ట్రార్ ఎస్.వి.ఎస్.ఆర్ మూర్తి, ఆసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు వి.సీతారామరాజు, కె.జగన్మోహన్, కె.వెంకయ్యలను విధులకు నామినేట్ చేయడం జరిగిందని తెలిపారు. పై సెలవు రోజులలో పేర్కొన్న దినములలో హెబీయాస్ కార్పస్ విషయాలు, ముందస్తు బెయిల్ విషయాలు, బెయిల్ అప్లికేషన్లు(మెజిస్ట్రేట్స్, సెషన్ జడ్జస్, ఆడిషనల్ సెషన్ జడ్జస్ ద్వారా తిరస్కరించబడిన బెయిల్‌లు), ఇతర అత్యవసర వ్యాజ్యాలు, సెలవులు ముగిసే వరకు వేచి ఉండలేని వ్యాజ్యాలు (ఎవిక్షన్, డిస్‌పొసెస్షన్,డిమోలేషన్ తదితరాలు) ప్రత్యేకంగా సీనియర్ వెకేషన్ జడ్జి అనుమతించినవి, అత్యవసర పరిస్థితులకు సంబంధించిన ధరఖాస్తులకు చెందిన వ్యాజ్యాలు ఫైలింగ్ చేసే రోజు మధ్యాహ్నం 1.15 నిమిషాలకు ముందు వచ్చినవి పరిగణనలోనికి తీసుకొనబడతాయని మానవేంద్రనాథ్‌రాయ్ పేర్కొన్నారు.

విజయవాడ వేదికగా పర్యాటక ప్రాధికార సంస్థ నిర్వహణ



• అతిథ్య రంగంలో పెట్టుబడుల అవకాశాలపై రాష్ట్ర సదస్సు • పరిశ్రమ పెద్దలు, ఔత్సాహికులకు ఎపిటిఏ ఆహ్వానం • మౌళిక సదుపాయాల కల్పనలో ప్రోత్సాహకాలపై స్పష్టత


విజయవాడ, సూర్య బ్యూరో : రాష్ట్ర అతిథ్యరంగ పెట్టుబడుల అవకాశాలపై అవగాహన కల్పించే క్రమంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక ప్రాధికార సంస్థ విజయవాడ వేదికగా రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించనుంది. ఇప్పటికే అతిథ్య రంగంలో ఉన్న అనుభవజ్ఞులతో పాటు, ఈ రంగంపట్ల ఆసక్తి ఉన్న ఔత్సాహికులకు సైతం ఉపకరించేలా ఈ సదస్సు కార్యాచరణను రూపొందించామని ఆంధ్రప్రదేశ్ పర్యాటక ప్రాధికార సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి హిమాన్షు శుక్లా తెలిపారు. నగరంలోని హరిత బెరం పార్కు వేదికగా జనవరి 10 గురువారం ఉదయం 11 గంటలకు సదస్సు జరగనుండగా, రెండు సెషన్స్‌గా కార్యక్రమాన్ని విభజించామన్నారు. తొలి సెషన్‌లో రాష్ట్ర పర్యాటక అభివద్ధి లక్ష్యంగా అతిథ్య రంగంలో పర్యాటక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక ప్రాధికార సంస్థ అందిస్తున్న సేవల గురించి వివరిస్తామని శుక్లా పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ అతిథ్య రంగంలో ఉన్న పెట్టుబడి అవకాశాలపై పూర్తి అవగాహన కలిగించేలా కార్యక్రమం ఉంటుందని, హోటల్ పరిశ్రమకు చెందిన వారందరికీ స్వాగతం పలుకుతున్నామని స్పష్టం చేసారు.

ఆంధ్రప్రదేశ్ పర్యాటక ప్రాధికార సంస్థ తొలిసారి ఈ తరహా కార్యక్రమాన్ని ఎంచుకుందని పర్యాటక శాఖకు చెందిన వివిధ స్థాయిల అధికారులు సదస్సులో అందుబాటులో ఉండి వ్యక్తిగతంగా కూడా పెట్టుబడిదారుల సందేహాలను నివ త్తి చేస్తారన్నారు. పర్యాటక శాఖపరంగా ఆంధ్రప్రదేశ్‌లో అతిథ్య రంగం అభివ ద్ధికి అందిస్తున్న ప్రోత్సాహకాల గురించి పరిశ్రమ వర్గాలకు స్పష్టత ఇవ్వనున్నామన్నారు.

రెండో సెషన్‌లో సదస్సుకు జ్ఞాన భాగస్వామిగా వ్యవహరిస్తున్న వి రిసార్ట్స్ అతిథ్య రంగంలో అందుబాటులో ఉన్న ఉత్తమ పద్ధతులపై ఈ రంగ నిపుణులు, ఔత్సాహికులకు మార్గనిర్దేశం చేయనుంది. పర్యాటకుల పాదముద్రల పరంగా ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే జాతీయ స్థాయిలో మూడో స్థానాన్ని అందివ్వచ్చుకోగా, కీలక సమయాలలో అతిథి గహాల కొరత నెలకొంటుందని దీనిని అధికమించే క్రమంలో ఈ సదస్సు కీలక భూమికను పోషిస్తుందని శుక్లా పేర్కొన్నారు.

పర్యాటక రంగం అభివ ద్ధిలో మౌలిక సదుపాయాల కల్పన ముఖ్య భూమికను పోషిస్తుండగా, ఆ దిశగా ఆంధ్రప్రదేశ్ పర్యాటక ప్రాధికార సంస్థ పనిచేస్తుందని, సదస్సుకు హాజరు కావాలనుకున్న వారు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవలసి ఉండగా, 9198736617 నెంబర్‌లో సంప్రదించవచ్చని, లింక్ ద్వారా నేరుగా నమోదు చేసుకోవచ్చని ఆంధ్రప్రదేశ్ పర్యాటక ప్రాధికార సంస్థ స్పష్టం చేసింది.

ఏపీ ప్రజలపై మోడీ కక్ష కట్టారు



ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్

అమరావతి, సూర్య బ్యూరో : సీఎం చంద్రబాబు దావోస్ పర్యటనపై ఆంక్షలు హేట్ పాలిటిక్స్‌కు నిదర్శనమని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ తీవ్రస్థాయిలో ధ్వజమె త్తారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఏపీ ప్రజలపై మోదీ కక్ష కట్టారని మండి పడ్డారు. వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ, పార్లమెంట్‌ను బాయ్‌కాట్ చేసి ఏం సాధిం చారని ప్రశ్నించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు గురించి వైసీపీ ఎందుకు మాట్లాడరని అడిగారు. జగన్‌పై దాడి కేసును పారదర్శకంగా విచారణ చేపట్టాలని ఎమ్మెల్సీ డొక్కా డిమాండ్‌చేశారు.

పార్లమెంట్ ఆవరణలో టీడీపీ ఎంపీల ఆందోళన



న్యూఢిల్లీ, సూర్య ప్రతినిధి : ఏపీకి ప్రత్యేక హోదా కోసం ఢిల్లీలో టీడీపీ ఎంపీల ఆందోళన కొనసాగుతోంది. శుక్రవారం పార్లమెంట్ ఆవరణలో టీడీపీ ఎంపీలు నిరసన చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలని వారు డిమాండ్గ చేశారు. టీడీపీ ఎంపీల ధర్నాకు యూపీ మాజీ సీఎం ములాయం సింగ్ యాదవ్ సంఘీభావం తెలిపారు. ప్రత్యేక హోదా కోరుతూ గురువారం లోక్‌సభలో వెల్ వద్ద నిరసనకు దిగిన 12 మంది టీడీపీ ఎంపీలను నాలుగు రోజుల పాటు స్పీకర్ సుమిత్రా మహాజన్ సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

పేదల ఆనందమే చంద్రన్న ధ్యేయం

• సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో ఆర్థిక వెలుగులు • ఆర్థిక ఇబ్బందుల్లోనూ సమర్థవంత పరిపాలన • ముందు చూపుతో నవ్యాంధ్ర ప్రగతికి బాటలు • కార్పొరేషన్ రుణాలతో ఆర్థిక మనోధైర్యం • కేంద్రంపై ధర్మ పోరాటం చేస్తున్న చంద్రన్నకు అండగా నిలవాలి • ప్రజా సమస్యల పరిష్కారానికే 'జన్మభూమి - మా ఊరు' • దొనకొండ, అగ్రహారం 'జన్మభూమి సభ'ల్లో రాష్ట్ర మంత్రి శిద్ధా రాఘవరావు

దర్శి, మేజర్‌న్యూస్ : భారతదేశంలో ఎక్కడా లేని విధముగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుచూపుతో ఆంధ్రప్రదేశ్‌ను అభివద్ధి చేయడానికి చర్యలు తీసుకున్నారని రాష్ట్ర అటవీశాఖ మంత్రి శిద్ధా రాఘవరావు అన్నారు. శుక్రవారం దర్శి నియోజకవర్గ పరిధిలోని దొనకొండ గ్రామ పంచాయతీ లో భూమి మాఊరు కార్యక్రమం దొనకొండ రైల్వే గ్రౌండ్సలో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర అటవీశాఖ మంత్రి శిద్ధా రాఘవరావు మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయి 16 వేల 500 కోట్ల రూపాయల ఆర్థిక లోటులో ఉన్నప్పటికీ సమర్ద్రవంతముగా అభివద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. రాష్ట్రంలో జన్మ భూమి మాఊరు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపట్టారన్నారు. రాష్ట్రంలోని గ్రామాల్లో అధికారులు పర్యటించి ప్రజా సమస్యలను పరిష్కరించడానికి జన్మ భూమి మాఊరు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో రైతులను ఆదుకోవాలని 24 వేల కోట్ల రూపాయలు రుణమాఫీ, 12 వేల కోట్ల రూపాయలతో డ్వాక్రా మహిళలకు రుణమాఫీ అమలు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఎస్.సి,ఎస్.టి,బి.సి,కావు, మైనార్టీ, బ్రహ్మణ,వైశ్య కార్పొరేషన్స్ ఏర్పాటు చేసి సబ్సీడీ రుణాలు, వడ్డీ లేని రుణాలను లబ్ధిదారులకు అందించడము జరుగుతుందన్నారు.రాష్ట్రంలో ఇతరుల తో సమానంగా ఎస్.సిలు వ్యాపార లావాదేవీలు నిర్వహించడానికి 110 రకాలను ప్రభుత్వం ప్రోత్సాహిస్తుందని అయన అన్నారు. రాష్ట్రంలో ఎస్.సిలకు కేటాయించిన నిధులను గత ప్రభుత్వాలు పక్కదారి మళ్లించారన్నారు. తమ ప్రభుత్వం ఎస్.సిలకు కేటాయించిన నిధులను ఎస్.సి ల సంక్షేమం కోసం ఖర్చు చేసినట్లుగా ఆయన చెప్పారు. రాష్ట్రంలో త్రాగునీరు, సాగునీరు ఇబ్బందులు రాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నదుల అనుసంధానం చేపట్టారన్నారు. గోదావరి నదిని పట్టిసీమ ద్వారా క ష్ణానదికి అనుసంధానం చేశారన్నారు. కష్ణానదిని పెన్నానదికి అనుసంధానం చేయడానికి ముఖ్యమంత్రి నకిరేకల్ వద్ద శంఖుస్థాపన చేశారన్నారు. దీని వల్ల రాబోయే రోజుల్లో ప్రకాశము జిల్లాకు త్రాగునీరు, సాగునీరు కొరత ఉండదని ఆయన చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. జాతీయ ప్రాజెక్టులను పూర్తి చేయవసిన భాద్యత కేంద్ర ప్రభుత్వందని అయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును, నర్మదా ప్రాజెక్టు నిర్మాణములో నిర్లక్ష్యం చేయడం జరిగిందని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం విభజన సమయంలో ఇచ్చిన 19 హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసము చేసిందని ఆయన అన్నారు. ప్రజకు జరిగిన అన్యాయం పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధర్మపోరాట దీక్ష చేస్తున్నారని ఆయన అన్నారు. దర్శి నియోజకవర్గాన్ని అభివద్ధి చేయడానికి కంకణం కట్టుకున్నామన్నారు. దర్శి నియోజకవర్గము వెనుకబడిన ప్రాంతమని గడచిన నాలుగున్నర సంవత్సరాల్లో 3 వేల కోట్ల రూపాయల తో అభివద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. దర్శిలో అంతర్జాతీయ డ్రైవింగ్ స్కూలును, ఫైర్ స్టేషన్, పార్క్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు. దొనకొండ ను ప్రపంచ పటంలో నిలిచేవిధముగా చర్యలు తీసుకున్నామని ఆయన అన్నారు. దొనకొండలో త్వరలో 1000 కోట్ల రూపాయలతో 280 మధ్య, చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. దొనకొండ లో చైనా కంపెనీ ఫ్రీ ఫ్యాబ్రికేటెడ్గ పరిశ్రమను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. దొనకొండ పంచాయతీలో 189 కోట్ల రూపాయల తో అభివద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. దొనకొండ గ్రామాల్లో సిమెంటు రోడ్డులు నిర్మాణం కోసం 5 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు ప్రభత్వాని పంపడము జరిగిందన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర అటవీశాఖ మంత్రి శిద్ధా రాఘవరావు 25 మంది పాస్టర్స్‌కు ఇంటి నివేశ పట్టాలు పంపిణీ చేశారు. దొనకొండ మండల మహిళ సమాఖ్య సంఘానికి2 కోట్ల రూపాయల బ్యాంక్ లింకేజీ చెక్కును, రైతు ఉత్పత్తి దార్ల సంఘంకు 31 లక్షల రూపాయల రివాల్వింగ్ ఫండ్గ చెక్కును మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలకు సంక్రాంతి కానుకలను పంపిణీ చేశారు. అనంతరం దొనకొండలో ఎన్. టి.ఆర్ గహ నిర్మాణం క్రింద నిర్మించిన గహన్ని మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దొనకొండ ఎంపీపీ నాగులపాటి గాలేమ్మ, దొనకొండ తెలుగుదేశం పార్టీ నాయకులు నాగులపాటి శివకోటేశ్వర రావు, మోడీ వెంకటేశ్వర్లు, మైనార్టీస్ నాయకులు మగుబ్బల్, దర్శి నియోజకవర్గ ప్రత్యేక అధికారి బి.రవి, దొనకొండ మండల ప్రత్యేక అధికారి మహబాబ్ భాష,ఎంపీడీఓ రాజేంద్ర, తహసిల్దార్ వెంకటేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.






కార్మికుల పిల్లల ఉపకార వేతనాలకు దరఖాస్తులు ఆహ్వానం

విజయవాడ, సూర్య బ్యూరో : వాణిజ్య సంస్థలు, కర్మాగారాలు, దుకాణాలు, మోటారు రవాణా, ధార్మిక సంస్థలు, ట్రస్ట్‌లలో పనిచేస్తున్న కార్మికులు గాని, వారి పిల్లలు గాని 201718 సంవత్సరాలలో పలుకోర్సులలో ఉత్తీర్ణులైన వారు ఉపకార వేతనాల కొరకు ధరఖాస్తు చేసుకోవాలని కార్మిక సంక్షేమ మండలి కమిషనర్ ఎ.రాణి ఒక ప్రకటనలో తెలిపారు. పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, మెడిసన్, లా, బి.యస్సీలో, వెటర్నరీ, నర్సింగ్, హార్టికల్చర్, బిసి.ఎ, ఎంసి.ఎ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, బిబిఎ, డిప్లొమో, పిజి డిప్లొమో, ఇన్‌ల్యాబ్ టెక్నాలజీ కోర్సులు 201718లో ఉత్తీర్ణులైన వారు ఉపకార వేతనాల కోసం ధరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ధరఖాస్తుదారులలో ప్రతిభ, మార్కుల ఆధారంగా ఉపకార వేతనాలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ధరఖాస్తు ఫారాలను సహాయ కార్మిక కమిషనర్ వారి కార్యాలయం నుండి పొంది 15022019 లోగా సంబంధిత కార్మిక శాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు. గడువు తరువాత అందిన ధరఖాస్తులు తిరస్కరించబడతాయని తెలిపారు. కార్మిక సంక్షేమంలో భాగంగా ఎంపికైన అభ్యర్థులకు 10 వేలు ఉపకారవేతనంగా వారి ఖాతాలో మేడే నాటికి జమచేస్తామని కమిషనర్ రాణి ఆ ప్రకటనలో తెలిపారు.

ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు కృషి

- ఆదాయం పెంచడానికి అనేక కార్పొరేషన్లు ఏర్పాటు చేశాం
- కాకినాడ పోర్టును కమర్షియల్ పోర్టుగా తయారుచేస్తున్నాం
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

జగ్గంపేట, సూర్య ప్రతినిధి : ఆర్థిక అసమానతలు తగ్గించే వ్యవస్థ కోసం, ఆదాయం పెంచడం కోసం అనేక కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి చంద్ర బాబు తెలిపారు. శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా జగ్గం పేటలో జన్మభూమి-మనవూరు కార్యక్రమంలో పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావుల కోసం కావు కార్పొరేషన్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, వైశ్యుల కోసం కా ర్పొరేషన్లు ఏర్పాటు చేశామన్నారు. వాటికి నిధులు కేటా యించి ప్రతిఒక్క వర్గాన్ని ఆర్థికంగా పైకి తీసుకురావడం కోసం ముందుకువెళుతున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. కాకినాడ పోర్టును కమర్షియల్ పోర్టుగా తయారు చేస్తున్నామని చంద్రబాబు చెప్పారు. ఇందుకోసం రూ. 2,300 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టువల్ల ఇప్పటికే 2వేల మంది యువతకు ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. భవిష్యత్తులో కొన్ని లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు వస్తాయని సీఎం అన్నారు. ఆర్లి యా పెట్రో కెమికల్ కారిడార్ కోసం ముందుకు వచ్చారని, అది పూర్తయితే 5వేల ఉద్యోగాలు ప్రత్యక్షంగా వస్తాయని, లక్ష ఉద్యోగాలు పరోక్షంగా వస్తాయన్నారు. అలాంటి మంచి ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టామని చంద్రబాబు చెప్పారు.




ప్రజాసంక్షేమానికే జీవితం అంకితం

- రాజీ లేని పోరుతో కేంద్రంతో ఢీ
- కోడికత్తి రాజకీయాలకు తలొగ్గొద్దు
- అవినీతి రహితంగా రాష్ట్ర పాలన
- వినూత్న కార్యక్రమంగా జన్మభూమి
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



మేజర్‌న్యూస్, కాకినాడ : కాకినాడ సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు అన్న తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ అభిభాషణతో తెలుగు దేశం పార్టీ రాష్ట్రంలో ప్రజాబలమే కొండంత అండగా పరిపాలనను సాగిస్తుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు పేర్కొన్నారు. తన జీవితం ప్రజా సంక్షేమానికి అంకితమన్నారు. విసూత్న కార్య క్రమంగా జన్మభూమిమాఊరును తీర్చి దిద్దుతూ ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కరించే విధంగా అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. తూర్పుగోదావరి జిల్లా పర్య టనలో భాగంగా కాకినాడ జెఎన్‌టియుకె మైదానంలో 6వ విడత జన్మభూమి కార్యక్రమాన్ని ఆయన ప్రారం భించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ అభివృద్ధి సంక్షేమ ప్రదర్శనశాలలను సందర్శించారు. ఎన్నో ఒడిదు దుకులతో, విభజన కష్టనష్టాలతో ప్రారంభమైన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పాలన నాలుగేళ్ళ అనంతరం స్వయం సమృ ద్ధి దిశగా మనకు మనమే అభివృద్ధి బాటలు వేసుకొంటూ ముందకు సాగుతున్నా మన్నారు. ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసే విధంగా అణచివేత చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. అయినప్పటికీ ఇంటింటి ఆనందమే ప్రధాన లక్ష్యంగా జన్మభూమి కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం సంక్షేమంలో ప్రధమ స్థానంలో ఉందన్నారు. తక్కువ అవినీతి ఉన్న రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ 3వ స్థానంలో ఉందన్నారు. భవిష్యత్‌లో ప్రతీ ఇంటికీ స్మార్ట్‌ఫోన్ పంపిణీ చేస్తామన్నారు. తద్వారా ఇంటి నుంచే ప్రభుత్వ సేవలన్నిటినీ పొందేవిధంగా ప్రజలను తీర్చిదిద్దుతామన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా పర్యాటకంగా, సాంకేతికంగా తూర్పుగోదా వరిని మార్పు చేస్తామన్నారు. ఎడిబి రోడ్డు నిర్మాణం పూర్తి కావడం, కోస్టల్ కారిడార్, సెజ్‌ల ఏర్పాటుతో రవాణా తోపాటు నిరుద్యోగ నిర్మూలన జరుగుతుందన్నారు. జన్మభూమిలో వచ్చే దరఖాస్తులకు రెండురోజుల్లోనే పరిష్కారం చూపుతానన్నారు. గతంలో కంటే 6వ విడత జన్మభూమికి ప్రజాస్పందన బాగా పెరిగిందన్నారు. సంక్రాంతికంటే ముందు వచ్చే అతి పెద్ద పండుగగా జన్మభూమిని జరుపుకొంటున్నామన్నారు. బాలలకు, బాలింతలకు, చూలింతలకు పోషకాహారాన్ని అందిం చడంలో రాష్ట్ర ముందుందన్నారు. కాకినాడను స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తూనే పేదరికంపై గెలువును సాధిస్తు న్నామన్నారు. అంతకు ముందు వివిధ లబ్ధిదారులతో సీఎం ముచ్చటించారు. ఈ సందర్భంగా స్వయంఉపాధి, పారిశ్రామిక ఉపాధి, గృహస్త ఉపాధి వంటి అంశాలను ప్రస్తావిస్తూ ఇంటినుంచే కనీసం రూ.10వేలు సంపాదించుకొనే విధంగా లబ్ధిదారులను తీర్చిదిద్దు తున్నందుకు అధికారులను, లబ్ధిని సద్వినియోగం చేసుకున్నందుకు లబ్ధిదారులను అభినందించారు. పిఆర్ కళాశాల విద్యార్థిని మౌనిక మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను వివరిస్తూ తాను లబ్ధి పొందిన విషయాన్ని తెలిపారు. తాను ఐఎఎస్ కావాలన్న కోరికను ప్రకటించడంతో చంద్రబాబు ప్రసంశించారు. మైనార్టీ రుణాన్ని పొందిన షేక్ నూర్జహన్ మాట్లాడుతూ తన భర్తకు ధీటుగా తాను వస్త్ర వ్యాపారంలో సంపాదిస్తూ కుటుంబాన్ని పోషించు కోవడానికి మైనార్టీ రుణం దోహదపడిందన్నారు. మరో రుణగ్రహీత ఎం జాషువా మాట్లాడుతూ తాను మ్యూజి కల్ సిస్టం ద్వారా ప్రభుత్వ రుణాన్ని సద్వినియోగం చేసు కొంటున్నానన్నారు. కిరాణా షాపుతో ఎ.పద్మ, ఆదరణ కుట్టు మిషన్‌తో సిహెచ్.రమాదేవి, ఫోటోగ్రఫీతో సుధా కర్, ఇన్నోవా వాహనంతో ప్రసాదు, మడకం శ్రీనివాస దొర తదితరులు లబ్ధి పొందినట్లు చెప్పారు. జిల్లా పంచాయితీ అధికారి ఆనంద్ మాట్లాడుతూ మెగా పెట్రో ప్రాజెక్టుతో యువతకు ఉద్యోగ అవకావాలు పెరుగుతా యన్నారు. ఆర్డీవో రాజకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా, కాకినాడ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, రూ రల్ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, జిల్లా ఎస్పీ విశాల్ గున్ని, మేయర్ సుంకర పావని, ప్రభుత్వ గృహనిర్మాణశాఖ డైరెక్టర్ కాంతి లాల్, బిసి వెల్ఫేర్ ఎండి ఉదయ లక్ష్మి, పలు వురు ఛీఫ్ సెక్రరీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, జిల్లాపరిషత్ ఛైర్మన్ జ్యోతుల నవీన్, శాసనసభ డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఏపీని దెబ్బతీయాలని కేంద్రం మరో కుట్ర



ఏపీని దెబ్బతీయాలని కేంద్రం మరో కుట్రలోకేశ్
అమరావతి, సూర్య బ్యూరో : ఆంధ్రా మోదీని కాపాడేందుకు దిల్లీ మోదీ సీబీఐని బీజేపీ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌గా మార్చేశారని ఏపీ మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. ప్రజాధనాన్ని నిలువునా దోచుకున్న వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు కేసుల నుంచి విముక్తి కల్పించి ఏపీని దెబ్బతీయాలని కేంద్ర ప్రభుత్వం మరో కుట్రకు తెరలేపిందని మండిపడ్డారు. బీజేపీ భారతీయ జోకర్స్ పార్టీగా మారిందని, ఆంధ్రప్రదేశ్‌కు నీరు, మట్టి ఇచ్చి చేతులు దులుపుకొన్న ప్రధాని నరేంద్ర మోదీ ఇంటి ముందు ధర్నా చేసే దమ్మూ, ధైర్యం లేని ఏపీ బీజేపీనేతలు ఈ రోజు సీఎం చంద్రబాబు కాన్వాయ్‌ను అడ్డుకొనేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీను ప్రజలు మట్టిలో కలిపేసే రోజులు దగ్గర పడ్డాయని లోకేశ్ ఈ సందర్భంగా ట్విటర్‌లో పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన రాష్ట్రాలకు ఉపాధి హామీ పథకం ద్వారా అధిక నిధులు రావడం చట్టం ద్వారా వచ్చిన హక్కు అని, ఇందులో బీజేపీ భిక్ష ఏమీ లేదని, చంద్రబాబు కష్టమే ఉందన్నారు. ఉపాధి హామీలో ఎక్కువ నిధులు కేటాయించామని అర్థంలేని చర్చలు చేస్తున్న ఏపీ బీజేపీ నేతలు ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలు ఉపాధి హామీ పథకంలో ఎందుకు వెనుకబడి ఉన్నాయో చెప్పగలరా? అని ప్రశ్నించారు.

బాబు మళ్లీ రావాలి: స్పీకర్ కోడెల



విజయవాడ, సూర్య బ్యూరో : ఆర్థిక ఇబ్బందులున్నా అనుభవజ్ఞుడైన నాయకుడు ఉండడం తమ అదష్టమని స్పీకర్ కోడెల శివప్రసాద్ అన్నారు. శుక్రవారం విజయవాడలో క్రెడాయ్ ప్రాపర్టీషోను స్పీకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంద రోజుల్లో ఎన్నికలు రాబోతున్నాయని, సరైన నాయకుడిని ఎన్నుకోవాలని కోరారు. చంద్రబాబు లాంటి విజన్ ఉన్న నాయకుడు మళ్ళీ రావాలని స్పీకర్ ఆకాంక్షించారు. ఏపీకి వ్యాపార రాజధాని విజయవాడ అని పేర్కొన్నారు. చుక్క భూముల సమస్య పరిష్కరిస్తామన్నారు. బిల్డర్లకు ప్రభుత్వం వెన్నుదన్నుగా ఉంటుందని, బ్యాంకర్లు రుణాల విషయంలో పారదర్శకంగా ఉండాలని స్పీకర్ కోడెల తెలిపారు. క్రెడాయ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.శివారెడ్డి, విజయవాడ చాప్టర్ అధ్యక్షుడు వై.వి.రమణరావులు మాట్లాడుతూ క్రెడాయ్ సంస్థకు సంబంధించి ఏపీలో 20 చాప్టర్‌లు ఉన్నాయని, వెయ్యి మంది సభ్యులతో వేగంగా అభివద్ధి చెందుతోందన్నారు. అత్యాధునిక నాణ్యతాప్రమాణాలు పాటిస్తూ మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు భద్రతతో కూడిన విధంగా నిర్మాణ రంగంలో క్రెడాయ్ సంస్థ ప్రజల ఆదరాభిమానాలు చూరగొంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోండా ఉమా, క్రెడాయ్ సంస్థ ప్రతినిధులు సీహెచ్ సుధాకర్, కె.రాజేంద్ర, సి.సతీష్‌బాబు, జి.ఎస్.ఆర్.మోహన్‌రావు, కె.వి.వి.రవికుమార్, జె.కిరణ్‌కుమార్, డి.రాంబాబు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంక్షేమ సంస్థను ఏర్పాటు చేసిన ఘనత టీడీపీదే

- చాణక్య స్వయం ఉపాధి పథకం కింద కార్లను పంపిణీ
- 30 మందికి మారుతి డిజైర్ టూర్ వాహనాలు
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు



(అమరావతి సూర్య ప్రధాన ప్రతినిధి) :బ్రాహ్మణులలో పేదల అభ్యున్నతే లక్ష్యంగా ప్రప్రథమంగా బ్రాహ్మణ సంక్షేమ సంస్థను ఏర్పాటు చేసిన ఘనత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానిదేనని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. బ్రాహ్మణ యువత ప్రజా రవాణా రంగంలో ఉపాధి పొందడానికి వీలుగా సుమారు రూ 60 లక్షల సబ్సిడీతో 30 మందికి మారుతి డిజైర్ టూర్ వాహనాలను శుక్రవారం ఉండవల్లి నివాసం వద్ద ముఖ్యమంత్రి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గతంలో ఎంతో వైభవం కలిగిన బ్రాహ్మణులలో పేదలను గుర్తించి వారి అభ్యున్నతికి దేశంలో ఎక్కడ లేని విధంగా, యువ డ్రైవర్లను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి చాణక్య స్వయం ఉపాధి పథకం కింద కార్లను పంపిణీ చేస్తున్నామన్నారు. గతంలో బ్రాహ్మణులు సంపన్నులని, విజ్ఞాన సముపార్జనలో ముందుండేవారని, అయితే కాలక్రమంలో ఎక్కువ మంది పౌరహిత్యం పై ఆధారపడటం, దానిపై సరైన ఆదాయము లేక ఆర్థికంగా వెనుకపడ్డారు. అందుకోసమే బ్రాహ్మణులలో పేదలను గుర్తించి వారి అభ్యున్నతి బ్రాహ్మణ సంక్షేమ సంస్థ ఏర్పాటు చేయడం జరిగింది. విద్య, నైపుణ్య శిక్షణ, పారిశ్రామిక శిక్షణ, విదేశీవిద్య, సాంస తిక పరంగా అనేక పథకాలు వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1.50 లక్షల పేద బ్రాహ్మణులకు రూ. 202 కోట్లతో వివిధ పథకాల ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. విద్యా రంగ అభివ ద్ధికి రూ. 137.2 కోట్లు ఖర్చు చేయడంతో పాటు, 211 మంది విద్యార్థులకు విదేశి విద్య కొరకు సహకారం అందించాం. 1453 మందికి 21.12 కోట్లతో పరిశ్రమల ఏర్పాటుకు సహకారం అందించాం. రూ. 41.34 కోట్లతో 47,665 మందికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడం జరిగిందని ముఖ్యమంత్రి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కో ఆపరేటివ్ సొసైటీ చట్టం 1964 ద్వారా ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఏర్పాటు చేసి రూ 23 కోట్లతో 10,000 మంది బ్రాహ్మణులకు వివిధ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడం జరిగిందని ముఖ్యమంత్రి తెలిపారు. పేద బ్రాహ్మణులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగపర్చుకొని ఆర్థికంగా పైకి రావాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మన్మోహన్ సింగ్, బ్రాహ్మణ కార్పొరేషన్ ఎండీ డా. ఎం పద్మ, చైర్మన్ వేమూరి ఆనంద సూర్య, సీఎం ఎం అదనపు కార్యదర్శి గిరిజ శంకర్ ఎంఎల్ సీ టీ డీ జనార్దన్, ఎల్వీఎస్ ఆర్కే ప్రసాద్, బ్రాహ్మణ సంక్షేమ సంస్థ సభ్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ ద్వారా భారీగా ఉద్యోగాలు భర్తీ

- ఈ నెలలో మరో 14 నోటిఫికేషన్స్
- గడువు చివరి వరకు ఆగకుండా దరఖాస్తు చేసుకోవాలి
- ఏపీపీఎస్సీ చైర్మన్ పి. ఉదయ్ భాస్కర్



వెలగపూడి సచివాలయప్రతినిధి :ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ద్వారా ఇప్పటి వరకు 21 నోటిఫికేషన్స్ విడుదల చేయటం జరిగిందని జనవరి నెలాఖరు లోవు మరో 14 నోటిఫికేషన్స్ విడుదల చేయనున్నట్లు ఏపీపీఎస్సీ చైర్మన్ పిన్నమనేని ఉదయ్ భాస్కర్ అన్నారు.

శుక్రవారం నగరంలోని బందరు రోడ్డు లోని ఏపీపీఎస్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఏపీపీఎస్సీ కమీషన్ చైర్మన్ పిన్నమనేని ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం ఇప్పటికే ఏపీపీఎస్సీ నుంచి డిసెంబర్ 31 నాటికి 21 నోటిఫికేషన్స్ ద్వారా 3,255 పోస్టులకు భర్తీ చేయటానికి నోటిఫికేషన్స్ ను విడుదల చేయటం జరిగిందని జనవరి నెలాఖరు లోవు మరో 14 నోటిఫికేషన్స్ ద్వారా 1500 పోస్టులకు పైగా భర్తీ చేయటానికి నోటిఫికేషన్స్‌ను విడుదల చేస్తామన్నారు. ఈ పోస్టులకు సంబంధించి ఆర్డర్స్, సర్వీస్ రూల్స్, పోస్టుల ఖాళీలు, క్వాలిఫికేషన్స్ ప్రభత్వం నుంచి రావాల్సి ఉందన్నారు. ఏఈఈ పోస్టులకు ధరఖాస్తు గడువు ముగిసిందని వీటికి 47,001 మంది అభ్యర్థులు దరఖాస్తు చేస్తుకున్నారని, ఎఫ్‌ఆర్‌వో పోస్టులకు ధరఖాస్తు గడువు ముగిసిందని వీటికి 16,130 మంది దరఖాస్తుచేసుకున్నారని, ఏఎమ్‌వీఐ పోస్టులకు ధరఖాస్తు గడువు ముగిసిందని వీటికి 5,411 మంది దరఖాస్తు చేసుకున్నారని, హార్టికల్చర్ అధికారుల పోస్టులకు చివరి తేదీ ముగిసిందని వీటకి 1,307 మంది ధరఖాస్తు చేసుకున్నారన్నారు. పంచాయతీ సెక్రటరీ పోస్టులకు గత నెల 27 వ తేదీ నుండి దరఖాస్తులు తీసుకుంటున్నామని ఇప్పటి వరకు 56,621 మంది ధరఖాస్తు చేసుకున్నారని ఇంకా జనవరి 19 వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఓటీపీఆర్ కోసం అప్లై చేసుకునే వారు చివరి తేదీ వరకు ఆగి చివరి తేదీన దరఖాస్తు కు ప్రయత్నం చేయడంతో సర్వర్ లో అనేక ఇబ్బందులు వస్తున్నాయన్నారు. అబ్యర్థులు గడువు చివరి వరకు ఆగకుండా ముందే దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నానన్నారు.ఒటిపిఆర్ లో తలెత్తే ఇబ్బందుల కోసం కమీషన్ హెల్ప్‌లైన్ నెంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. అదే విధంగా అప్లికేషన్ ధరఖాస్తు చేసుకునే ఇబ్బందులను పరిష్కరించేందుకు రెండు హెల్ప్‌లైన్ నెంబర్లను కూడా ఏర్పాటు చేశామని, వాకి ఫోన్ చేసి అభ్యర్థులు వివరాలు తెలుసుకోవచ్చున్నారు. ఎక్కువ మంది అభ్యర్థులు తమ మొబైల్ నెంబర్లను మార్చడం వల్ల ఒటిపిఆర్ పంపటం కష్టంగా ఉందన్నారు. మెయిల్ ఐడి, మొబైల్ నెంబర్ ఉంటేనే ఒటిపిఆర్ ను కమీషన్ పంపగలుగుతుందన్నారు. 2016 లో 34 నోటిఫికేషన్లు విడుదల చేసి ఏ విధమైన కోర్టు వివాదాలు లేకుండా భర్తీ చేయగలిగామన్నారు. అప్పటి నోటిఫికేషన్‌లలో అభ్యర్థులను 1:50 ద్వారా అభ్యర్థులను స్క్రీనింగ్ టెస్ట్ నుంచి మెయిన్‌కి తీసుకున్నామన్నారు. ఈసారి అలా కాకుండా ఒక కటాఫ్ మార్క్ పెట్టి దాని ఆధారంగా ప్రిలిమినరీ పరీక్ష నుంచి మెయిన్స్ పరీక్షకు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రిలిమినరీ పరీక్షలో జనరల్ కటాఫ్ మార్క్ పెట్టుకుని మెయిన్ పరీక్షకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నామన్నారు. ఒకవేళ ఆయా వర్గాల వారు ఈ కటాఫ్‌లో లేని పక్షంలో అవసరానికి అనుగుణంగా ఆయా క్యాటగిరీల నుంచి కటాఫ్ మార్కు తగ్గించటం జరుగుతుందన్నారు. నిరుద్యోగులందరకీ సమన్యాయం జరిగేవిధంగా కమిషన్ పనిచేస్తుందన్నారు. అన్ని పరీక్షలను ప్రకటించిన తేదీలలో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.గ్రూప్21999 నోటిఫికేషన్‌కు సంబంధించి సుప్రీం కోర్టు వేసిన సబ్‌కమిటీ తన నివేదికను సుప్రీం కోర్టుకి తెలియజేసిందని దానికి సంబంధించి ఏ విధమైన ఆదేశాలు సుప్రీంకోర్టు నుంచి కమిషన్ కార్యా లయానికి అందలేదన్నారు. ఒటిపిఆర్ హెల్ప్‌లైన్ నెంబర్ 08662527819, రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి సందేహాలకు 08662527820, 08662527821 నెంబర్లకు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చు న్నారు .పాత్రికేయుల సమావేశంలో ఏపీపీఎస్సీ సభ్యులు ఎస్.రూప, జి.రంగజనార్ధన్, విజయ్ కుమార్, జి.సుజాత, పద్మరాజు మరియు కమిషన్ సెక్రటరీ ఎ.కె.మౌర్య పాల్గొన్నారు.

యూరప్ ఖండంలో అందాల పోటీలకు 5ఏళ్ళ చిన్నారి ఎంపిక



విజయవాడ, సూర్య బ్యూరో : విజయవాడకు చెందిన 5ఏళ్ళ చిన్నారి అంతర్జాతీయ అందాల పోటీకి ఎంపికై ఆంధ్రప్రదేశ్ ఖ్యాతిని ఇనుమడింప చేసింది. చిన్ననాటి నుండి బ్యూటీ కాం టెస్ట్‌పై మక్కువ పెంచుకున్న చిరంజీవి పాటిబండ్ల యామిని ఈనెల 8 నుండి యూరప్ ఖండంలోని జార్జియా దేశంలో జరగనున్న "వరల్డ్ రైజింగ్ స్టార్స్ 2019" అంతర్జాతీయ అందాల పోటీలకు జూనియర్ విభాగంలో ఎంపికైయిందని యామిని తల్లి దండ్రులు పాటిబండ్ల జాహ్నవి, వెంకట్‌లు తెలిపారు. విజయవాడలో 1వ తరగతి చదువుతున్న యామిని ఈ క్రమంలోనే "లిటిల్ ప్రిన్సెస్" టైటిల్‌ను కైవశం చేసుకుందని, యామిని పలు ఫ్యాషన్ సంస్థలకు "బ్రాండ్ అంబాసిడర్"గా వ్యవహరిస్తుందన్నారు. ఆన్‌లైన్ ఎంపిక ద్వారా ఈ పో టీలకు ఎంపిక అయిందని, పోటీల్లో 6 రౌండ్లు ఉంటాయన్నారు. జ్యూరీ ఇంట ర్వ్యూ, క్లాసికల్ ఫ్యాషన్ షో, నేషనల్ కాస్ట్యూమ్స్ షో, ఇవినింగ్ ఆఫ్ ఫ్రెండ్గషిప్, టాలెంట్ షో అనంతరం 13వ తేదీన గ్రాండ్గ ఫినాలే జరుగు తుందని తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం ఈ పోటీలు జరుగు తున్నాయని, ఈఏడాది మూడోవ సీజన్ పోటీలలో భారతదేశం నుండి ఈ విభాగంలో మొట్టమొదటిసారిగా ఎంపికైన చిన్నారి యామని అని తెలిపారు. ఈ పోటీలలో 40కు పైగా దేశాల నుండి చిన్నారులు పాల్గొంటారని తెలిపారు.

తీరప్రాంత పటిష్ట రక్షణలో సమన్వయంతో పనిచేయాలి

ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠ

అమరావతి, సూర్యప్రధానప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తీరప్రాంత పటిష్ట రక్షణ విషయంలో తూర్పు నావికాదళంతో పాటు ఇండియన్ కోస్టుగార్డు,మైరన్ పోలీస్,రేవులు,మత్స్య తదితర శాఖలు,ఏజెన్సీలు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర వునేఠ సూచించారు.శుక్రవారం అమరావతి సచివాలయంలోని ఆయన కార్యాలయంలో కోస్టల్ సెక్యూరిటీకి సంబంధించి విశాఖపట్నం తూర్పు నావికాదళం నేతృాఎత్వంలో 4వ రాష్ట్రస్థాయి అపెక్స్ కమిటీ సమావేశం సిఎస్ అధ్యక్షతన జరిగింది.ఈసందర్భంగా సిఎస్ మాట్లాడుతూ తీరప్రాంత రక్షణకు సంబంధించి వివిధ శాఖలు,ఏజెన్సీలు పరస్పర సహకారం,సమన్వయంతో పనిచేయడం ద్వారా తీరప్రాంత రక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించి ఏర్పాటు చేసిన అపెక్స్ కమిటీ సమావేశం గత మూడేళ్ల క్రితం జరిగిందని ఈసమావేశం తరచు జరిగితే మంచి ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుందని కావున ఇకమీదట ఈసమావేశం మూడు నెలలకు ఒకసారి జరిగేలా ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఈసమావేశంలో చర్చించిన వివిధ అంశాలపై సంబందిత శాఖలు తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై హోంశాఖ ముఖ్యకార్యదర్శి నేతృాఎత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నామని ఆకమిటీ ఆయా అంశాలను చర్చించి సకాలంలో చర్యలు తీసుకోవాలని సిఎస్ ఆదేశించారు.ఇందుకు సంబంధించి సంబంధిత శాఖల అధికారులకు వెంటనే లేఖ వ్రాయాలని ఆయన హోంశాఖ ముఖ్యకార్యదర్శిని ఆదేశించారు.

అదేవిధంగా కోస్టల్ సెక్యూరిటీకి సంబంధించి ముఖ్యంగా మత్స్యకారుల బోటుల రిజిస్ట్రేషన్,ఆయా బోటులకు కలర్ కోడింగ్,మత్స్యకారులకు బయోమెట్రిక్ గుర్తింపు కార్డులు జారీ తదితర అంశాలకు సంబంధించి తీరప్రాంత రాష్ట్రాల్లో అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను పరిశీలించి మన రాష్ట్రంలో కూడా అమలు చేసేందుకు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ కమీషనర్ రామశంకర్ నాయక్ ను సిఎస్ ఆదేశించారు.ఈసమావేశంలో చర్చించిన వివిధ అంశాలపై తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై వారం పది రోజుల్లోగా వివిధ అధికారులతో మరో సమావేశాన్ని ఏర్పాటు చేసి సమీక్షించడం జరుగుతుందని అన్నారు. వివిధ శాఖలు, ఏజన్సీలు అన్ని విధాలా పరిస్పర సహకారం, సమన్వయంతో పనిచేసి




తీరప్రాంత రక్షణ విషయంలో పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర వునేఠ సూచించారు.

యువ పారిశ్రామికవేత్తలకు అపార అవకాశాలు



విజయవాడ, సూర్య బ్యూరో : ప్రతి ఒక్కరూ కొత్తదనంతో ఆలోచించి నూతన ఆవిష్కరణలు సృష్టించాలని జాయింట్ కలెక్టర్ 2 పి.బాబూరావు అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ గ్లోకల్ టెక్నాలజీ సొల్యూ షన్స్, అమరావతి బోటింగ్ క్లబ్ సంయుక్తంగా 'ఎంటర్ ప్రెన్యూర్ షిప్ అండ్ స్టార్టప్' అనే అంశంపై యువ పారిశ్రామికవత్తేలతో సదస్సు వుస్తక ప్రదర్శన ప్రాంగణంలో జరిగింది. అమరావతి బోటింగ్ చైర్మన్ తరుణ్ కాకాని అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమాన్ని తొలుత జాయింట్ కలెక్టర్ జ్యోతి ప్ర జ్వలన చేసి ప్రారం భించారు. అనంతరం బాబురావు మాట్లాడుతూ నేడు ఎన్నో అవకాశాలు ఉన్నా యని, అయితే సరైన నాలెడ్జి లేక ఎక్కువ మంది ఉద్యోగ అవకాశాలు పొంద లేకపోతున్నారన్నారు. మన దేశంలో అవకాశాలు ఎన్నో ఉన్నాయని, అయితే యువత డిగ్రీతో పాటు పూర్తిస్థాయి విజ్ఞానం పెం పొందించు కోవాలన్నారు. సృజనాత్మకతతో పాటు, కొత్తదనంతో ఆలోచించి నూతన ఆవిష క్కరణలు చేయాలని అవుడే వ్యాపార, పారిశ్రామిక రంగాలలో రాణించగలరని అన్నారు. ఇండో యూరో సింగ్ సిఇవో వెంకట్ రాజ్ యువ పారిశ్రామికవేత్తలు ఎలా రాణించాలో తెలియచేశారు. ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ శ్రీకాంత్ కంచర్ల మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో పరిశ్రమల స్థాపనకు తీసు కోవాల్సిన అంశాలతో పాటు నూతన ఉత్పత్తులు ఎలా ఆవిష్కరించాలో తెలి యచశారు. అలాగే అమరావతి ప్రాంతంలో పరి శ్రమలకు గల అవకా శలను వివరించారు. బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షులు విజయకుమార్, ఎన్‌టిఆర్ ట్రస్టు బాధ్యులు రామకృష్ణ, ఎపి స్కిల్ డెవలప్ మెంట్ డైరెక్టర్ బాబ్జి పలువురు ప్రముఖులు పాల్గొని ప్రసంగించారు.

కృష్ణానది తీరంలో గణపతి సచ్చిదానంద మహాయజ్ఞం




విజయవాడ, సూర్య బ్యూరో : దత్తపీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆధ్వర్యంలో శనివారం విజయవాడలో మహాయజ్ఞానికి శ్రీకారం చుట్టారు. కష్ణానది తీరం పద్మావతి ఘాట్‌లో శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ విశ్వశాంతి మహాయజ్ఞం నిర్వహించనున్నట్లు అవధూత దత్తపీఠం మైసూర్ ట్రస్టీ హెచ్ వి ప్రసాద్ తెలిపారు. లక్ష మంది భక్తులు ఈ పారాయణంలో పాల్గొంటారన్నారు. దాదావు 900 మీటర్ల పద్మావతి ఘాట్‌లో 30 వరసల్లో భక్తులు కూర్చునేలా ఏర్పాట్లు చేసినట్లు హెచ్‌వి ప్రసాద్ తెలియజేశారు.

చంద్రబాబు దావోస్ పర్యటనకు లైన్ క్లియర్



అమరావతి : ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దావోస్ పర్యటనపై కేంద్రం ఆంక్షలు విధించిన సంగతి విదితమే. ప్రతి ఏడాది 14, 15 మంది ప్రతినిధులతో దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సుకు చంద్రబాబు ఈ కారణంగా హాజరు కాలేరని అందరూ అనుకున్నారు. అయితే, ఈ వ్యవహారం జరిగిన ఐదు గంటల వ్యవధిలోనే చంద్రబాబు పర్యటనకు లైన్ క్లియర్ అయింది. చంద్రబాబుతో పాటు 17 మంది బృందం ఏడు రోజుల పాటు దావోస్ వెళ్లడానికి కేంద్రం అనుమతి ఇచ్చింది. గురువారం ముఖ్యమంత్రితో పాటు ఐదుగురికి మాత్రమే అనుమతి ఇచ్చిన కేంద్రం ఆంధ్ర ప్రదేశ్ సిఎం నిరసన వ్యక్తం చేయడంతో వైఖరి మార్చుకుని దావోస్ పర్యటనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మళ్లీ దరఖాస్తు చేయాలని ఆంధ్ర ప్రదేశ్‌కు విదేశాంగ శాఖ విజ్ఞప్తి చేసింది. దీనితో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం కోరిన విధంగా దావోస్ పర్యటనకు కేంద్రం అనుమతి ఇచ్చింది.



ఒకప్పుడు పెళ్లి అంటే 16 రోజుల పండుగ వచ్చినట్టే... అది కాస్త పెళ్లి చేసి చూడు అన్న పరిస్థితికి రావటంతో మమ అనిపించేలా తమ స్థాయికి తగ్గట్టు పెళ్లిళ్లు జరపటం ఆరంభించారు. ఇప్పుడు మళ్లీ పూర్వపు రోజుల్లా పెళ్లి తతంగం మారిపోతోంది. నిశ్చితార్థం దగ్గర నుంచి, మనకు కొత్త కొత్తగా సోకుతున్న సంగీత్, మెహెందీ, బ్యాచిలర్ పార్టీ, వధువు అలంకరణ, వరుడికి ఆహ్వానం, బరాత్, పెళ్లి, రీసెపషన్, ఈవెంట్ ఎండ్ ఫన్ పార్టీ.. ఇలా రోజుకొకటి చొప్పున నిర్వహిస్తున్నారు. ఇక పెళ్లి తదుపరి సత్యానారాయణవ్రతాలు ఉండనే ఉన్నాయి. లగ్న పత్రికలతో ఆరంభమయ్యే హడావిడి వేదికలపై ఆడాళ్లు, మగాళ్లు కొత్త సినిమా పాటల రికార్డింగ్ డాన్సులు, పెళ్లికి డ్రోన్లు, క్రేన్లు, రోజూ ఖరీదైన భోజనాలు, మద్యం...ఓహ్... ఇదంతా డబ్బున్న వాళ్లకి ఓ విలాసం, ఓ వైభోగం, సంపద ప్రదర్శన, స్థాయి ప్రదర్శన, వేడుక, ఆడంబరం, అట్టహాసం... నిరాడంబర పెళ్లిళ్ల వైపు తమ కర్తవ్యబోధను నిరంతరంగా సాగిస్తూ ఉండాల్సిన వారు కూడా దీన్ని ప్రోత్సహిస్తుండటంతో సాధారణ జనం సైతం పెళ్లిళ్లు పది రోజులు చేసే వైపుగా పయనిస్తున్నారు. గత ఏడాది జరిగిన ప్రముఖుల పెళ్లిళ్లు ఓసారి పరిశీలిస్తే.....



అంబరాన్ని అంటుతున్న పెళ్లి సంబరాలు

దీపికా పదుకోన్, రణ్‌వీర్ సింగ్

బాలీవుడ్ లవ్ బర్డ్స్‌గా పేరుగాంచిన దీపికా పదుకోన్, రణ్‌వీర్ సింగ్ పెళ్లితో ఒకటయ్యారు. ఇటలీలోని లేక్ కోమో రిసార్ట్స్‌లో జరిగిన పెళ్లితో ఓ ఇంటివాళ్లయ్యారు. ఇది ప్రేమ పెళ్లే అయినా వీళ్లు రెండు సార్లు తమ తమ సంప్రదాయాల ప్రచారం పెళ్లి చేసుకోగా ఆటా పాటతో సంగీత్, మరి రెండు రోజులు వెడ్డింగ్ రిసెప్షన్ జరిగింది. నవంబర్ 14న ఇటలీలోని అందమైన కోమె సరస్సులోని విలాసవంతమైన ప్యాలెస్లో దీపిక మెడలో మూడు ముళ్లు వేశాడు ఈ ఏడాది అత్యధిక ఆసక్తిని రేకేత్తించిన స్టార్ వెడ్డింగ్ వీరిదే. తొలుత ఈ ఇద్దరూ రింగ్స్ మార్చుకుని వివాహం చేసుకున్నట్టు ప్రకటించగా, దీపికా సారస్వత్ బ్రాహ్మిణ్ సామాజికవర్గానికి చెందిన వ్యక్తి కావడంతో కొంకిణి సంప్రదాయాలను అనుసరించి అంతకు ముందు వివాహం జరిగింది ఆనంద్ కరాజ్ సెర్మనీలో జరిగిన ఈ పెళ్లిలో దీపికా తండ్రి ప్రకాశ్ పదుకోన్.. రణ్వీర్ కాళ్లు కడిగి కన్యాదానం చేసారు. వీళ్ల వివాహానికి అతికొద్ది మంది అతిథులు మాత్రమే హాజరయ్యారు. అయితే పెళ్లికి సంబంధించిన ఎలాంటి ఫొటోలు, వీడియోలు మాత్రం బయటకు రాకుండా దీప్వీర్ జంట జాగ్రత్త పడింది. పెళ్లి వచ్చే అతిథులు ఫొటోలు, వీడియోలు తీయొద్దని ముందే వీళ్లు స్పష్టంగా చెప్పారు. తమ పెళ్లికి ఎలాంటి బహుమతులు ఇవ్వొద్దని, అలా ఇవ్వాలనుకుంటే దీపికా ఫౌండేషన్ ద లివ్ లవ్ లాఫ్‌కు ఇవ్వాలని వీళ్లు కోరిన విషయం తెలిసిందే. బెంగళూరులోని లీలా ప్యాలస్‌లో ఆపై ముంబైలోని గ్రాండ్ హయత్‌లో మరోసారి వెడ్డింగ్ రిసెప్షన్ ఏర్పాటు చేశారు.

రాయల్ వెడ్డింగ్

గతేడాది జరిగిన వివాహాలలో రెండేళ్లు గాఢమైన ప్రేమలో ఉన్న బ్రిటన్ రాజ వంశీయుడు ప్రిన్స్ హ్యారీ, హాలీవుడ్ నటి మేఘన్ మార్కెల్లను గతేడాది ఏడాది మే 19న రాయల్ వెడ్డింగ్ జంటగా మార్చింది. ప్రపంచంలోనే అదరహో అని పించింది. లండన్‌లోని బెర్రై ర్ కౌంటీలోని విన్సర్ పట్టణంలోని రాజ భవనం విండ్సర్ క్యాజిలో పెళ్లి వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. వధూవరులిద్ద రూ ఉంగరాలు మార్చుకుని అధికారికంగా ఒక్కటయ్యారు. రాయల్ వెడ్డింగ్‌కి వధువు తండ్రి థామస్ రాలేకపోవడంతో, వరుడు తండ్రి ప్రిన్స్ ఛార్లెస్ ఆమెకు తండ్రిగా విండ్సర్ క్యాజిలోకి నడిపించుకుంటూ తీసుకెళ్లారు. ఇప్పటివరకున్న రాజకుటుంబ సంప్రదాయానికి భిన్నం గా హ్యారీ పెళ్లి ఉంగరం ధరించారు. వధూవరులు ప్రమాణాలు చేసే సమయంలో "విధేయురాలై ఉంటాను"అనే మాటను మేఘన్ మార్కెల్ ఉచ్చరించకపోవటం విశేషం. ఈవివాహ వేడుకకు ఎలిజబెత్ రాణితో పాటు భారీ ఎత్తున్న అతిథులు హజరయ్యారు.వీరిలో బాలీవుడ్ భామ ప్రియాం క చోప్రా, డేవిడ్, విక్టోరియా బెక్హాం, జార్జ్, అమల్, టెన్నీస్ స్టార్ సెరెనా విలియమ్స్లు తదితర 600 మంది అతిథులు హాజరయ్యా రు. వివాహ వేడుకతో విండ్సర్ క్యాజిల్ చర్చి వీధులన్నీ గానా బజానాలతో, అతిథులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా రాజమందిరం దగ్గర ప్రజలు దాదాపు 10 రోజులు సంబరాలు చేసుకున్నారు.



ఈశా-ఆనంద్‌ల పెళ్లి సందడి

అంబానీ, పిరమల్ కుటుంబాలది నలభయ్యేళ్ళ స్నేహం వియ్యంగా మారింది. పిరమల్ కుటుం బానికి చెందిన ఆనంద్... ఈశాకు చిన్న నాటి స్నేహితుడు. 2018 మే నెలలో రెండు కుటుం బాలూ మహారాష్ట్రలోని మహాబలేశ్వర్ వెళ్లాయి. అక్కడ ఆలయంలో తన మనసు లోని మాటను ఈశాకు ఆనంద్ చెప్పాడట! ఆమె కూడా ఓకే అనడం, పెద్దలు కూడా సరేననడం తో ఈ ప్రేమ కథ పెళ్ళి పీటలకు చేరింది. సెప్టె ంబర్‌లో నిశ్చితార్థం మొదలు డిసెంబర్ 12న జరిగిన వివాహం వరకూ ఈవేడుక ఆద్యంతం హాట్‌టాపిక్‌గా నిలిచింది. రాజస్థాన్ రాష్ట్రం లోని ఉదయపూర్‌లో కుమార్తె ఈశా అంబానీ పెళ్లి కోసం ముకేశ్ -నీతా అంబానీలు రంగంలోకి దిగారు. పెళ్లిపనులను దగ్గరుండి చూసుకున్నారు. దేశవిదేశాల నుంచి అతిరథ మహారథులు పెళ్లికి హాజరవుతుండడంతో వారికి ఏ లోటూ రాకుండా చూసేందుకు అందరికి సూచనలిస్తూ అన్నింటినీ దగ్గరుండి పర్యవేక్షిస్తూ కనిపించారు. ఇక పెళ్లికివచ్చే విదే శీ ప్రముఖుల కోసం ఘనమైన ఏర్పాట్లని చేస్తున్న ముకేశ్ వారిని ఉదయ్‌పూర్ తీసుకొచ్చేందుకు ఏకంగా 50 వరకు చార్టెడ్ విమానాలు ఏర్పాటు చేయటంతో పాటు ఉదయ్‌పూర్ విమానాశ్రయం నుంచి పెళ్లి వేడుక జరిగే తమఇంటికితీసుకొచ్చేందుకు వెయ్యి విలాసవంతమైన కార్లను సిద్దంగా ఉంచారు. ఈ వివాహానికివేదికైన27అంతస్తుల యాంటీలియాను దేశ విదేశాల నుంచి తెచ్చి న అనేక రకాల పుష్పాలతో సర్వాం గ సుందరంగా అలంకరించారు. ఇందుకోసం ఏకంగా 10 కోట్లు ఖర్చు పెట్టారని తెలుస్తోంది. పెళ్లికి వచ్చే అతిథులను ఫోన్లు తీసుకురావద్దని, సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయద్దని వివాహ ఆహ్వాన పత్రికతో పాటే సమాచారం అందించటం ఓ విశేషం. దాదావు 5 రోజుల పాటు జరిగిన ఈశా పెళ్లి ఖర్చుపై వెయ్యి కోట్ల పైమాటే. నిజమైతే ఇంత ఖర్చు పెట్టి పెళ్లి చేసుకుంటున్న వారిలో వీళ్ల ది రెండో జంటగా నిలుస్తుంది. 37 ఏళ్ల క్రితం యువరాజు చార్లెస్, డయానాల వివాహా నికి 110మిలియన్ డాలర్లు వెచ్చించారు.



ప్రియాంక, నిక్‌ల ప్రేమ బంధం

బాలీవుడ్ భామ ప్రియాంక చోప్రా, హాలీవుడ్ నటుడు నిక్‌ల ప్రేమవివాహం కూడా రెండు పర్యాయాలు జరిగిం ది. జోధ్పూర్ లోని ఉమైద్ భవన్ ప్యాలెస్‌లో క్రిస్టియన్ పద్ధతిలో డిసెంబర్ 2న వివాహం చేసుకొని ఒక్కటయ్యా రు. అలాగే ఆ మరుచటి రోజు హిందూ సాంప్రదాయం ప్రకారం ఇదే ప్యాలెస్‌లో మరోసారి పెళ్ళి జరిగింది. ఇరు కుటుంబ సాంప్రదాయాల ప్రకారం రెండు రోజు లు జరిగిన వీరి వివాహం జాతీయ, అంతర్జాతీ యంగా ప్రాముఖ్యతను సంతరించుకుంది. న్యూయార్క్‌లా 2017లో జరిగిన 'మెట్ గలా'లో ప్రియాంక, నిక్‌ల్ల ప్రేమకు వునాది పడింది. నిక్ (26) కంటే ప్రియాంక (36) పదేండ్లు పెద్ద అయి నప్పటికీ వీరి పెళ్ళికి వయసు అవరోధం కాకపోవడం విశేషం. ఈ పెళ్లికి బాలీవుడ్ నుంచి ప్రముఖులు హాజరయ్యారు.

సైనా, కశ్యప్



బ్యాడ్మింటన్ స్టార్లు సైనా నెహ్వాల్, పారుపల్లి కశ్యప్ చాలా సింపుల్‌గా సైనా నివాసం ఓరియన్ విల్లాలో ఇద్దరూ రింగులు, దండలు మార్చు కొని ఒక్కటయ్యారు. వాళ్లు రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నారు. కుటుం బ సభ్యులు, ఆప్తుల మధ్య నిరాడంబరంగా జరిగింది. పదేళ్లకు పైగా ప్రేమలో మునిగి తేలిన సైనా-కశ్యప్ ఎక్కడా ఆ విషయం బయటకు రాకుండా జాగ్రత్త పడ్డారు. చివరకు ఇన్నేళ్ల అనుబంధాన్ని డిసెంబర్ 14న మూడు ముళ్ల బంధంగా మార్చుకున్నారు. పెళ్లికి ముందే ఇద్దరి ఇళ్లలో పెద్దల అంగీకారంతో సంగీత్ తదితరాలు సన్నిహితుల నడమే గుట్టు చప్పుడు కాకుండా జరిగాయి. ఆపై డిసెంబర్ 16న దూమ్ దామ్ పార్టీ ఇచ్చిన ఈ జంట. పలు రంగాలకు చెందిన ప్రముఖులు ఈ వేడుక కు ఆహ్వానించి ఆశీస్సులందుకుంది. కుటుంబ సభ్యులు, కొద్ది మంది అతిథుల సమక్షంలో జరిగిన పెళ్లికి సంబంధించిన ఫోటోలను తమ ట్విట్టర్ ఖాతాల్లో షేర్ చేసింది ఈజంట. నా జీవితంలో ఇదే గొప్ప మ్యాచ్ అంటూ కశ్యప్‌పై తనకున్న ప్రేమషాట్లని చూపించింది సైనా.

అదిరిన సోనమ్-ఆనంద్ ఆహుజా పెళ్లి వేడుక



ఎవ్వరూ ఊహించని విధంగా జరిగిన సోనమ్-ఆనంద్ ఆహుజా గురించి షికార్లు చేస్తున్న వుకార్లకు తెరదించుతూ, పెళ్లిని తేదీలను అనిల్ కపూర్, అహుజా కుటుంబాలు సంయుక్తంగా అధికారిక ప్రకటనను విడుదల చేసి, ఆశ్చర్యానికి గురిచేసాయి. అలాగే పెళ్లి కార్డు నుంచి పెళ్లి తంతు ముగిసే వరకు అంతా ప్రత్యేకమే. విదేశాల్లో భారీగా ఖర్చు పెట్టి వివాహం చేసుకోవాలనే ఆలోచన లేదని, సింపుల్‌గా ఇండియాలోనే చేసుకుంటానని చెప్పిన సోనమ్ కపూర్ పేపర్ సేవ్ చేద్దామనే ఉద్దేశ్యంతో అసలు వెడ్డింగ్ కార్డ్స్ అచ్చు వేయించకుండా వాటి స్థానంలో డిజిటల్ వెడ్డింగ్ కార్డ్స్ ప్లాన్ చేసింది.. వాటిని నేరుగా అతిథుల ఫోన్లకు పంపి ఔరా అనిపించిందీ జంట. రాక్డేల్ బంగళాలో సిక్కు సాంప్రదాయ ప్రకారం ఈ పెళ్లి వేడుకకి కపూర్ ఫ్యామిలితో పాటు కజిన్స్ అర్జున్, జాహ్నవి, ఖుషి, అన్షులా బెస్ట్ ఫ్రెండ్ జాక్వెలిన్, వీరేది వెడ్డింగ్ కో యాక్టర్స్ స్వర భాస్కర్, కరీనా కపూర్, రణబీర్ కపూర్, రణవీర్ సింగ్, దీపిక పదుకోన్, వరుణ్ ధావన్, కరణ్ జోహార్, సైఫ్ అలీ ఖాన్, కరిష్మా కపూర్ బాలీవుడ్ ప్రముఖులు అమితాబ్, జాక్వెలిన్ ఫెర్నాండెజ్ తదితర నటులు పెళ్లి వేడుకలో సందడి చేసారు. మే 8న ముంబై లో పెళ్లి వేడుకకు ముందు మే7న మెహిందీ ఫంక్షన్, సంగీత్ తరువాత ప్రత్యేక విందులు ఇలా నాలుగైదు రోజులు పెళ్లి జరిగింది.

సినీ తారల నడుమ
కార్తికేయ – పూజా ప్రసాద్ పెళ్లి

రాజమౌళి తనయుడు కార్తికేయ పెళ్లి జైపూర్‌లో అంగరంగ వైబవంగా జరిగింది. డిసెంబర్ 30న వీళ్ళ పెళ్లి దక్షిణాది సంప్రాదాయ పద్దతిలో ఘనంగా జరిగింది. ఈ మధ్య కొందరు మ్యారేజ్ ఇన్విటేషన్స్ మేనేజర్లను పంపించడమో ఫోన్‌లో పెళ్లి గురించి చెప్పేసి, వాట్సాప్‌లోనో సామాజిక మీడియాలో ఆహ్వానం పంపిచేసి వదిలేస్తారు. కానీ రాజమౌళి భార్య రమా రాజమౌళి వ్యక్తిగతంగా ప్రతి ఇంటికి వెళ్లి మరీ ఇన్విటేషన్ అందించారు. దీంతో తెలుగుసినీ తారాలోకం మొత్తం రాజస్థాన్‌లోని జైపూర్‌లో మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా పెళ్లి వేడుకకి వెళ్లి ఆదర గొట్టేసింది. దీనికి టాలీవుడ్ నుంచే కాకుండా బాలీవుడ్ ప్రముఖులు ఇకరిద్దరు మినహా దాదాపు అంతా హాజరయ్యారు. ప్రస్తుతం వీళ్ళ హంగామా సోషల్ మీడియాను ఊపేస్తుంది. డిసెంబర్ 28న వీళ్ల పెళ్లి హంగామా షురూ అయింది.. 29న సంగీత్‌లో కూడా డాన్సులతో అదరగొట్టారు. 30న వీళ్ల పెళ్లి ఘనంగా జరిగింది. రామ్‌చరణ్, ప్రభాస్, ఎన్టీఆర్, నాని, అనుష్కతోపాటు పలువురు సినీ ప్రముఖులు కుటుంబాలతో సహా జైపూర్కు వెళ్లారు. ఈ పెళ్లికి పెళ్లి కోసం స్టార్ సెలబ్రెటీలు షూటింగ్‌లకు బ్రేక్ చెప్పి మరి జై పూర్ లో వాలిపోయారు. వెల్కం డిన్నర్ పార్టీతో మొదలైన ఈ వివాహ వేడుక లో రాజమౌళితో కలిసి ప్రభాస్, అనుష్క హుషారుగా డ్యాన్సు చేశారు. జగపతిబాబు సోదరుడైన రాంప్రసాద్ కుమార్తె పూజా ప్రసాద్‌ల కార్తికేయ వివాహమాడారు. కార్తికేయ ఇప్పటికీ సినీ ఇండస్ట్రీలో వివిధ రంగాలలో పట్టు సాధించేందుకు యత్నిస్తుండగా శాస్త్రీయ సంగీ తంలో



ముఖ్యంగా భక్తి సంగీతంలో అనేక పాట లు పాడి ఇప్పటికే గాయనిగా పూజ మంచిపేరు తెచ్చుకున్న విషయం విదితమే.

నేహాధూపియా వెడ్స్ అంగద్ బేడీ

మాజీ మిస్ ఇండియా సినీ నటి నేహా ధూపియా పింక్, బాలీవుడ్ ఇప్పుడప్పుడే గుర్తింపు తెచ్చుకుంటోన్న నటుడు అంగద్ బేడీ (ప్రము ఖ క్రికెటర్ బిషన్ సింగ్ బేడీ కుమారుడు)తో తన వివాహం జరుగుతున్నట్లు చెప్పి సంచలనం సృష్టించిం ది. ఆసియా క్రీడల్లో స్వర్ణపతకం సాధించిన ఏకైక మహిళా రెజ్లర్గా రికార్డు సృష్టించిన వినేశ్ ఫోగట్ జకర్తా నుంచి తిరిగి వస్తూ ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం గేటు దగ్గర రాగానే సోమవీర్ రాథీతో తన నిశ్చితార్థవేడుకలను కుటుంబ సభ్యుల నడుమ జరువుకుని ఔరా అనిపించింది. శ్చితార్థమే వెరైటీ అనుకుంటే, పెళ్ళిలోనూ ఈ జంట కొత్తదనం చూపించింది. సంప్రదాయం ప్రకారం చేయాల్సిన ఏడు ప్రమాణాలకు తోడు బేటీ బచావో, బేటీ పడావో, బేటీ ఖిలావో అనే ఎనిమిదో ప్రమాణాన్ని కూడా జోడించి, తమకు సామాజిక బాధ్యత ఉందని, ప్రతి ఒక్కరూ ఈ దారిలో నడవాలని చాటి చెప్పిందీ జంట. ఎనిమిదేళ్లుగా ప్రేమిస్తున్న తన సహోద్యోగిని వినేశ్ స్వగ్రామమైన హర్యానా రాష్ట్రంలో భక్త ఖేరాలో 2018 డిసెంబర్ 13న అతి కొద్దిమంది బంధువులు, స్నేహితుల సమక్షంలో వీరి వివాహం నిరాడంబరంగా జరిగింది.



సూర్య
హైదరాబాద్
శనివారం
5 జనవరి 2019
10
cinema@suryaa.com
సూర్య సినిమా

చెర్రీ చుక్కలు చూపించేవాడు


కైరా అద్వానీ

భరత్ అనే నేను చిత్రంలో సూపర్ స్టార్ మహేష్ సరసన హీరోయిన్‌గా నటించిన ముంబై భామ కైరా అద్వానీ. ఆ చిత్రం బ్లాక్ బస్టర్ అవడంతో ఓవర్ నైట్ స్టార్ ఇమేజ్‌ని సొంతం చేసుకొని టాలీవుడ్‌లో వరుస సినిమాలు చేస్తోంది ఈ అందాల భామ. మెగా పవర్ స్టార్ రాంచరణ్ హీరోగా మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను దర్శకత్వంలో డి.వి.వి ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై దానయ్య డి.వి.వి నిర్మిస్తోన్న యాక్షన్ ఎంటర్‌టైనర్ వినయ విధేయ రామలో కైరా అద్వానీ హీరోయిన్‌గా నటించింది. జనవరి 11న ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ కైరా అద్వానీ పత్రికల వారితో ముచ్చటించారు. హీరో రామ్‌చరణ్ ఎనర్జీని మ్యాచ్ చేస్తూ, అతని డాన్సింగ్ స్కిల్స్‌కి తగ్గట్టుగా స్టెప్స్ వేయడానికి తాను అపసోపాలు పడినట్లు చెప్పుకొచ్చిన ఈ భామ చెప్పిన మరిన్ని విశేషాలు ఆమె మాటల్లోనే..!!

బోయపాటి అప్పుడే నాకు సినిమా చూపించేశారు

దర్శకుడు బోయపాటి ఈ సినిమా స్టోరీ చెప్పినప్పుడు పూర్తి సినిమా చూసేశాననే ఫీలింగ్ వచ్చింది. చాలా రోజుల తర్వాత ఒక మంచి ఫ్యామిలీ స్టోరీ విన్నాననిపించి ఇమీడియట్‌గా ఓకే చెప్పేశాను. బోయపాటిగారు ఇన్‌క్రెడిబుల్ డైరెక్టర్. నేచురల్ ఎలిమెంట్స్‌ని ప్రెజెంట్ చేయడం వేరు.. ఏదైతే నమ్మడానికి వీల్లేకుండా ఉంటాయో, వాటిని నమ్మేంతగా.. ఫీలయ్యేంతగా మెస్మరైజ్ చేస్తూ స్క్రీన్‌పై ఎలివేట్ చేయడం బోయపాటి లాంటి ఫిల్మ్ మేకర్స్‌కే సాధ్యమవుతుంది. ఇది కూడా ఆయన బ్రాండ్ ఫిలిం.

ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 15 మంది

రామ్ చరణ్, వివేక్ ఒబెరాయ్, ప్రశాంత్, ఆర్యన్ రాజేష్, స్నేహ లాంటి 15 మంది టాప్ యాక్టర్స్‌తో నటించడం అనేది అమేజింగ్ ఎక్స్‌పీరియన్స్. సెట్స్ దగ్గరి నుండి ప్రతీది లార్జర్ దేన్ లైఫ్ అనిపించేలా సినిమా చాలా గ్రాండ్‌గా వచ్చింది.

ఇంట్లో పిల్లి వీధిలో పులి

నాకు డ్యాన్స్ అంటే చాలా ఇష్టం. అందుకే నటినయ్యా. కంప్లీట్‌గా అటు డ్యాన్స్, కామెడీ పెర్ఫామ్ చేయడానికి మంచి స్కోప్ ఉన్న సినిమాలో పని చేసే అవకాశం దొరికినప్పుడు చాలా హ్యాపీగా ఉంటుంది. 'వినయ విధేయ రామ' చేసినందుకు కూడా అదే ఫీలింగ్. కాకపోతే చెర్రీతో డాన్స్ చేయడానికి మాత్రం చాలా కష్టపడాల్సివచ్చింది. అతనొక అమేజింగ్ డాన్సర్. నాకూ చరణ్‌కి మధ్య కెమిస్ట్రీ ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. నా క్యారెక్టర్ పేరు 'సీత'. ఫ్యామిలీలో అందరి ముందు చాలా వినయంగా ఉంటూ, రామ్ ఏది చెప్తే అదీ అన్నట్టుగా ఉంటాను. బయట మాత్రం చాలా డామినేటింగ్‌గా ఉంటాను. మా కాంబినేషన్‌లో ఉండే సీన్స్ ఇంట్రెస్టింగ్‌గా ఉంటాయి.

లెంగ్త్ కాదు డెప్త్ ముఖ్యం

సినిమాలో నేను ఎంత టైమ్ స్క్రీన్‌పై కనిపిస్తాను అనేకన్నా, కనిపించినంత సేపు నేను ప్లే చేసిన క్యారెక్టర్‌కి క్వాలిటీ ఉందా లేదా..? నా ప్రెజెన్స్‌ని ఆడియెన్స్ ఫీల్ అయ్యారా లేదా అని ఆలోచిస్తా.

నాకైతే భాషాభేదం లేదు

నాకైతే పర్టికులర్‌గా ఒకే లాంగ్వేజ్ ఆడియెన్స్‌కి స్టిక్ అవ్వాలనే ఆలోచన లేదు. గ్లోబల్ ఆడియెన్స్‌ని ఎంటర్‌టైన్ చేయాలి. లాంగ్వేజ్ ఏదైనా, స్క్రిప్ట్ బావుంటే అది డిజిటల్ ప్లాట్ ఫామ్ అయినా 'నో' అని చెప్పను.

హిందీలో అర్జున్‌రెడ్డి చేస్తున్నాను

'అర్జున్ రెడ్డి' హిందీ రీమేక్‌లో నటిస్తున్నందుకు చాలా ఎగ్జైటెడ్‌గా ఉన్నాను. సినిమాలో లాస్ట్ సీన్ నుండి షూటింగ్ స్టార్ట్ చేశారు. సినిమాలో నేటివిటీకి తగ్గట్టు చిన్న చిన్న చేంజెస్ చేశారు. సినిమా ఢిల్లీ బ్యాక్ డ్రాప్‌లో ఉంటుంది!!



నా కెరీర్‌కి మణిహారం మణికర్ణిక




గ్యాంగ్ స్టర్, తను వెడ్స్ మను, ఫ్యాషన్, క్వీన్, తను వెడ్స్ మను రిటర్న్స్, రంగూన్ వంటి చిత్రాలతో బాలీవుడ్‌లో మోస్ట్ పాపులర్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్న కంగనా రనౌత్ టైటిల్ పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం మణికర్ణిక. ఝాన్సీ లక్ష్మీ భాయి జీవిత కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి రాధాకృష్ణ జాగర్లమూడి, కంగనా రనౌత్ దర్శకత్వం వహించారు. ప్రముఖ రచయిత వి.విజయేంద్రప్రసాద్ ఈ చిత్రానికి కథ-స్క్రీన్ ప్లే అందించారు. కైరోస్ కొంటెంట్ స్టూడియోస్ పతాకంపై జీ స్టూడియోస్, కమల్ జైన్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. మోస్ట్ అవైటెడ్ మూవీగా రూపొందుతున్న ఈ చిత్రం జనవరి 25న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కానుంది. కాగా ఈ చిత్రం తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కంగనా రనౌత్, విజయేంద్ర ప్రసాద్, ఆర్. నారాయణమూర్తి, తమ్మారెడ్డి భరద్వాజ, మామిడి హరికృష్ణ, కమల్ జైన్ పాల్గొన్నారు.

నటి, దర్శకురాలు కంగనా రనౌత్ మాట్లాడుతూ.. ఈ సినిమా కోసం రెండు నెలలు కష్టపడి గుర్రపు స్వారీ, స్టంట్స్ నేర్చుకున్నాను. ఇందులోని పాత్రలు చాలా అమేజింగ్‌గా ఉంటాయి. ఆర్టిస్టులందరు బాగా పెర్ఫార్మ్ చేసారు. ఈ సినిమా షూటింగ్ సగభాగం పూర్తి అయినాక క్రిష్‌కి ఎన్.టీ.ఆర్ బయోపిక్ ఆఫర్ వచ్చింది. స్క్రిప్ట్ అంతా నాకు తెలుసు కాబట్టి మా టీమ్ సపోర్ట్‌తో మిగిలిన భాగం షూటింగ్ పూర్తిచేశాను. ఇది అనుకోకుండా జరిగింది. కావాలని నేను చేయలేదు. క్రిష్ చాలా గొప్పగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. మణికర్ణిక క్యారెక్టర్‌లో నటించడం ఛాలెంజింగ్‌గా అనిపించింది. ఫుల్ యాక్షన్ చిత్రమిది. తెలుగులో నా వాయిస్ కోసం పదిమందిని చెక్ చేసి ఫైనల్‌గా ఓ కొత్త వాయిస్ ఒకే చేసాం. పర్ఫెక్ట్‌గా సెట్ అయింది. విజయేంద్ర ప్రసాద్‌గారు చాలా ఇన్పుట్స్ ఇచ్చారు. మళ్ళీ నాకు ఆయన వేరే కథ రాస్తున్నారు. ఆ సినిమా త్వరలోనే సెట్స్ పైకి వెళ్తుంది. ఆ వివరాలు త్వరలో ప్రకటిస్తాం.. అన్నారు!!

వదల బాలయ్యా నిన్నొదలా



పవన్ కళ్యాణ్ ఎవరో తనకు తెలియదని నందమూరి బాలకృష్ణ చెప్పడాన్ని పవన్ కళ్యాణ్ పెద్దగా పట్టించుకోకపోయినా.. ఆయన సోదరుడు నాగబాబు మాత్రం చాలా తీవ్రంగా పట్టించుకున్నారు. పనిగట్టుకుని చేయించుకున్న ఇంటర్వ్యూలో బాలకృష్ణ ఎవరో తెలియదని చెప్పిన నాగబాబు..



మరోసారి పనిగట్టుకుని అంజిగాడుగా పాపులర్ అయిన పాతతరం నటుడు బాలకృష్ణ ఎవరో తెలియదని చెప్పడం తన పొరపాటని పేర్కొన్నారు. బాలకృష్ణ చాలా మంచి నటుడని, కామెడీ చాలా బాగా చేసేవాడని కావాలని వివరణ ఇచ్చి.. సదరు వివాదానికి మరింత ఆజ్యం పోశారు.

ఇప్పుడు తాజాగా మరోసారి ట్విట్టర్ వేదికగా సంక్రాంతికి విడుదలవుతున్న ఎన్టీఆర్ బయోపిక్‌పై వ్యంగ్యాస్త్రం సంధించారు. స్వతహా వివాదాలకు కడు దూరంగా ఉండే నాగబాబు పనిగట్టుకుని చేస్తున్న ఈ ప్రచారం వెనుక గల ప్రబల కారణాలను విశ్లేషించే పనిలో రాజకీయ పరిశీలకులు ఇప్పటికే తలమునకలైపోయారు!!

పీక్‌లో ఉండగా పీకల్లోతు ప్రేమలో పడిన

శ్రుతి పెళ్లికి సిద్ధమవుతోంది





కెరీర్ పీక్‌లో ఉండగా పీకల్లోతు ప్రేమలో పడిన కమల తనయ శ్రుతిహాసన్ త్వరలోనే తన మెడలో మూడు ముళ్లు వేయించుకునేందుకు సిద్ధపడుతోంది. గత కొంతకాలంగా ఆమె యూరప్‌కు చెందిన వ్యక్తితో సహజీవనం చేస్తోంది. తన తండ్రి కమల్ హాసన్‌కు కూడా అతడ్ని పరిచయం చేసింది. తాజాగా తన యూరోపియన్ బోయ్‌ఫ్రెండ్‌తో అత్యంత సన్నిహితంగా తీయించుకున్న ఫోటోను ట్విట్టర్‌లో పోస్ట్ చేసి, తన పెళ్లిని అధికారికంగా ప్రకటించింది!!

కేడర్ రెడీ చేస్తున్నాడు



పీపుల్స్ స్టార్ ఆర్.నారాయణమూర్తి పేరు వినగానే దండోరా, ఎర్రసైన్యం, చీమలదండు, ఒరేయ్ రిక్షా వంటి చిత్రాలు గుర్తుకు వస్తాయి. ప్రజా సమస్యలపై పోరాట యోధుడిగా, రైతుకూలీలు పక్షాన నిలబడే నాయకుడిగా, సినిమాలు తీస్తూ.. ఆయా పాత్రల్లో జీవించి ప్రేక్షకుల మన్నలను పొందుతున్న నారాయణమూర్తి సినిమాలకు ప్రత్యేకమైన అభిమానులు వున్నారంటే అతిశయోక్తి కాదు. తాజాగా అయన నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తోన్న కొత్త చిత్రం కేడర్. ప్రస్తుత రాజకీయాలకు అనుగుణంగా గెలుపు, ఓటములు ఎలావుంటాయి? గెలిచినవారు ఎలా పార్టీ కేడర్‌ని ఏర్పాటు చేస్తారు.. అనే అంశాలపై కేడర్ చిత్రాన్ని రూపొందిస్తున్నాని ఆర్.నారాయణమూర్తి తెలిపారు. తన సొంత నిర్మాణ సంస్థ స్నేహ చిత్ర పిక్చర్స్ పతాకంపై నిర్మిస్తోన్న ఈ చిత్రం షూటింగ్ జనవరి 20నుండి జరగనుంది. ఈ చిత్రం మరిన్ని వివరాలు త్వరలోనే తెలియజేస్తామన్నారు అయన!!

అందాకా ఆగలేక



మహేష్‌బాబు నటించిన భరత్ అనే నేను గతేడాది ఏప్రిల్‌లో విడుదలైంది. ప్రస్తుతం నటిస్తున్న మహర్షి కూడా ఈ ఏడాది ఏప్రిల్‌లోనే రిలీజ్ కానుంది. తమ అభిమాన కథానాయకుడు నటించిన సినిమా సంవత్సరం గ్యాప్‌తో వస్తుండడం అభిమానులకు అంతగా రుచించడం లేదు. పైగా ఈ సినిమాకి సంబంధించిన స్టిల్స్ రిలీజ్ చేసే విషయంలోనూ దర్శకనిర్మాతలు ఎక్కడ లేని పొదుపు పాటిస్తుండడం వారికి అస్సలు నచ్చడం లేదు. మహర్షి సినిమా నుంచి ఇప్పటివరకు రెండంటే రెండే స్టిల్స్ రిలీజ్ చేశారు.

ఈ చిత్రంలో మహేష్‌బాబు పల్లెటూరిలోని తన స్నేహితుడి కోసం ఇండియా వచ్చే ఎన్నారైగా నటిస్తున్నారన్న విషయానికి తమ సృజనాత్మక జోడించి, ఇప్పటివరకు విడుదలైన రెండు రకాల స్టిల్స్‌ను జత చేసి ఒక వీరాభిమాని ఓ పోస్టర్‌ను డిజైన్ చేసి, సోషల్ మీడియాలో వదిలేశాడు. దీనికి మహేష్‌బాబు ఫ్యాన్స్ నుంచి విపరీతమైన స్పందన వస్తోంది. మహేష్‌బాబు కూడా ఈ పోస్టర్ చూసి మెచ్చుకున్నారని తెలుస్తోంది. మరి ఫ్యాన్స్ ఆత్రాన్ని అర్థం చేసుకుని ఈ చిత్ర యూనిట్ త్వరలోనే అఫీషియల్ పోస్టర్ రిలీజ్ చేయడం ఉత్తమమని పలువురు అభిప్రాయపడుతున్నారు!!

చైనాలోనూ చేవ చూపలేకపోయింది



దంగల్, సీక్రెట్ సూపర్‌స్టార్ చిత్రాలతో చైనాలోనూ తిరుగులేని ఫ్యాన్ ఫాలోయింగ్ ఏర్పరచుకున్నాడు అమీర్‌ఖాన్. అక్కడ అమీర్‌కి గల పాపులారిటీని దృష్టిలో ఉంచుకుని థగ్స్ ఆఫ్ హిందుస్థాన్ చిత్రాన్ని చైనాలో భారీగానే విడుదల చేశారు. ఇండియాలో ఫ్లాప్ అయినా.. చైనాలో అమీర్‌కి గల సక్సెస్ రేట్ దృష్ట్యా ఓ మోస్తరు వసూళ్లు రాబడుతుందని పరిశీలకులు అంచనా వేశారు. అయితే ఇండియాలో కంటే చైనాలో ఈ చిత్రం మరింత పెద్ద ఫ్లాప్ అయ్యింది. పైరేట్స్ ఆఫ్ ది కరేబియన్‌కి కార్బన్ కాపీలా ఉందనే విమర్శలు వెలువడడంతో ఈ సినిమాను చూసేందుకు చైనీయులు అస్సలు ఆసక్తి చూపించలేదు. చైనా విడుదలకు ముందే.. కొంపలు మునిగిపోతున్నట్లుగా.. థగ్స్ ఆఫ్ హిందుస్థాన్ అపజయం పాలు కావడానికి తను పూర్తి బాధ్యత తీసుకుంటున్నానని అమీర్ ప్రకటించడం, క్షమాపణ కోరడం కూడా చైనా బాక్సాఫీసుపై ప్రభావాన్ని చూపింది!!

ఉబ్బితబ్బిబ్బవుతోంది



22ఏళ్ల క్రితం శంకర్ దర్శకత్వంలో విశ్వనటుడు కమల్‌హాసన్ నటించిన 'ఇండియన్' చిత్రం భారీ విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమా రెండోభాగం చిత్రీకరణ ఈ నెల 18 నుంచి మొదలుకానుంది. లైకా సంస్థ భారీ బడ్జెట్‌తో దీనిని తెరకెక్కిస్తోంది. ఈ చిత్రం కోసం చెన్నై శివారులో భారీ సెట్ వేస్తున్నారు. మరికొన్ని రోజుల్లో పనులు పూర్తి కానున్నాయి. ఇదిలా ఉండగా ఇటీవల అమెరికా నుంచి మేకప్ నిపుణులు చెన్నై వచ్చారు. యువకుడు, వృద్ధుడు వంటి రెండు మేకప్ టెస్టులు చేశారు. అద్భుతంగా రావడంతో షూటింగ్‌కు సిద్ధమైంది చిత్ర బృందం. సాధారణంగా శంకర్ చిత్రం అంటేనే చాలా కాలం చిత్రీకరణ జరుగుతుంది. అయితే ఈ సినిమాను నాలుగు నెలల్లో పూర్తి చేయాలని నిర్ణయించుకున్నారు శంకర్. ఈ చిత్రంలో నటించే అవకాశం రావడం పట్ల కాజల్ ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతోంది!!



ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్ పదవికి మాకెన్ రాజీనామా

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఆ పార్టీ సీనియర్ నేత అజయ్ మాకెన్ రాజీనామా చేశారు. గురువారం రాత్రి పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీతో సమావేశమైన అనంతరం మాకెన్ తన రాజీనామా విషయాన్ని ట్విటర్ ద్వారా ప్రకటించారు. '2015 అసెంబ్లీ ఎన్నికల తరువాత నుంచి ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొనసాగాను. ఈ నాలుగేళ్లు రాహుల్ గాంధీ, పార్టీ కార్యకర్తలు, మీడియా నుంచి వెల కట్టలేని ప్రేమ, మద్దతు పొందాను' అని మాకెన్ ట్వీట్ చేశారు. మాకెన్ రాజీనామాను రాహుల్ గాంధీ ఆమోదించారు. ఆయన స్థానంలో పార్టీ మరో సీనియర్ నాయకుడు అర్విందర్ సింగ్ లవ్లీకి ఢిల్లీ కాంగ్రెస్ బాధ్యతలు అప్పగించారు. ఆరోగ్య కారణాలతో మాకెన్ ఈ పదవి నుంచి తప్పుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. అయితే, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకే మాకెన్ రాజీనామా చేసినట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఢిల్లీలో 15 ఏళ్ల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించి 2015 అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ అఖండ విజయం సాధించింది. ఆ ఎన్నికల తరువాత నుంచి ఢిల్లీ కాంగ్రెస్ బాధ్యతలను అజయ్ మాకెన్‌కు అప్పగించారు. 2017లో జరిగిన ఢిల్లీ మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆశించిన విజయం సాధించలేదు. దీనికి బాధ్యత వహిస్తూ మాకెన్ అప్పుడు తన పదవికి రాజీనామా చేశారు. అయితే, ఆ సమయంలో కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా ఉన్న రాహుల్ గాంధీ కోరడంతో మళ్లీ పార్టీ బాధ్యతలు తీసుకున్నారు.

సూర్య
హైదరాబాద్
శనివారం
5 జనవరి 2019

ఆపిల్స్‌ని ఆరెంజెస్‌తో పోల్చవద్దు

- 2007 రేట్లు 2014లో ఉన్నాయా?
- లోక్‌సభలో నిర్మలా సీతారామన్ ఆసక్తికర వ్యాఖ్యలు
- నిర్మల ప్రసంగంపై అరుణ్ జైట్లీ ట్వీట్
- చక్కగా ప్రసంగించారని కితాబు
- రాహుల్‌ను నిలదీయండి : స్మృతి ఇరానీ

న్యూఢిల్లీ : రఫేల్ యుద్ధ విమానాల ఒప్పందంపై లోక్‌సభలో శుక్రవారం జరిగిన చర్చ సందర్భంగా రక్షణ శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఈ ఒప్పందం విషయంలో ఆపిల్, నారింజ పళ్లను పోల్చి చూస్తోందని ఆరోపించారు. 2007లో రూ. 526 కోట్లు కోట్ చేశారని మంత్రి చెబుతూ, 2011లో కానీ, 2014లో కానీ అదే విధంగా ధర ఉంటుందా అని నిలదీశారు. ఎస్కలేషన్ కాస్ట్స్, ఎక్స్ఛేంజ్ రేట్ వ్యత్యాసాలు ఉన్నాయని తెలిపారు. సాధారణ విమానం ధరను ఆయుధాలతో కూడిన అత్యాధునిక విమానం ధరతో పోల్చరాదని చెప్పారు. రూ. 526 కోట్లను రూ. 737 కోట్లతో (డబ్బును) పోల్చవచ్చునన్నారు. కాంగ్రెస్ ఈ విమానాల ధరలను ఒక్కో చోట ఒక్కో విధంగా చెబుతోందని నిర్మల సీతారామన్ అన్నారు. బహిరంగ సభల్లోనూ, పార్లమెంటులోనూ వేర్వేరు ధరలు చెప్పారన్నారు. దీని గురించి బాగా తెలుసుకుని మాట్లాడాలని సలహా ఇచ్చారు. మోడీని పదవి నుంచి తొలగించడానికి పాకిస్తాన్ సహాయం కోరడం పట్ల సిగ్గు పడడం లేదా అని కాంగ్రెస్‌ను ఆమె నిలదీశారు. తప్పుల తడక ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులపై నిర్మల మండిపడ్డారు. సీనియర్ కాంగ్రెస్ ఎంపీ ఒకరు మన ఎయిర్ చీఫ్‌ను అబద్ధాలకోరు అన్నారన్నారు. వాళ్లు సుప్రీం కోర్టును మాత్రమే నిందించలేదని ఎద్దేవా చేశారు. మోడీని గద్దె దించడానికి పాకిస్తాన్ నుంచి సహాయం కోరడానికి వారికి సిగ్గు లేదా అని అడిగారు. రహస్య నిబంధనలను కాంగ్రెస్ ఎన్ని సార్లు ప్రయోగించలేదని ప్రశ్నించారు. ఆయుధాల వివరాలు రహస్య నిబంధనల పరిధిలో ఉన్నాయన్నారు. పరస్పర విరుద్ధమైన ప్రకటనలు చేస్తూ కాంగ్రెస్ దేశాన్ని తప్పుదోవ పట్టిస్తోందని మంత్రి దుయ్యబట్టారు.



నిర్మల సీతారామన్‌పై అరుణ్ జైట్లీ ట్వీట్: రక్షణ శాఖ మంత్రి నిర్మల సీతారామన్ శుక్రవారం లోక్‌సభలో రఫేల్ యుద్ధ విమానాల ఒప్పందంపై చర్చ సందర్భంగా కాంగ్రెస్, తదితర పక్షాల ఆరోపణలకు దీటైన సమాధానాలు ఇచ్చారు. బోఫోర్స్ కుంభకోణం వల్ల యూపీయే ప్రభుత్వం కుప్పకూలిందని, రఫేల్ ఒప్పందం వల్ల ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తుందని చెప్పారు. ఈ నేపథ్యంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ శుక్రవారం ఇచ్చిన ట్వీట్‌లో నిర్మల సీతారామన్‌ను ప్రశంసించారు. 'అద్భుతంగా మాట్లాడారు! శ్రీమతి నిర్మల సీతారామన్ గారూ! అసాధారణమైన ప్రతిభ కనబరిచారు. బూటకపు ప్రచారాన్ని మీరు తుత్తునియలు చేశారు. మేమంతా మీ ప్రతిభకు గర్విస్తున్నాం' అని అరుణ్ జైట్లీ ప్రశంసించారు.





రాహుల్‌ను నిలదీయండి : రామాలయం వివాదం కేసులో న్యాయ ప్రక్రియకు కాంగ్రెస్ పార్టీ తమ లాయర్ల ద్వారా ఆటంకాలు సృష్టిస్తోందని కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ఆరోపించారు. దీనిపై రామ భక్తులంతా ఆ పార్టీని నిలదీయాలని ఆమె పిలుపు ఇచ్చారు. శుక్రవారం మీడియాతో ఆమె మాట్లాడుతూ, రామాలయం అంశంపై కాంగ్రెస్ పార్టీ తమ లాయర్ల ద్వారా రాజకీయం చేయడం మానుకోవాలన్నారు. రామాలయం అంశం ప్రజల విశ్వాసాలకు సంబంధించిన అంశమని అన్నారు. మూడు రాష్ట్రాల ఎన్నికల కోసమే రాహుల్ జంధ్యం ధరించారా అని విషయంపై కూడా రామ భక్తులు ఆ పార్టీని నిలదీయాలన్నారు. 2019 సార్వత్రిక ఎన్నికలు పూర్తయ్యేంత వరకూ రామ జన్మభూమి- బాబ్రీ మసీదు స్థల వివాదంపై విచారణను వాయిదా వేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత, న్యాయవాది కపిల్ సిబల్ కోరిన నేపథ్యంలో స్మృతి ఇరానీ తాజా వ్యాఖ్యలు చేశారు.


అయోధ్య కేసు కోర్టులో ఉంది... ఏమీ మాట్లాడను : రాహుల్

- అయోధ్య కేసును విచారించిన సుప్రీం కోర్టు
- తదుపరి విచారణ 10కి వాయిదా
- కోర్టు పరిధిలో ఉన్నందున తాను ఏమీ మాట్లాడనని చెప్పిన రాహుల్



న్యూఢిల్లీ : అయోధ్య రామ మందిరం కేసు విచారణను కొత్త ధర్మాసనానికి అప్పగించబో తున్నట్టు శుక్రవారం సుప్రీం కోర్టు ప్రకటించిన సంగతి తెలిసిందే. చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఎస్ కె కౌల్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసును శుక్రవారం విచారించింది. ఇరు పక్షాల తరఫున వాదనలను వినిపించేందుకు సీనియర్ న్యాయవాదులు హరీష్ సాల్వే, రాజీవ్ ధవన్ కోర్టుకు హాజరయ్యారు. అయితే, వారి వాదనలను వినకుండానే ఈ నెల 10కి తదుపరి విచారణను వాయిదా వేశారు. ఒక్క నిమిషం పాటు కూడా కేసు విచారణ సాగలేదు. మరో వైపు, ఈ అంశంపై స్పందించాలని మీడియా ప్రతినిధులు కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీని కోరారు. ఈ వ్యవహారం ప్రస్తుతం సుప్రీం కోర్టు పరిధిలో ఉందని, అందువల్ల దీనిపై తాను ఏమీ మాట్లాడబోనని ఆయన స్పష్టం చేశారు.

నాడు మోడీ సభ నిర్వహించిన చోటే దుబాయిలో 11న రాహుల్ భారీ బహిరంగ సభ



దుబాయి : ప్రవాస భారతీయులను ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అందులో భాగంగా ఈ నెల 11, 12 తేదీల్లో ఆ పార్టీ చీఫ్ రాహుల్ గాంధీ దుబాయి, అబు ధాబిలలో పర్యటించనున్నారు. 2016లో దుబాయిలో నిర్వహించిన బహిరంగ సభలో భారత ప్రధాని నరేంద్ర మోడీ అధికారిక హోదాలో పాల్గొన్నారు. ఇప్పుడు ఆ సభ జరిగిన చోటే ఈ నెల 11న కాంగ్రెస్ సభ నిర్వహించనున్నది. దుబాయిలోనే అతి పెద్దదైన క్రికెట్ స్టేడియంలో సభ నిర్వహణకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈ స్టేడియం సామర్థ్యం 25 వేల మంది. మహాత్మా గాంధీ 150వ జయంతిని పురస్కరించుకుని నిర్వహించనున్న ఈ సభలో 'గాంధీ 150 సంవత్సరాలు- భారత్ ఒక ఆలోచన' అన్న అంశంపై రాహుల్ ప్రసంగిస్తారు. 12న అబు ధాబి సభలో రాహుల్ పాల్గొంటారు.

జైలులో శశికళను కలిసిన విజయశాంతి



బెంగళూరు : ఆదాయానికి మించి ఆస్తుల కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న అన్నా డీఎంకే నేత శశికళతో కాంగ్రెస్ నేత విజయశాంతి భేటీ అయ్యారు. కర్నాటకలోని పరప్పణ అగ్రహార జైలులో ఉన్న శశికళతో విజయశాంతి గంటకు పైగా భేటీ అయినట్టు తెలుస్తోంది. ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావు ప్రతిపాదిస్తున్న బీజేపీ, కాంగ్రెసేతర ఫెడరల్ ఫ్రంట్‌పై శశికళ ఆరా తీసినట్టు సమాచారం. ఆ కూటమిలో చేరితే ఎలా ఉంటుందన్న విషయంపైనా విజయశాంతితో శశికళ చర్చించినట్టు తెలుస్తోంది. శశికళతో విజయశాంతికి చాలా సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. జైలు శిక్ష అనుభవిస్తున్న ఆమెను విజయశాంతి పలు మార్లు కలిశారు. ఇటీవల ఆర్కే నగర్‌కు జరిగిన ఉప ఎన్నికల్లో శశికళ బంధువు దినకరన్‌కు మద్దతుగా విజయశాంతి ప్రచారం కూడా నిర్వహించారు. వీరిద్దరి తాజా కలకయిక మరోమారు ప్రాధాన్యం సంతరించుకుంది.

చేతులు కలిపిన కాంగ్రెస్, బీజేపీ




న్యూఢిల్లీ : ఆఫ్ఘనిస్తాన్‌కు భారత దేశం అందిస్తున్న సహకారంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ విరుచుకుపడ్డాయి. యుద్ధం వల్ల తీవ్రంగా దెబ్బ తిన్న ఆఫ్ఘనిస్తాన్‌కు భారతదేశం బలమైన మద్దతుదారుగా నిలుస్తోంది. వేల కోట్ల డాలర్లతో అనేక ప్రాజెక్టులను చేపడుతోంది. సైనిక శిక్షణ కూడా అందజేస్తోంది. చైనా ప్రాబల్యాన్ని ఆసియాలో తగ్గించేందుకు అమెరికా, భారతదేశం కలసి పని చేస్తున్నప్పటికీ, డొనాల్డ్ ట్రంప్ భారతదేశ కృషిని చిన్న చూపు చూస్తున్నారు. ఈ వైఖరి రాజకీయ పార్టీలను, సాధారణ ప్రజానీకాన్ని బాధించింది. ట్రంప్ బుధవారం వైట్ హౌస్‌లో విలేకరులతో మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోడీ ఆఫ్ఘనిస్తాన్‌లో ఓ గ్రంథాలయాన్ని నిర్మించినట్లు చెబుతూ ఉంటారన్నారు. దానికి ఖర్చు పెట్టిన సొమ్ము ఎంతో తెలుసా అని అడిగారు. మనం 5 గంటల్లో ఖర్చు చేసే సొమ్మును ఆ గ్రంథాలయానికి ఖర్చు పెట్టారన్నారు. ఆ గ్రంథాలయాన్ని ఆఫ్ఘనిస్తాన్‌లో ఎవరు ఉపయోగించుకుంటున్నారో తెలియదన్నారు. ట్రంప్ వ్యాఖ్యలపై బీజేపీ జనరల్ సెక్రటరీ రామ్ మాధవ్ స్పందిస్తూ, ఆఫ్ఘనిస్తాన్‌కు సహాయపడడానికి ట్రంప్ వెనుకాడుతున్నారని, ఆయన చాలా విషయాలు తెలుసుకోవలసి ఉందని పేర్కొన్నారు. భారత దేశం ఆఫ్ఘనిస్తాన్‌లో గ్రంథాలయాలను మాత్రమే కాకుండా రోడ్లు, ఆనకట్టలు, పాఠశాలలు, పార్లమెంటు భవనం వంటివి నిర్మిస్తోందని చెప్పారు. తాము జీవితాలను నిర్మిస్తున్నామని, అందుకు ఆఫ్ఘన్ ప్రజలు తమకు ధన్యవాదాలు చెబుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ కూడా ట్రంప్ వ్యాఖ్యలను ఖండించింది. ఆఫ్ఘనిస్తాన్ విషయంలో అమెరికా సూక్తులు తమకు అక్కరలేదని పేర్కొంది.

కన్నడ నటీనటుల ఇళ్లలో కేజీల కొద్దీ బంగారం

- స్పందించిన హీరోలు యశ్, సుదీప్
- 3న జరిగిన ఐటీ దాడులు
- 23 చోట్ల అధికారుల తనిఖీలు
- ఆదాయానికి, రిటర్న్‌లకు వ్యత్యాసమే కారణం
- శివకుమార్ కుటుంబానికి మరో షాక్ ఇచ్చిన ఐటీ అధికారులు
- ఆయన తల్లి కోసం దొడ్డహాలహళ్లికి వెళ్లిన అధికారులు

బెంగళూరు : కన్నడ సినీ పరిశ్రమ ప్రముఖులపై ఆదాయపు పన్ను శాఖ గురువారం దాడులు నిర్వహించిన సంగతి తెలిసిందే. శాండల్‌వుడ్‌లో పలు హిట్ చిత్రాలు తెరకెక్కిన నేపథ్యంలో నటీనటులు, నిర్మాతలు అందుకు అనుగుణంగా ఐటీ రిటర్న్‌లు దాఖలు చేయకపోవడంతో ఐటీ శాఖ అధికారులు గురువారం కర్నాటకలోని 23 చోట్ల తనిఖీలు చేపట్టారు. నటులు యశ్, పునీత్ రాజ్‌కుమార్, రాక్‌లైన్ వెంకటేశ్, సుదీప్, శివ రాజ్‌కుమార్‌తో పాటు ముఖ్యమంత్రి కుమారస్వామి భార్య రాధిక ఇంటిపై సైతం దాడులు జరిగాయి. తాజాగా ఈ ఐటీ దాడులపై కేజీఎఫ్ నటుడు యశ్ స్పందించాడు. ఈ విషయమై యశ్ మీడియాతో మాట్లాడుతూ, 'నాకేం భయం లేదు. ఐటీ దాడులకు భయపడను. నేనే తప్పు చేయలేదు. ఐటీ అధికారులను వారి పనిని చేసుకోనివ్వాలి. తొందరపడి ఎలాంటి నిర్ణయాలకు రావద్దు' అని అన్నాడు. మరో వైపు సుదీప్ మాట్లాడుతూ, 'ఐటీ దాడుల గురించి చింతించాల్సిన అవసరం లేదు. ఈ దాడులకు రాజకీయాలకు ఎలాంటి సంబంధమూ లేదు' అని వెల్లడించాడు. కాగా, ఈ దాడుల్లో అధికారులు విలువైన పత్రాలు, నగదు, బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.



శాండల్‌వుడ్ సెలబ్రిటీలపై గురువారం దాడులు చేసిన ఐటీ అధికారులు, వారి ఇళ్లలో బ్యాగుల కొద్దీ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలుస్తోంది. పునీత్, శివరాజ్ ఇళ్లలో రాత్రి అంతా సోదాలు చేసిన అధికారులు శుక్రవారం కూడా వాటిని కొనసాగించారు. నలుగురు స్టార్ హీరోలు, అగ్ర నిర్మాతలు, నటి రాధిక ఇళ్లపై ఏక కాలంలో దాడులు జరగగా, సుమారు 200 మందికి పైగా అధికారులు వీటిల్లో పాల్గొన్నారు. నిర్మాత రాక్‌లైన్ వెంకటేశ్, కిరంగందూరు విజయ్, ఎమ్మెల్సీ సీఆర్ మనోహర్, కిచ్చ సుదీప్, యశ్ తదితరుల ఇళ్లపైనా దాడులు జరుగుతున్నాయి. ఇక యశ్ ఇంట్లో భారీగా బంగారం బయటపడ్డట్టు తెలుస్తోంది. శివరాజ్, పునీత్, వెంకటేశ్ ఇళ్లలోనూ కిలోల కొద్దీ బంగారాన్ని అధికారులు గుర్తించారు. హీరోలు తీసుకుంటున్న పారితోషికాలు, వారు కడుతున్న పన్నుల వివరాలు, వారి పేరిట ఉన్న ఆస్తుల వివరాలను వీరు సేకరించారు. వీరి ఇళ్లలో విలువైన ఆస్తుల పత్రాలను అధికారులు గుర్తించినట్టు తెలుస్తోంది. ఈ దాడుల తరువాత తాము ఏమి గుర్తించిందీ అధికారులు ఇంకా నిర్ధారించలేదు. భారతీయ జనతా పార్టీ ప్రోద్బలంతోనే దాడులు జరుగుతున్నాయని హీరోల ఫ్యాన్స్, ప్రజా ప్రతినిధులు ఆరోపిస్తుండగా, అటువంటిదేమీ లేదని బీజేపీ నేతలు అంటున్నారు.

కర్నాటక మంత్రి డీకే శివకుమార్‌ను మూడు గంటల పాటు విచారించిన ఐటీ అధికారులు : కర్నాటక జల వనరుల శాఖ మంత్రి డీకే శివకుమార్ కుటుంబానికి ఆదాయపు పన్ను శాఖ అధికారులు మరో షాక్ ఇచ్చారు. గతంలో జరిపిన ఐటీ దాడులకు సంబంధించిన వివరాలను సేకరించేందుకు తమ కార్యాలయానికి రావాలని నోటీసుల్లో కోరారు. గురువారం డీకే శివకుమార్‌ను మూడు గంటల పాటు విచారించారు. మరో వైపు, శివకుమార్ తల్లి గౌరమ్మను విచారణకు రావాలని ఆదేశించారు. కనకపుర ప్రాంతంలోని దొడ్డహాలహళ్లి నివాసానికి ఐటీ అధికారులు వెళ్లారు. ఆమె అక్కడ లేకపోవడంతో ఇంటికి నోటీసులు అంటించారు. మరో వైపు, కక్ష పూరితంగానే శివకుమార్ కుటుంబంపై ఐటీ దాడులు నిర్వహిస్తున్నారని కాంగ్రెస్ శ్రేణులు ఆరోపిస్తున్నాయి.

అయోధ్య రామ మందిరం కేసుపై కీలక నిర్ణయం తీసుకున్న సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ : వివాదాస్పద అయోధ్య రామ మందిరం కేసును కొత్త ధర్మాసనానికి కేటాయించాలని సుప్రీం కోర్టు శుక్రవారం నిర్ణయించింది. అయోధ్య ఆలయ నిర్మాణం అంశానికి సంబంధించి దాఖలైన అన్ని పిటిషన్లపై చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఎస్ కే కౌల్ నేతృాఎత్వంలోని ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా, విచారణ ప్రక్రియపై కొత్త ధర్మాసనమే నిర్ణయం తీసుకుంటుందని తెలిపింది. తదుపరి విచారణను ఈ నెల 10కి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించింది. మరో వైపు, అయోధ్య వివాదంపై మొత్తం 14 పిటిషన్లు దాఖలయ్యాయి. వీటి విచారణ కోసం ముగ్గురు సభ్యులతో కూడిన ధర్మాసనాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

మమతకు షాకిచ్చిన మైనారిటీలు



కోల్‌కతా : 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. మైనారిటీలు గురువారం పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. సుమారు 2000 మంది కాంగ్రెస్ కండువా కప్పుకోవడం కోల్‌కతాలో చర్చనీయంగా మారింది. వీరిలో టీఎంసీ మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు షకీల్ అన్సారీ కూడా ఉండడం విశేషం. బీజేపీ, సీపీఎం పార్టీల నుంచి మరి 500 మంది కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మైనారిటీల చేరికతో కాంగ్రెస్ పార్టీలో జోష్ వచ్చిందంటున్నారు రాజకీయ విశ్లేషకులు.

శబరిమలలో మరో కలకలం

- అయ్యప్పను దర్శించుకున్న శ్రీలంక మహిళ
- అయ్యప్ప గర్భగుడిలోకి వెళ్లిన శ్రీలంక మహిళ
- గురువారం రాత్రి 18 మెట్లు ఎక్కి స్వామి గర్భగుడిలోకి
- ఆ వార్తలు అవాస్తవమన్న మహిళ
- బీజేపీకి షాకిచ్చిన కేంద్ర మంత్రి పాశ్వాన్
- ఆలయంలోకి మహిళలు వెళితే తప్పేమిటని ప్రశ్న
- రాష్ట్రవ్యాప్తంగా వందలాది మంది జర్నలిస్టులపై దాడులు

శబరిమల : అయ్యప్ప ఆలయంలోకి ఇద్దరు మహిళలు ప్రవేశించడంతో కేరళ అట్టుడుకుతోంది. మహిళల ప్రవేశాన్ని నిరసిస్తూ గురువారం కేరళ రాష్ట్ర వ్యాప్తంగా హిందూ సంస్థలు నిర్వహించిన బంద్ హింసాత్మకంగా మారింది. ఈ గొడవ సద్దుమణగక ముందే ఇప్పుడు మరో కలకలం రేగింది. శ్రీలంకకు చెందిన 46 ఏళ్ల మహిళ గురువారం రాత్రి ఆలయంలోకి ప్రవేశించిందన్న వార్త ఇప్పుడు ప్రకంపనలు సృష్టిస్తోంది. పోలీసులు సైతం ఈ విషయాన్ని ధ్రువీకరిస్తుండగా ఆమె మాత్రం తాను వెళ్లలేదని చెబుతుండడం గమనార్హం. అశోక్ కుమరన్ కుమార్తె శశికళగా ఆమెను గుర్తించారు. 1972 డిసెంబర్ 3న జన్మించిన ఆమె గురువారం రాత్రి కుటుంబ సభ్యులతో కలసి స్వామిని దర్శించుకున్నట్టు చెబుతున్నారు. సాధారణ దుస్తుల్లో ఉన్న పోలీసులతో కలసి ఆమె అయ్యప్పను దర్శించుకున్నారు. అనంతరం ఎటువంటి గందరగోళమూ లేకుండా పంబకు చేరుకున్నట్టు చెబుతున్నారు. జాతీయ పత్రిక ది హిందూ కథనం ప్రకారం, శశికళ పరమ పవిత్రమైన 18 మెట్లను ఎక్కి గర్భగుడిలోకి ప్రవేశించి పూజలు చేశారు. అయితే, తాను స్వామిని దర్శించుకున్నట్టు వస్తున్న వార్తలను శశికళ ఖండించారు. తానో భక్తురాలినని, 48 రోజుల దీక్షలో ఉన్నానని పేర్కొన్నారు. తనను వెనకకు పంపే అధికారం ఎవరికీ లేదన్నారు. వివిధ కారణాలతో తన గర్భసంచిని తొలగించారని, కాబట్టి అయ్యప్పను దర్శించుకునే హక్కు తనకు ఉందని వివరించారు. అందుకు సంబంధించిన వైద్య ధ్రువీకరణ పత్రం కూడా తన వద్ద ఉందన్నారు. కాగా, పోలీసు అధికారి ఒకరు మాట్లాడుతూ, శశికళ అయ్యప్పను దర్శించుకునే ఉంటారని, అయితే ఆ విషయాన్ని తాను కచ్చితంగా చెప్పలేనని పేర్కొన్నారు.

మహిళలు అంతరిక్షంలోకే వెళుతున్నారు... గుడిలోకి వెళ్లకూడదా?: కేంద్ర మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్ శబరిమల వివాదంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. అయ్యప్ప ఆలయంలోకి ఇద్దరు మహిళలు కనకదుర్గ, బిందు ప్రవేశించడాన్ని నిరసిస్తూ గురువారం రాష్ట్రవ్యాప్తంగా బంద్ నిర్వహించారు. ఈ ఘటనపై పాశ్వాన్ మాట్లాడుతూ, మహిళలు ఎల్లలు లేకుండా ఎదుగుతున్నారని పేర్కొన్నారు. అంతరిక్షంలోకి కూడా మహిళలు వెళుతున్నారని అంటూ, ఆలయంలోకి ఎందుకు వెళ్లకూడదని ప్రశ్నించి బీజేపీ ఝలక్కిచ్చారు. మహిళల పేరుతో వివక్ష తగదని సూచించారు. సుప్రీం కోర్టు కూడా ఇదే విషయాన్ని చెప్పిందని పాశ్వాన్ స్పష్టం చేశారు. కేరళ వివాదంపై మరో మంత్రి అనంతకుమార్ హెగ్డే మాట్లాడుతూ, అయ్యప్ప ఆలయంలోకి ఇద్దరు మహిళల ప్రవేశానికి కేరళ సర్కార్ మద్దతు ఇవ్వడాన్ని హిందుత్వంపై పట్టపగలు జరిగిన అత్యాచారమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతలోనే పాశ్వాన్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.


మీడియా ప్రతినిధులపై దాడి, వెంటనే బీజేపీకి షాకిచ్చిన జర్నలిస్టులు: గత రెండు రోజులుగా కేరళ అట్టుడికిపోతోంది. శబరిమల అయ్యప్ప ఆలయంలోకి ఇద్దరు మహిళల ప్రవేశంతో వేడెక్కిన వాతావరణం ఇంకా చల్లారలేదు. మహిళల గర్భగుడి ప్రవేశానికి నిరసనగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా బంద్ నిర్వహించారు. బుధవారం మధ్యాహ్నం నుంచే కేరళలో వాతావరణం ఉద్రిక్తంగా మారింది. గురువారం బంద్‌తో అది హింసాత్మకమైంది. బంద్ పేరుతో ఆందోళనకారులు దుకాణాలపై దాడి చేసి విధ్వంసం సృష్టించారు. రోడ్లపై హంగామా చేశారు. అక్కడితో ఆగక జర్నలిస్టులపై దాడికి దిగారు. పాత్రికేయులపై బుధవారం సాయంత్రం నుంచే జరుగుతున్న దాడులు గురువారం కూడా కొనసాగాయి. బంద్‌ను కవర్ చేసేందుకు వచ్చిన పాత్రికేయులు, ఫోటో, వీడియో జర్నలిస్టులపై అల్లరి మూక దాడులకు పాల్పడింది. మహిళా రిపోర్టర్లను కూడా వదలకుండా యథేచ్ఛగా దాడులకు దిగారు. బంద్‌లో తమపై జరిగిన దాడికి జర్నలిస్టులు తీవ్రంగా స్పందించారు. తిరువనంతపురం, కోజికోడ్‌లలో బీజేపీ నేతలు నిర్వహించిన ప్రెస్ మీట్‌ను బాయ్‌కాట్ చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ శ్రీధరన్ పిళ్లై తిరువనంతపురంలో, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సుందరన్ కోజికోడ్‌లో నిర్వహించిన మీడియా సమావేశాలను మీడియా బాయ్‌కాట్ చేసింది. దీంతో



వారి ప్రెస్ మీట్ బోసిపోయింది. గత రెండు రోజులుగా వందలాది మంది జర్నలిస్టులపై సంఘ్ పరివార్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా దాడులు జరుగుతున్నాయని కేరళ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (కేయూడబ్ల్యూజే) ఆవేదన వ్యక్తం చేసింది. తమ వార్తలను కవర్ చేయాలని కోరుతూనే జర్నలిస్టులను బీజేపీ నేతలు చావగొడుతున్నారని ఆరోపించింది. ఇకపై సహించేది లేదని తేల్చి చెప్పింది. అందుకే బీజేపీ మీడియా సమావేశాలను బహిష్కరించినట్టు వివరించింది.

బిందు, కనకదుర్గ మాల దుస్తులు నటనే : రెండు రోజుల క్రితం తెల్లవారు జామున శబరిమల అయ్యప్ప సన్నిధికి వచ్చి స్వామి దర్శనం చేసుకున్న ఇద్దరు మహిళలు బిందు, కనకదుర్గ అసలు మాల ధరించలేదని, ఆలయానికి వచ్చే కొన్ని గంటల ముందు వరకు వారు మామూలు దుస్తులతోనే తిరిగారన్న వీడియో సాక్ష్యాన్ని శబరిమల పరిరక్షణ సమితి విడుదల చేసింది. డిసెంబర్ 31న వారిద్దరూ బస చేసిన హోటల్‌లో సాధారణ దుస్తులు ధరించి తిరుగుతున్న దృశ్యాలను సమితి బయటపెట్టడంతో మరోసారి కేరళలో తీవ్ర కలకలం రేగింది. అయ్యప్ప ఆలయానికి వారిద్దరూ మాలలు ధరించి, నల్ల దుస్తులతో వచ్చిన సంగతి తెలిసిందే. మహిళల స్వామి దర్శన వివాదం ఇప్పటికే కేరళను అతలాకుతలం చేస్తుండగా, వారిద్దరూ మాలలో ఉన్నట్టు నటించి స్వామి సన్నిధికి వచ్చారని, కనీసం నుదుటిన విభూది, కుంకుమ కూడా ధరించలేదని శబరిమల పరిరక్షణ సమితి ప్రతినిధులు మండిపడ్డారు. ప్రభుత్వ ప్రోత్సాహంతోనే వారిద్దరూ ఆలయ ప్రవేశం చేశారని వారు ఆరోపిస్తున్నారు. శబరిమలలో ప్రభుత్వ జోక్యాన్ని నిరసిస్తూ, రెండు రోజులుగా కేరళ వ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్న సంగతి తెలిసిందే.

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు భారీ షాక్



న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు భారీ షాక్ తగిలింది. పంజాబ్‌కు చెందిన ఆ పార్టీ నేత, సీనియర్ అడ్వకేట్ హెచ్‌ఎస్ ఫూల్కా పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు ట్విట్టర్ ద్వారా తెలిపారు. రాజీనామా విషయంలో పునరాలోచించుకోవాలని కేజ్రీవాల్ తనను కోరారని, అయితే, తాను ఇప్పటికే నిర్ణయం తీసేసుకున్నానని పేర్కొన్నారు. 'ఆమ్ ఆద్మీ పార్టీకి నేను రాజీనామా చేశాను. ఆ లేఖను కేజ్రీవాల్‌కు అందజేశాను. రాజీనామా విషయంలో నన్ను పునరాలోచించుకోవాలని అడిగారు. అయితే, ఇప్పటికే తాను ఓ నిర్ణయానికి వచ్చేసినట్టు ఆయనకు వివరించా' అని ఫఫ్తుల్కా ట్విట్టర్ ద్వారా తెలిపారు. మీడియా సమావేశం నిర్వహించి రాజీనామాకు గల కారణాలు, భవిష్యత్ కార్యాచరణను వెల్లడిస్తానని ఫూల్కా తెలిపారు.

సైకిల్‌ను ఢీకొని తుక్కైన కారు



బీజింగ్ : ఒక సైకిల్, ఒక కారు ఢీకొంటే ఏమవుతుందో అందరికీ తెలిసిందే. సైకిల్ తుక్కు తుక్కు అవుతుంది. కానీ చైనాలో దీనికి విరుద్ధంగా దిమ్మతిరిగే ఘటన జరిగింది. సైకిల్‌ను ఢీకొన్న కారు ధ్వంసమైంది. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఘటనలో కారు బంపర్ మొత్తం లోపలకు నొక్కుకుపోయింది. ఇదే సమయంలో సైకిల్‌కు కొంచెం కూడా డ్యామేజ్ కాకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. దక్షిణ చైనాలోని షెంఝెన్ నగరంలో ఇది చోటు చేసుకుంది. సోషల్ మీడియాలో దీని ఫోటోలు చూసినవారు తొలుత ఫేక్ ఫోటోలు అని భావించారు. కానీ, స్థానిక పోలీసులు ఇది నిజంగా జరిగిందంటూ స్పష్టత ఇచ్చారు. దీనికి సంబంధించిన వీడియోను విడుదల చేశారు. ఈ ప్రమాదంలో ఎవరూ తీవ్ర గాయాలకు గురి కాలేదని, సైకిల్‌పై ఉన్న వ్యక్తికి మాత్రం స్వల్ప గాయాలయ్యాయని చెప్పారు.

రిషబ్ పంత్ మరో రికార్డు



సిడ్నీ : ఆసీస్‌తో జరుగుతున్న చివరి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో శతకం బాదిన పంత్ ఖాతాలో మరో రికార్డు చేరింది. ఉపఖండం ఆవల అత్యధిక పరుగులు చేసిన వికెట్ కీపర్‌గా రికార్డు సృష్టించాడు. తొలిసారిగా ఈ ఘనత పాకిస్థాన్ వికెట్ కీపర్ మొయిన్ ఖాన్‌కు దక్కింది. 2003లో హామిల్టన్‌లో జరిగిన టెస్టులో అతను అత్యధికంగా 137 పరుగులు చేశాడు. ఆతర్వాత శ్రీలంక క్రికెటర్ దినేశ్ చండిమాల్ 2016లో చెస్టర్‌లీ స్ట్రీట్‌లో జరిగిన టెస్టులో 126 పరుగులు చేశాడు. బంగ్లాదేశ్ క్రికెటర్ ముష్ఫికర్ రహీమ్ 2017లో 159 పరుగులు చేసి తొలి స్థానంలో నిలిచాడు. ఇప్పుడు సిడ్నీ వేదికగా జరిగిన టెస్టులో పంత్ సైతం 159 పరుగులు చేసి నాటౌట్‌గానిలవడంతో ఈ రికార్డు పంత్ సొంతమైంది. సిడ్నీ వేదికగా టీమిండియా తొలిసారి 1986లో నాలుగు వికెట్ల నష్టానికి 600 పరుగుల భారీ స్కోరు చేసింది. అప్పటివరకు అదే రికార్డు. తర్వాత 2004లో ఏడు వికెట్ల నష్టానికి 705 పరుగులు చేసింది. తర్వాత 2008లో 532 పరుగులు రాబట్టింది. దాదావు పదేళ్ల తర్వాత సిడ్నీ టెస్టులో భారత జట్టు ఇప్పుడు 622 పరుగులు చేసింది. సిడ్నీ వేదికగా చేసిన పరుగుల్లో ఇది రెండో అత్యధిక భారీ స్కోరు.

భారత్‌తో వన్డే సిరీస్‌కు కంగారూల జట్టు ఎంపిక



సిడ్నీ : భారత్‌తో ఈనెల 12 నుంచి ప్రారంభం కానున్న వన్డే సిరీస్ కోసం క్రికెట్ ఆస్ట్రేలియా 14 మందితో కూడిన జట్టును ప్రకటించింది. ట్రావిస్ హెడ్, క్రిస్ లిన్, డిఆర్కీ షార్ట్, బెన్ మెక్‌డెర్మాట్, ఆల్‌రౌండర్ ఆష్టన్ అగర్‌లపై వేటేసిన క్రికెట్ ఆస్ట్రేలియా.. ఆఫ్ స్పిన్నర్ నాథన్ లియాన్, బ్యాట్స్‌మన్ ఉస్మాన్ ఖావాజా, మీడియం పేసర్ పీటర్ సిడెల్‌లకు చోటు కల్పించింది. పేస్ త్రయం మిచెల్ స్టార్క్, జోష్ హేజిల్‌వుడ్, పాటి కమిన్స్‌లకు విశ్రాంతి ఇచ్చింది. త్వరలో శ్రీలంకతో జరగనున్న రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను దృష్టిలో పెట్టుకుని వీరికి విశ్రాంతి ఇచ్చింది.

ఆస్ట్రేలియా జట్టు : అరోన్ ఫించ్ (కెప్టెన్), ఉస్మాన్ ఖావాజా, షాన్ మార్ష్, పీటర్ హ్యాండ్స్‌కోంబ్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, మార్కస్ స్టోయిన్స్, మిచ్ మార్ష్, అలెక్స్ కేరీ, రిచర్డ్‌సన్, బిల్లీ స్టాన్‌లేక్, జాసన్ బెహ్రెండార్ఫ్, పీటర్ సిడెల్, నాథ్ లియాన్, ఆడం జంపా.

ఆసీస్ జట్టు కూర్పుపై మండిపడ్డ షేన్ వార్న్



ఆసీస్ జట్టు కూర్పుపై మాజీ స్పిన్ దిగ్గజం షేన్ వార్న్ నిప్పులు చెరిగాడు. భారత్‌తో ఈ నెల 12 నుంచి ప్రారంభం కానున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం క్రికెట్ ఆస్ట్రేలియా 14 మందితో కూడిన జట్టును ప్రకటించింది. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ప్రదర్శన బాగాలేదంటూ ఐదుగురు ఆటగాళ్లు ట్రావిస్ హెడ్, క్రిస్ లిన్, డిఆర్కీ షార్ట్, బెన్ మెక్ డెర్మాట్, ఆల్‌రౌండర్ ఆష్టన్ అగర్‌లను జట్టు నుంచి తప్పించింది. మిచెల్ స్టార్క్, పాట్ కమిన్స్‌లకు విశ్రాంతి ఇవ్వగా నాథన్ లియాన్, ఉస్మాన్ ఖావాజా, వెటరన్ పీటర్ సిడెల్‌లను జట్టులోకి తీసుకుంది. జట్టు కూర్పుపై ఆసీస్ మాజీ స్పిన్ లెజెండ్ షేన్ వార్న్ తీవ్ర విమర్శలు గుప్పించాడు. సెలక్షన్ హాస్యాస్పందంగా ఉందని, సెలక్షన్‌లో కొంచెం కూడా బుర్ర ఉపయోగించలేదని మండిపడ్డాడు. ఇలాంటి సెలక్షన్ ఏ ఫార్మాట్‌లోనూ పనికిరాదని ఆగ్రహం వ్యక్తం చేశాడు. అంతకుముందు భారత్‌తో తలపడే ఆసీస్ జట్టు ఇలా ఉండబోతోందంటూ ఓ జాబితాను ట్విట్టర్‌లో విడుదల చేశాడు. దీనికీ, క్రికెట్ ఆస్ట్రేలియా ఎంపిక చేసిన జట్టుకు ఏమాత్రం పొంతన లేకుండా పోయింది. ఆరు నెలల పాటు వన్డే ఫార్మాట్‌కు దూరంగా ఉన్న లియాన్‌ను, జనవరి 2017లో పాకిస్థాన్‌తో ఆడిన వన్డే తర్వాత ఒక్క మ్యాచ్ కూడా ఆడని ఉస్మాన్ ఖావాజాను జట్టులోకి తీసుకోవడాన్ని వార్న్ తీవ్రంగా తప్పుబట్టాడు. అలాగే, నవంబరు 2010లో చివరిసారి వన్డే మ్యాచ్ ఆడిన మీడియం పేసర్ పీటర్ సిడెల్ (34)ను జట్టులోకి ఎలా తీసుకుంటారని ప్రశ్నించాడు. జట్టు కూర్పుపై సెలక్టర్ ట్రెవర్ హాన్స్ మాట్లాడుతూ.. ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని ఆటగాళ్లను ఎంపిక చేసినట్టు తెలిపాడు. కాగా, వార్న్ ప్రకటించిన జట్టులో ఉన్న అగర్, షార్ట్, జేమ్స్ ప్యాటిసన్‌లకు ఆసీస్ జట్టులో చోటు లభించకపోవడం గమనార్హం.

భారత బ్యాట్స్‌మన్ వీరంగం



- పుజారా, పంత్ శతకాల మోత
- 7 వికెట్ల నష్టానికి 622 పరుగులు చేసిన భారత్
- 168 ఓవర్ల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసిన కోహ్లీ
- తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ స్కోరు 24 పరుగులు
- భారత్-ఆస్ట్రేలియా మధ్య నాల్గోటెస్టు



సిడ్నీ : భారత్- ఆస్ట్రేలియాల మధ్య ఇక్కడ జరుగుతున్న చివరిదైన నాలుగో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా బ్యాట్స్‌మెన్ అదరగొట్టారు. దీంతో తొలి ఇన్నింగ్స్‌ను కోహ్లీసేన 622/7 వద్ద డిక్లేర్ చేసింది. 168వ ఓవర్లో జడేజా(81) పెవిలియన్ చేరిన అనంతరం టీమిండియా సారథి విరాట్ కోహ్లీ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేస్తున్నట్లు ప్రకటించా డు. చివరిదైన నాలుగో టెస్టు రెండో రోజు ఆటలో భాగంగా 303/4 ఓవర్‌నైట్ స్కోరుతో మ్యాచ్ ప్రారంభించిన కోహ్లీ సేన మరో 319 పరుగులు జోడించింది. పుజారా (193), రిషబ్ పంత్ (159; నాటౌట్) రాణించడంతో ఆసీస్ ముందు టీమిండియా భారీ స్కోరును నిలిపింది. తొలి ఇన్నింగ్స్‌లో నాథన్ నాలుగు వికెట్లు తీయగా... హేజిల్‌వుడ్ రెండు, మిచెల్ స్టార్క్ ఒక వికెట్ పడగొట్టాడు. ఆస్ట్రేలియా గడ్డపై భారత్ చేసిన రెండో భారీ స్కోరు ఇది కావడం విశేషం. 2004లో సిడ్నీ స్టేడియంలోనే భారత్ 7 వికెట్ల నష్టానికి 705 పరుగులు చేసింది.

ఆదిలోనే విహారి నిష్క్రమణ

తొలుత 303/4 ఓవర్‌నైట్ స్కోర్‌తో బ్యాటింగ్ మొదలు పెట్టిన టీమిండియాకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. తొలి పది ఓవర్లలోనే కోహ్లీసేన ఐదో వికెట్ చేజార్చుకుంది. తొలి రోజు నుంచి పుజారాతో కలిసి కీలక ఇన్నింగ్స్ నిర్మించిన హనుమ విహారి(42)ని నాథన్ లైయన్ పెవిలియన్ చేర్చాడు. పుజారాతో కలిసి విహారి 101 పరుగుల భాగస్వామ్యాన్ని జోడించాడు.

పుజారా హవా

టీమిండియా మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ చెప్పినట్లు.. కొన్నాళ్ల తర్వాత ఈ సిరీస్‌ను గుర్తు చేసుకుంటే ముందు పుజారా పేరే స్ఫురిస్తుందేమో. నాలుగో టెస్టు తొలి ఇన్నింగ్స్ టీమిండియా నయావాల్‌దే అనడంలో సందేహమే లేదు. తొలి రోజునుంచి ఆసీస్ బౌలర్లకు చుక్కలు చూపించిన పుజారా తొలి రోజే రికార్డు శతకం నమోదు చేసుకున్నాడు. తొలి రోజు ఆటముగిసే సమయానికి 130 పరుగులు చేసి రెండో రోజూ అదే జోరు కొనసాగించాడు. 193 పరుగులు చేసి ద్విశతకానికి దగ్గరగా వచ్చిన పుజారాను లైయన్ అడ్డుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో నయావాల్ మొత్తంగా 22 బౌండరీలు బాదాడు. 130 ఓవర్లో లైయన్ వేసిన ఆఖరు బంతిని అంచనా వేయలేకపోయిన పుజారా..అతడికే క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. దీంతో ద్విశతకం చేయాలన్న పుజారా కల చెదిరింది. అప్పటికి టీమిండియా 420 పరుగులు చేసింది.

శతకబాదిన పంత్

తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన పంత్ దుమ్ములేపాడు. పైన్ సేన ముందు భారీ లక్ష్యాన్ని ఉంచడంలో కీలక పాత్ర పోషించాడు. ఎడాపెడా బౌండరీలు బాదుతూ 137 బంతుల్లో టెస్టు కెరీర్‌లో రెండో శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. మరో ఎండ్‌లో ఉన్న జడేజా సైతం పంత్‌కు సహకరిస్తూ టెస్టు కెరీర్‌లో పదో అర్ధశతకాన్ని పూర్తి చేసుకున్నాడు. తర్వాత దూకుడు పెంచిన పంత్- జడేజా జోడీ స్కోరు బోర్డును 600 దాటించింది. దీంతోపాటు 204 కీలక భాగస్వామ్య పరుగులను అందించింది. ఒకానొక దశలో పంత్ ద్విశతకం, జడేజా శతకం చేసేలా కనిపించారు. బౌండరీలు బాదుతూ స్టేడియాన్ని కాసేపు హోరెత్తించారు. దూసుకుపోతున్న ఈ జంటను నాథన్ లైయన్ విడదీశాడు. 168వఓవర్లో నాథన్ వేసిన బంతికి జడేజా 81 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద బౌల్డ్ అయ్యాడు. అప్పటికే జట్టు స్కోరు 600 దాటింది. దీంతో టీమిండియా సారథి విరాట్ కోహ్లీ 622/7 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేస్తున్నట్లు ప్రకటించాడు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో వికెట్లు కోల్పోకుండా 24 పరుగులు చేసింది.

స్కోరు వివరాలు - భారత్ తొలి ఇన్నింగ్స్ : మయాంక్ అగర్వాల్ సి స్టార్క్ బి లియాన్ 77, లోకేష్ రాహుల్ సి షాన్ మార్ష్ బి హజ్లివుడ్ 9, ఛతేశ్వర్ పుజారా సి అండ్ బి లియాన్ 193, విరాట్ కోహ్లీ సి పెయిన్ బి హజ్లివుడ్ 23, అజియెంక్యా రహనే సి పెయిన్ బి స్టార్క్ 18, హనుమ విహారి సి లబుస్‌ఛేగ్‌నే బి లియాన్ 42, రిషబ్ పంత్ నాటౌట్ 159, రవీంద్ర జడేజా బి లియాన్ 81. అదనం-20. మొత్తం (167.2 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి) 622 డిక్లేర్డ్. బౌలింగ్ : మిచ్చెల్ స్టార్క్ 26-0-123-1, జోష్ హజ్లివుడ్ 35-11-105-2, పాట్ కమ్మిన్స్ 28-5-101-0, నాథన్ లియాన్ 57.2-8-178-4, మార్నూస్ లబుస్‌ఛేగ్‌నే 16-0-76-0, ట్రావెస్ హెడ్ 4-0-20-0, ఉస్మాన్ ఖవాజ్ 1-0-4-0.
ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : మార్కస్ హరీస్ బ్యాటింగ్ 19, ఉస్మాన్ ఖవాజ్ బ్యాటింగ్ 5. అదనం-24. మొత్తం : (10 ఓవర్లలో వికెట్లేమీ కోల్పోకుండా) 24. బౌలింగ్ : మహ్మద్ శమి 3-0-9-0, జస్ప్రీత్ బుమ్రా 3-0-12-0, రవీంద్ర జడేజా 2-1-1-0, కుల్‌దీప్ యాదవ్ 2-1-2-0.

అతిథుల్ని గౌరవించడం నేర్చుకోండి..

కోహ్లీకి అవమానంపై స్పందించిన సీఏ

సిడ్నీ : ఆస్ట్రేలియా గడ్డపై టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ రెండుసార్లు అవమానానికి గురయ్యాడు. అడిలైడ్‌లో జరిగిన తొలి టెస్టు సందర్భంగా ఆసీస్ ప్రేక్షకులు కోహ్లీని వెకిలి చేష్టలతో అవమానించారు. తాజాగా సిడ్నీ టెస్టులోనూ కోహ్లీకి అటువంటి అనుభవమే ఎదురైంది. కోహ్లీ బ్యాటింగ్‌కు దిగుతున్నప్పుడు ఆసీస్ అభిమానులు అతడిని వెక్కిరిస్తూ విపరీత వ్యాఖ్యలు చేశారు. అనుచితంగా ప్రవర్తించారు. కోహ్లీకి రెండుసార్లు ఇదే అనుభవం ఎదురుకావడంపై క్రికెట్ ఆస్ట్రేలియా సీఈవో కెవిన్ రాబర్ట్స్ తీవ్రంగా స్పందించాడు. అభిమానులు ఇటువంటి చర్యలకు పాల్పడడం సరికాదన్నాడు. దేశానికి వచ్చిన అతిథులను ఇలా అవమానించడం సరికాదంటూ ప్రేక్షకుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశాడు. అతిథులను గౌరవించడం నేర్చుకోవాలని హితవు పలికాడు. మనందరికంటే ఆట గొప్పది. అతిథులను మనం గౌరవించాలి. మన దేశానికి వచ్చినప్పుడు వారికి అందమైన అనుభవం ఇవ్వాలి. అయితే, మైదానంలో మాత్రం కలబడాని అన్నాడు.

లవ్ యూ... అండ్ హ్యాపీ బర్త్‌డే మామ్

- రిషభ్ పంత్ ఎమోషనల్ మెసేజ్!
- సోషల్ మీడియాలో వైరల్



సిడ్నీ : టీమిండియా వికెట్ కీపర్-బ్యాట్స్‌మన్ రిషభ్‌పంత్ కొత్త ఏడాదిని ఘనంగా ప్రారంభించాడు. సిడ్నీలో జరుగుతున్న నాలుగో టెస్టులో అజేయ సెంచరీ (159) చేశాడు. ఈ ఒక్క సెంచరీతో పంత్ ఖాతాలో రెండు రికార్డులు వచ్చి చేరాయి. ఆసీస్ గడ్డపై సెంచరీ చేసిన తొలి భారత వికెట్ కీపర్‌గా, 150కిపైగా పరుగులు చేసిన భారత కీపర్లలో నాలుగోవాడిగా రికార్డులకెక్కాడు. అయితే, ఈ రెండు రికార్డులను తన తల్లి పుట్టిన రోజు నాడే సొంతం చేసుకోవడం విశేషం. ఈ సందర్భంగా తన తల్లికి బర్త్‌డే విషెస్ చెబుతూ భావోద్వేగానికి గురయ్యాడు. హ్యాపీ బర్త్‌డే అమ్మా. నిత్యం నా వెన్నంటి ఉండి నన్ను నడిపించిన నువ్వంటే నాకెంతో ఇష్టం. నిన్నెంతగానో ప్రేమిస్తున్నా. శిక్షణ, మ్యాచ్‌ల సమయాల్లో నాతోపాటు ప్రయాణించిన ఆ రోజులను మర్చిపోలేను. నా మీద ఒత్తిడి పడకూడదని నా ఒత్తిడి మొత్తాన్ని నీ మీద వేసుకున్న నీకు కృతజ్ఞతలు చెప్పేందుకు మాటలు సరిపోవు. లవ్ యూ అండ్ హ్యాపీ బర్త్‌డే వన్స్ అగైన్ అని ఇన్‌స్టాగ్రామ్‌లో చేసిన పోస్ట్ వైరల్ అవుతోంది.

ఆ రాష్ట్ర కార్యక్రమాలను బహిష్కరించాలి

ఆచ్రేకర్ అంత్యక్రియల తీరుపై మండిపడిన శివసేన



ముంబయి : క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ గురువు, ద్రోణాచార్య పురస్కార గ్రహీత రమాకాంత్ ఆచ్రేకర్ అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించలేదని శివసేన పార్టీ మహారాష్ట్ర ప్రభుత్వంపై మండిపడింది. ఇకనుంచి మహారాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొనకుండా బహిష్కరించాలని సచిన్‌ను కోరింది. వృద్ధాప్య సమస్యలతో బుధవారం సాయంత్రం ముంబయిలోని తన స్వగృహంలో ఆచ్రేకర్ కన్నుమూశారు. ప్రపంచానికి సచిన్ లాంటి దిగ్గజాన్ని అందించిన గురువుగా ఆయన్ అందరికీ సుపరిచితం. పద్మశ్రీ, ద్రోణాచార్య అవార్డు గ్రహీత అయిన రమాకాంత్ ఆచ్రేకర్‌కు ఎందుకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించలేదు? మహారాష్ట్ర ప్రభుత్వం ఆయన్ను నిర్లక్ష్యం చేసింది. దీనికి నిరసనగా ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనకుండా సచిన్ వాటిని బహిష్కరించాలి అని ఆ పార్టీ సీనియర్ నాయకుడు సంజయ్ రౌత్ అన్నారు. సేన పార్టీ పత్రిక సామ్నాలో ఆచ్రేకర్ సేవలను కొనియాడుతూ ఓ కథనాన్ని ప్రచురించింది. అలాగే ఆయన అంత్యక్రియలు నిర్వహించిన తీరుపై విమర్శలు చేసింది. ఇది క్రికెట్‌కు ఆయన చేసిన సేవలను తక్కువ చేయడమే కాకుండా, ప్రభుత్వ అసమర్థతను వెల్లడిస్తుందని మండిపడింది. గత సంవత్సరం గురు పూర్ణిమ రోజున సచిన్.. ఆచ్రేకర్‌ను కలిసి కృతజ్ఞతలు చెప్పారు. క్రికెట్‌లో సాధించిన విజయాలకు తన గురువు అందించిన ప్రోత్సాహమే కారణమని ఆయన ఆశీర్వాదాలు తీసుకున్నారు. దానికి సంబంధించిన వీడియోను ట్విటర్‌లో అభిమానులతో పంచుకున్నారు సచిన్.

విరుష్క కొత్త ఫొటోలు వైరల్



న్యూఢిల్లీ : నాలుగు టెస్టుల సిరీస్ కోసం టీం ఇండియా ఆస్ట్రేలియా పర్యటనలో ఉండగా.. ఆస్ట్రేలియాతో జరుగుతున్న టెస్టు మ్యాచ్‌ల్లో కెప్టెన్ విరాట్ కోహ్లీ పరుగుల వరద పారిస్తున్నారు. అయితే కోహ్లీ భార్య అనుష్కశర్మ కూడా ప్రస్తుతం ఆస్ట్రేలియాలో ఉన్నారు. సిడ్నీ మైదానంలో ఆస్ట్రేలియా, భారత్ మధ్య జరుగుతున్న నాలుగో టెస్టులో కోహ్లీ ఆడుతుండగా అనుష్క శర్మ నవ్వుతూ సందడి చేశారు. కెమెరా ఆమె వైపు తిప్పగానే అనుష్క సిగ్గుపడూ కళ్లకు చేతులు అడ్డం పెట్టుకొని నవ్వారు. ప్రస్తుతం ఈ ఫోటో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. నూతన సంవత్సర వేడుకలను కోహ్లీ, అనుష్క ఆస్ట్రేలియాలో జరుపుకున్నారు. కొత్త ఏడాదిలో కోహ్లీ, అనుష్క దిగిన మరో ఫొటో వైరల్ అవుతుంది. ఈ ఫోటోను అనుష్క శర్మ తన ట్వీట్టర్‌లో పోస్ట్ చేసింది. నాలుగో టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో భారత బ్యాట్స్‌మెన్ పరుగుల వరద పారించారు. మొదటి ఇన్నింగ్స్ 622/7 వద్ద టీం ఇండియా డిక్లేర్ చేసింది.

గతం కంటే 'ఫిట్'గా ఉన్నా..!

- 2020 ఓలంఫిక్‌లో పథకం సాధనే లక్ష్యం
- భారత జిమ్నాస్టిక్ క్రీడాకారిణి అరుణారెడ్డి



హైదరాబాద్, సూర్య ప్రధాన ప్రతినిధి : జర్మనీలో 2016లో జరిగిన పోటీలలో తాను గాయపడ్డానని, అనంతరం కాంటినెంటల్ హాస్పిటల్‌లోని డాక్టర్లు రామ్మోహన్‌రెడ్డి, దీప్తీనందారెడ్డి, శ్రీధర్ తదితరులు చేసిన శస్త్రచికిత్సల వల్ల తాను గతం కంటే 'ఫిట్'గా తయారయ్యానని ఓలంఫిక్ క్రీడాకారిణి, హైదరాబాద్‌కు చెందిన అరుణారెడ్డి తెలిపారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో కాంటినెంటల్ ఆసుపత్రి ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కాంటినెంటల్ ఆసుపత్రి సీఇఓ ఫైసల్ సిద్ధికీతో పాటు ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరుణారెడ్డి మాట్లాడుతూ క్రీడాపోటీలలో తాను గాయపడ్డ తర్వాత ఎన్నో ఆసుపత్రులు, దేశంలోని పలువురి డాక్టర్లను కలిసినట్లు తెలిపారు. మోకాలికి తగిలిన గాయంతో తాను ఇక క్రీడల్లోపాల్గొనన్న ఆందోళనతో ఉన్న సమయంలో కాంటినెంటల్ ఆసుపత్రితో ఆర్థోపెడిక్ నిపుణులు రామ్మోహన్‌రెడ్డిని కలిసినట్లు తెలిపారు. రామ్మోహన్‌రెడ్డి ఏసీఎల్ రికన్‌స్ట్రక్షన్ సర్జరీ చేయడంతో నా జీవితం మలుపునకు దారి తీసిందన్నారు. ఆసుపత్రికి చెందిన డాక్టర్లు రామ్మోహన్‌రెడ్డి, దీప్తినందారెడ్డి, శ్రీధర్ తదితరులు తనకు అందించిన వైద్యంతో తాను మునుపటికన్నా మిన్నగా 'ఫిట్'గా మారానని తెలిపారు. 2020లో జరిగే ఓలంఫిక్ ఆటల్లో స్వర్ణపథకమే లక్ష్యంగా తాను పోటీకి సిద్ధపడుతున్నట్లు తెలిపారు. ఇందుకుగాను ఇప్పటి నుంచి తాను నిత్యం సాధన చేయబోతున్నట్లు తెలిపారు. అనంతరం ఆసుపత్రి సీఇఓ ఫైసల్ సిద్ధికీ మాట్లాడుతూ ఇలాంటి భారత క్రీడాకారిణికి వైద్యం అందిచండం, ఆమె కోలుకోవడంతో పాటు ఆమెను సత్కరించడం మ ఆకు గర్వకారణమన్నారు. మున్ముందు అరుణారెడ్డి క్రీడల్లో దేశానికి గర్వకారణంగా నిలుస్తారని ఆయన ఆకాంక్షించారు. అనంతరం ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించి, మెమెంటో అందజేశారు.

కోహ్లీ = పుజారా : గంగూలీ



ముంబయి : టీమిండియా నయావాల్ చెతేశ్వర్ పుజారాపై మాజీ సారథి సౌరవ్ గంగూలీ ప్రశంసల జల్లు కురిపించారు. అతడి అద్భుత ఆటతీరు ఆకట్టుకుందని ప్రశంసించారు. ప్రస్తుత సారథి విరాట్ కోహ్లీతో సమాన స్థాయి అతడికి ఉందన్నారు. ఆస్ట్రేలియాతో జరుగుతున్న సిరీస్‌లో పుజారా చెలరేగి ఆడుతున్న సంగతి తెలిసిందే. నాలుగు టెస్టుల్లో అతడు మూడు శతకాలు బాదేశాడు. విరాట్ కోహ్లీ 2014 ఆస్ట్రేలియా పర్యటనలో ఎలా చెలరేగాడో మనందరికీ గుర్తుంది. నాలుగు టెస్టుల్లో నాలుగు శతకాలు బాదేశాడు. ఇప్పుడు పుజారా అంతకన్నా ఎక్కువ ప్రభావం చూపించాడు. ఎందుకంటే అతడు శతకం బాదిన అన్ని మ్యాచ్‌లూ భారత్ గెలిచింది. సిడ్నీలోనూ అదే జరుగుతుందని అనిపిస్తోంది. ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ కైవసం చేసుకొనేందుకు టీమిండియా చేరువలో ఉంది. ప్రస్తుత మ్యాచ్‌లో కోహ్లీసేన ఓడిపోతుందని అనుకోను. మూడో స్థానంలో ఆడుతున్న పుజారా ఏ సారథికైనా ఒక ఆస్తిలాంటి వాడు. టెస్టు క్రికెట్‌లో ఈ స్థానం చాలా ముఖ్యమైంది. ఆర్నెల్ల క్రితం ఇంగ్లాండ్‌లో ఆడుతున్నప్పుడూ పుజారా స్ట్రైకరేట్ గురించి మాట్లాడారు. ఇప్పుడు ఉపఖండం ఆవల ఆస్ట్రేలియాపై అతడి మూడు శతకాలు ఎంత ప్రభావం చూపించాయో మనకు తెలిసిందే. అతడు వాండరర్స్‌లో 50 పరుగులు చేశాడు. అవి వంద పరుగులతో సమానం. ఈ టెస్టు సిరీస్ తర్వాత టెస్టు జట్టులో పుజారా విరాట్ కోహ్లీతో సమానమని భావిస్తున్నా అని గంగూలీ అన్నారు.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2-293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO 22, DOOR NO.8-2- 293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS HYDERABAD-33, TELANGANA. PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2- 293/82/A/22,ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044·